# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 168 | హైదరాబాద్ | మంగళవారం 23-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

తెలంగాణలో అక్రిడిటేషన్లపై జీవో విడుదల



11లో

## ‘బ్లూబర్డ్ బ్లాక్-2’ ప్రయోగం ముంగిట

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్

- కీలక ప్రయోగానికి ముందు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్
- డిసెంబర్ 24న LVM3-M6 రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం
- అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్-2 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్న ఇస్రో
- సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా 4G/5G సేవలు అందించడమే లక్ష్యం

# హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది..

### ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము

- ముగిసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది
- హైదరాబాద్ పర్యటన ముగించుకుని సోమవారం ఢిల్లీకి తిరుగుపయనం
- హకీంపేట ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికిన గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి
- పర్యటనలో భాగంగా పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్రపతి

11లో



## ఛత్తీస్ గఢ్ సరిహద్దులో మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం

- మీనాగట్ట అడవుల్లో ఆయుధ తయారీ కేంద్రం
- ధ్వంసం చేసిన భద్రతా దళాలు
- భారీ ఎత్తున పేలుడు పదార్థాలు స్వాధీనం



11లో



## తెలంగాణను.. వణికిస్తున్న చలి..

- పలుచోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు!
- తెలంగాణను కమ్మేసిన తీవ్రమైన చలిగాలులు
- సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 5 డిగ్రీల ఉష్ణోగ్రత
- 17 జిల్లాల్లో 10 డిగ్రీల కంటే తక్కువకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఏడు జిల్లాలకు భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ

11లో

## తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంలో కీలక మార్పు

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు
- ఈ నిర్ణయం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం
- డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్ష భేటీలో ఈ నిర్ణయం



11లో

## రేపు సీఎం చంద్రబాబు ‘క్వాంటం టాక్’..

50 వేల మంది టెక్ విద్యార్థులను ఉద్దేశించి కీలక ప్రసంగం

- రేపు టెక్ విద్యార్థులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- క్వాంటం ప్రోగ్రామ్‌కు 50 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్లు
- నమోదు చేసుకున్నవారిలో 51 శాతం మంది అమ్మాయిలే!
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్‌లో ఇంటర్న్‌షిప్
- అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

11లో





## అమరావతిలో కల్చరల్ సెంటర్...

### సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయం

- అమరావతిలో కల్చరల్ సెంటర్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం
- జోన్-8 ఎల్పీఎస్ లేఅవుట్ అభివృద్ధికి రూ.1358 కోట్ల కేటాయింపు
- క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం గడువులోగా పూర్తి చేయాలని సూచన
- వివిధ అభివృద్ధి పనులకు 56వ సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం
- రాజధాని రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

11లో



భారతశక్తి

# రాష్ట్రాలపై ఉపాధి భారం

జి రామ్ జి బిల్లును గురువారం లోక్‌సభ ఆమోదించింది. ఇది చట్టం కాబోతున్నది. అయితే సరికొత్త చట్టం కాదు. ఇప్పటికే ఇది అమలులో ఉన్నది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 గా నిన్నటి వరకు అమలులో ఉన్నది. రాష్ట్రపతి ఆమోదంతో కొత్త పేరు అమలులోకి వస్తుంది. అందులో ఏ అంశాలున్నాయనే విషయం పెద్దగా చర్చించాల్సిన అవసరం లేదు. గ్రామాలలో ఉన్న పేదలకు ప్రత్యేకించి వ్యవసాయ కూలీలకు ఈ చట్టం ఉపాధిని కల్పిస్తున్నది. దాని మీద చర్చలు ఎన్నో జరిగాయి. విమర్శలు, ప్రతి విమర్శలు మరెన్నో వచ్చాయి. అయితే నిరుపేదలకు ఈ చట్టం ఎంతో మేలు చేస్తుందనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఈ చట్టంలో గతంలో ఉన్న ముఖ్యమైన అంశం మారిపోతున్నది. అది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా విషయం. గతంలో ఈ పథకం బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వానిదే. కానీ కొత్త చట్టం ద్వారా ఖర్చులో రాష్ట్రాలపై భారం మోపనున్నది. బడ్జెట్‌లో 60 శాతం కేంద్రం నుంచి, 40 శాతం రాష్ట్రాలు భరించాల్సి ఉంది. ఇంకా కూలీల శ్రమ యంత్రాల వాడకం పైన కూడా కొన్ని నిర్ణయాలు చేశారు. అంతేకాకుండా అత్యంత ముఖ్యమైనది, కూలీల డిమాండ్‌ను బట్టి కాక, ప్రభుత్వాల నిర్ణయాలను బట్టి పనులను కల్పిస్తారు. గతంలో కనీసం వంద రోజుల పని దినాలను కల్పించాల్సి ఉంది. కాని దానిని 125 రోజులకు పెంచారు. ఇది కేవలం కంటితుడుపు మాత్రమే. కానీ ఈ రోజు రాష్ట్రాలు ఇందులో ఆర్థికంగా తమ బడ్జెట్‌లను వెచ్చించాలి. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ వాటాను కల్పించకపోతే, ఆ పథకం అమలు సాధ్యం కాదు. ఇప్పటికే చాలా పథకాల్లో ఇటువంటి షరతులు విధించి, పథకాలనే నిలిపివేసిన ఘటనలున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం అందులో భాగమే. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాలను వెచ్చించకపోవడం వల్ల కేంద్రం నిధులను విడుదల చేయడం ఆపేసింది. పంజాబ్ రాష్ట్రంలో ఈ స్కాలర్ షిప్స్ సమస్య ప్రభుత్వాన్నే మార్చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలను రేపు కూలీల ముందు దోషులుగా నిలబడే పరిస్థితి రాబోతున్నది. అంటే జి రామ్ జి పథకం రేపు రాష్ట్ర ప్రభుత్వాల నిస్సహాయతను బజారులో నిలబట్టే పరిస్థితి రాబోతున్నది. దానితో పథకమే ప్రశ్నార్థకం కాబోతున్నది. కేంద్ర ప్రభుత్వం ఆశిస్తున్నది కూడా అదే. క్రమంగా ఈ పథకాన్ని ఆచరణలో రద్దు చేయాలన్నదే ఉద్దేశం. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాలు తమ బడ్జెట్‌ల ద్వారా అమలులో ఉన్న పథకాలనే కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నాయి. ఉద్యోగుల జీతాలు, పెన్షన్‌లను సరైన సమయంలో చెల్లించలేని దీనస్థితిలో ఉన్నాయి. వాటికితోడు ఎన్నికల్లో గెలవడానికి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకోకుండా చేసిన వాగ్దానాలు రాష్ట్ర ప్రభుత్వాలకు గుదిబండలుగా మారిపోయాయి. వీటన్నింటిని నిర్వహించడానికి బ్యాంకులనుంచి అప్పులు తీసుకోవడానికి రిజర్వు బ్యాంకు అనుమతి కోసం విరామం లేకుండా ప్రయత్నిస్తున్నాయి. ఒక్కొక్క రాష్ట్రం తమ అప్పుల పరిమితులను దాటిపోయాయి. దీనితో చాలా రాష్ట్రాలు తమ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవడానికి ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతున్నాయి. ఇది ఎక్కడి దాకా వెళ్తుందో తెలియదు. సరిగ్గా ఈ పరిస్థితిలో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తమ బడ్జెట్ నుంచి నిధులను కేటాయించడమంటే అది వాస్తవ విరుద్ధమే అవుతుంది. ఇది మరింత సంక్షోభానికి దారి తీసే అవకాశముంది. అంతిమంగా ఈ పథకమే ఆగిపోయే పరిస్థితులున్నాయి. ఈ పథకాన్ని మొదటి నుంచి బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం వ్యతిరేకత దృష్టితోనే చూస్తున్నది. కానీ, ఖర్చు గానీ ఏనాడు డిమాండ్‌కు తగ్గట్టుగా లేవు. దానికి తోడు కార్డులను తొలగించడం అనేది ఒక నిత్య కార్యక్రమంగా పెట్టుకున్నారు. గత రెండేళ్లలో దాదాపు 50 లక్షల కార్డులను దేశవ్యాప్తంగా తొలగించారు. అంతేకాకుండా ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి చేయాల్సినంత ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఈ చట్టం అంతిమ సమాధి. దీనికి బిజెపి సామాజిక నేపథ్యమే కారణం. ఈ పథకాన్ని గ్రామాల్లోని ధనిక, మధ్య తరగతి రైతులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిన తర్వాత కూలీలలో వేతనం డిమాండ్ పెరిగిందని, తమ పొలాల్లో పని చేయడానికి ముందుకు రావడం లేదని వాళ్లు వాదిస్తున్నారు. అంతేకాకుండా కూలీలలో పెరిగిన ఈ స్వేచ్ఛ గ్రామాల్లో వ్యవసాయ కూలీ పెరుగుదల అనివార్యమైందని, దానితో వ్యవసాయ ఖర్చులు పెరిగాయని రైతులు తమ వ్యతిరేకతను బహిరంగంగానే వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో ఈ వర్గమే బలమైనది. ఓట్లు గాని, ఇతర ఏ రాజకీయ ప్రయోజనాలకు గానీ ఈ వర్గమే ఆధారం. ఇది వర్గం, కులాల రీత్యా ఆధిపత్యం కలిగి ఉంది. అందువల్ల ఈ పథకానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టడమంటే ఆధిపత్య కులాలకు, వర్గాలకు అండగా నిలబడడమే. దీని వల్ల బిజెపి ఆధిపత్య కులాల్లో బలాన్ని స్థిరం చేసుకోవడానికి వీలవుతుంది. బెంగాల్‌లో నూటికి 50శాతం మంది ఎస్‌సిలు, ఎస్‌టిలు, ముస్లింలు ఉన్నారు. వీళ్లంతా భూమిలేని నిరుపేదలే. దాని వల్ల ఈ వర్గాలకు వ్యతిరేకింగా మధ్య తరగతి వర్గం కూలీలను సమీకరించే పనిలో పడ్డారు. అందుకే ఈ చట్టం ద్వారా మరో ప్రయోజనం పొందాలని పథకం వేశారు. అదే పేరు మార్పు. అందులో నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించి, రామ్ పేరును చేర్చడం రెండో ప్రయోజనం. ఎందుకంటే ఇక్కడ పరోక్షంగా ముస్లింల మీద వ్యతిరేకత రెచ్చగొట్టడం. మహాత్మా గాంధీ పేరును తొలగించడం వల్ల జరిగే చర్చలో పరోక్షంగా ముస్లింల విషయాన్ని చేర్చి తమకు అనుకూలంగా దీనిని మలుచుకోవడంలో సఫలీకృతం కావాలని ఆలోచన చేస్తున్నారు. మహాత్మాగాంధీ పైన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలకు మొదటి నుంచి సదాభిప్రాయం లేదు. అది మహాత్మా గాంధీ హత్యతోనే బయట పడింది. మహాత్మా గాంధీని హత్య చేసిన నాథ్‌రామ్ గాడ్సే హిందూ మహాసభ నాయకుడు. ఆర్‌ఎస్‌ఎస్‌లో కూడా పనిచేశాడని చరిత్రలో ఉన్న విషయం. అదే విధంగా మహాత్మా గాంధీ హత్యానంతరం ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు మిఠాయిలు పంచుకున్నాయని అప్పటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ గోల్వాల్కర్‌కు రాసిన ఉత్తరంలో పేర్కొన్నారు. అంతేకాకుండా 2014లో అప్పటి బిజెపి ఎంపి సాక్షి మహారాజ్ నాథ్‌రామ్ గాడ్సే జాతీయ వీరుడు అని ప్రకటించారు. అదే విధంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన నాయకుడు రాజ్‌భయ్యా నాథ్ గాడ్సేను సమర్థిస్తూ మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. అదే విధంగా నాథ్‌రామ్ గాడ్సేకు ఆశ్రయం ఇచ్చిన వాళ్లలో సావర్కర్ ప్రధానమైన వ్యక్తి. ఆయన అనేక సార్లు గాంధీని విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. అయితే గత కొన్ని రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోడీ వీర్ సావర్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, తమ అనుబంధాన్ని చాటుకున్నారు. అయితే బిజెపి మహాత్మా గాంధీని ప్రత్యక్షంగా విమర్శించిన సందర్భాలు తక్కువ. అదే విషయాన్ని గత రెండు రోజుల క్రితం పార్లమెంట్‌లో ఆ పార్టీ ప్రకటించింది. మహాత్మా గాంధీ జయంతిని స్వచ్ఛ అభియాన్‌గా జరుపుకుంటున్న విషయాన్ని కూడా ప్రకటించారు. అది నిజమే. ఇక్కడ గమనించాల్సింది మహాత్మా గాంధీ మీద కోపం ఆయన మీద కాదు. ఆయన ఏ విధానాలను అవలంబించి ముస్లింలను సోదరులుగా చూడాలని ప్రకటించారో ఆ అంశం వాళ్లకు నచ్చదు.

# ఔను...వాళ్లిద్దరూ కలిసిపోయారా...

కడప, డిసెంబర్ 22,

ఆస్తులు, ఇంకా అనేక రకాల వివాదాలతో కొంతకాలంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమంటున్నది. రాజకీయంగా షర్మిల జగన్మోహన్ రెడ్డి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియా వింగ్ కూడా షర్మిల మీద రాయడానికి వీలు లేని భాషలో ఆరోపణలు చేస్తున్నారు. జగన్, షర్మిల మధ్య ఆస్తుల వివాదాలు కొనసాగుతున్నాయి.. ఇప్పటికే షర్మిల అనేక సందర్భాలలో జగన్మోహన్ రెడ్డికి నోటీసులు పంపించారు. జగన్ కూడా అదే పని చేశారు. షర్మిల తనయుడి ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి హాజరైన జగన్.. పెళ్లికి మాత్రం వెళ్ళలేదు. దీంతో వారిద్దరి మధ్య విభేదాలు మరింత పెరిగిపోయాయి. రెండు మూడు సంవత్సరాలుగా ఈ ఇద్దరి మధ్య ఉన్న దూరం అసలైన వైఎస్సార్ అభిమానులను బాధపెడుతోంది. తప్పు ఎవరిది, కారణం ఏమిటి అన్నది వేరే విషయం అయినా, ఒకప్పుడు కలిసి రాజకీయంగా ప్రయాణించిన అన్నా చెల్లెళ్లు ఇలా విడివిడిగా ఉండటం వారికి నచ్చడం లేదు. ఎప్పటికైనా ఈ కుటుంబం మళ్లీ ఒక్కటవ్వాలని, పరస్పర విభేదాలు పక్కన పెట్టాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు. సాధారణంగా "నీటి కంటే రక్తం చిక్కన" అనే మాట రాజకీయాల్లో కూడా చాలాసార్లు నిజమైంది. గతంలో తీవ్రంగా విభేదించిన రాజకీయ నేతలు, కుటుంబ సభ్యులు కాలక్రమంలో మళ్లీ కలిసిన సందర్భాలు ఉన్నాయి. ఆ కోణంలో చూస్తే జగన్, షర్మిల కూడా భవిష్యత్తులో కలిసే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అది ఎప్పుడు జరుగుతుందన్నది మాత్రం ఎవరూ స్పష్టంగా చెప్పలేని పరిస్థితి. ఇద్దరూ తమ తమ అభిప్రాయాల్లో గట్టి పట్టుదలతో ఉండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో కడప జిల్లాకు చెందిన వైసీపీ కీలక నేత, మాజీ ఎమ్మెల్సీ సతీష్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన మాట్లాడుతూ జగన్‌కు తన చెల్లెలంటే ప్రత్యేక అభిమానం ఉందని, కుటుంబాన్ని ఎప్పుడూ గొప్పగా భావించే వ్యక్తి అని తెలిపారు. తాను జగన్‌ను దగ్గరగా చూశానని, ఆయన ఎప్పుడూ కావాలని తప్పులు చేసే మనిషి కాదని అన్నారు. తన అనుభవం ప్రకారం జగన్ ఇతరులకు మేలు చేయాలనే ఆలోచనతోనే పనిచేస్తారని వ్యాఖ్యానించారు. అందుకే అన్నా చెల్లెళ్లు మళ్లీ కలిసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా షర్మిల ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆమె ప్రధానంగా అధికార కూటమిపైనే విమర్శలు చేస్తూ వస్తున్నారు. జగన్ గురించి కానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి కానీ ఆమె బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం లేదు. ఒక రాజకీయ పార్టీ నేతగా అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని విమర్శించడం సహజమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. గతంలో వైసీపీపై తీవ్ర విమర్శలు చేసిన షర్మిల ఇప్పుడు వైఖరిలో మార్పు చూపుతున్నారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, జగన్?షర్మిల మళ్లీ కలవాలని కోరుకునే భావన రాజకీయాల్లోనూ, ప్రజల్లోనూ ఉంది. అలాంటి పరిణామం జరిగితే అది సానుకూల మార్పుగా భావిస్తారు. ఇది సాధ్యమవుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. కానీ ఈ అంశం చర్చలో ఉండటం మాత్రం ఆ కుటుంబంపై ఉన్న అభిమానం ఎంత బలంగా ఉందో చెప్పే సంకేతంగా కనిపిస్తోంది. వీరిద్దరి మధ్య అగాధాన్ని పూడ్చడానికి చాలామంది ప్రయత్నాలు చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.. అయితే ఇప్పుడు షర్మిల, జగన్ కలిసిపోయారని కొంతమంది రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జగన్మోహన్ రెడ్డి జన్మదినం.. ఈ సందర్భంగా సోదరి షర్మిల సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో రాజకీయ విశ్లేషకులు వారిద్దరు కలిసిపోయారని ప్రచారం చేస్తున్నారు. జగన్ పుట్టినరోజు కాబట్టి.. పైగా మాజీ ముఖ్యమంత్రి కాబట్టి షర్మిల సోషల్ మీడియా వేదిక శుభాకాంక్షలు తెలియజేశారని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. వారిద్దరూ కలిసి పోలేదని.. సోదరుడు కాబట్టి.. అందులోనూ అతడి జన్మదినం కాబట్టి షర్మిల శుభాకాంక్షలు తెలియజేశారని వారు గుర్తు చేస్తున్నారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్



కళ్యాణ్ కూడా సోషల్ మీడియా వేదికగా జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని.. ప్రజాసేవలో నిమగ్నమై ఉండాలని సోషల్ మీడియా వేదికగా పవన్ కళ్యాణ్ కోరారు.. పవన్ కళ్యాణ్, షర్మిల చేసిన ట్వీట్లు ప్రస్తుతం ఏపీ రాజకీయాలలో సంచలనంగా మారాయి. మరోవైపు వైసీపీ నాయకులు ఏపీవ్యాప్తంగా జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రక్తదానాలు.. రోగులకు ఆహారం పంపిణీ.. దుస్తుల అందజేత వంటి కార్యక్రమాలను చేస్తున్నారు.. ప్రపంచ దేశాలలో ఉన్న వైసిపి నాయకులు కూడా జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. షర్మిల, పవన్ మాత్రమే కాకుండా.. ఇంకా చాలామంది రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పందెం కోళ్ల ముందు రాజకీయాలు లైట్

ఏలూరు, డిసెంబర్ 22,

సంక్రాంతి పండుగకు ఇంకా సుమారు 25 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈలోపే ఉభయ గోదావరి జిల్లాలు మరోసారి పందెం కోళ్ల హడావుడితో ఊగిపోతున్నాయి. గ్రామాల



నుంచి పట్టణాల వరకూ ఎక్కడ చూసినా బరుల ఏర్పాట్లు, గిరులు గీయడం, వాటాల చర్చలు జోరుగా సాగుతున్నాయి. కోళ్ల కూకలు వినిపించకముందే రాజకీయ నాయకుల అడుగుల శబ్దాలు ఎక్కువయ్యాయి. జిల్లాకు ఇద్దరు చొప్పున కీలక నాయకులు ఆధిపత్యం కోసం ముందుకు వస్తుండటం ఈసారి ప్రత్యేకంగా కనిపిస్తోంది. గతంలో ఇది సాధారణ సంప్రదాయంగా జరిగిపోయేది. కానీ ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. కారణం , ఈసారి పార్టీలు, రాజకీయ భేదాలు అన్నీ పక్కనపెట్టి అందరూ కలిసిపోయారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రమే కాదు, ఇతర పార్టీలతో సంబంధం ఉన్నవారు కూడా ఒకే వేదికపై కనిపిస్తున్నారు. కోడి పందేల విషయంలో రాజకీయాలు అడ్డురావద్దనే ఉద్దేశంతో అందరూ కలిసి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇంతవరకూ ఉభయ గోదావరి జిల్లాలకే పరిమితమైన ఈ సంప్రదాయం ఇప్పుడు కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా, నెల్లూరు జిల్లా వరకూ విస్తరించింది. అక్కడ కూడా భారీ స్థాయిలో బరులు సిద్ధమవుతున్నాయి. గ్రామాల మధ్య పోటీలు, నాయకుల మధ్య సమన్వయంతో ఈసారి మరింత పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్న మాట వినిపిస్తోంది. సంప్రదాయ పండుగలకు రాజకీయ రంగు పులుమకూడదని నేరుగా చెప్పుకుంటూ, అందరూ కలివిడిగా ముందుకు సాగుతున్నారు. చిత్రమైన విషయం ఏంటంటే, ఒక పార్టీకి చెందిన నేతలు మరో పార్టీ నాయకుల నుంచి పెట్టుబడులు తీసుకోవడం బహిరంగ రహస్యంగా మారింది. టీడీపీ నేతలు వైసీపీ నాయకుల దగ్గర నుంచి, వైసీపీ నాయకులు ఇతర పార్టీల వారితో కలిసి వాటాలు పెట్టుకుంటున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎవరికెవరికీ ఏ బరులు కావాలన్నది కూడా ముందుగానే ఖరారు చేసుకున్నారని తెలుస్తోంది. రెండు రోజుల క్రితం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఓ నియోజకవర్గంలో పెద్ద సమావేశం పెట్టి, జిల్లా మొత్తం మీద బరుల నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న సమాచారం ఉంది. ఇలా అందరూ కలిసిపోవడానికి మరో కారణం కూడా ఉందని చెబుతున్నారు. అనవసర రచ్చలు, పోలీసులకు సమాచారం ఇవ్వడం, మీడియాకు లీకులు, న్యాయపోరాటాలు వంటి సమస్యలు రాకుండా ఉండాలన్నదే అసలు ఉద్దేశం. చిన్న మొత్తాన్ని పెట్టి పెద్ద లాభాలు పొందాలన్న ఆలోచనతో అందరూ ఒకే దారిలో నడవాలని నిర్ణయించుకున్నారట. గుంటూరుకు చెందిన ఓ మాజీ ఎంపీ పశ్చిమంలో బరులను లీజుకు తీసుకున్నారని, నెల్లూరుకు చెందిన ఓ వైసీపీ నాయకుడు గుడివాడ ప్రాంతంలో ఏర్పాట్లు చేస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. ఇలా రాజకీయాలకతీతంగా సాగుతున్న ఈ కలయిక, అభివృద్ధి విషయాల్లోనూ కనిపిస్తే బాగుంటుందన్న విమర్శ వినిపిస్తోంది.

# ప్రచారంలో నిజమెంత

విజయవాడ, డిసెంబర్ 22,

వైసీపీ అధినేత జగన్ అనేక మంది నాయకులను వచ్చే ఎన్నికలలో పక్కన పెట్టేస్తారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా కొడాలి నాని, ఆర్కే రోజా, ఆళ్ల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విడదల రజని ఇలా అనేక మంది నేతలకు ఈ సారి నియోజకవర్గాలను మార్చడమో... లేక పక్కన పెట్టడమో చేస్తారన్న ప్రచారం ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తుంది. చాలా నియోజకవర్గాల్లో జగన్ సీనియర్ నేతలకు ప్రత్యామ్నాయంగా యువ నేతల కోసం చూస్తున్నారని అంటున్నారు. అందులో నిజమెంత అన్నది మాత్రం వైసీపీ నేతలు చెప్పకపోయినా.. 2029 ఎన్నికల్లో మాత్రం జగన్ అలాంటి సాహసం చేయకపోవచ్చన్న అభిప్రాయం మాత్రం బలంగా పార్టీ లోనే వినపడుతుంది. 2024 ఎన్నికల్లోనే మంత్రులను, ముఖ్యమైన నేతలను నియోజకవర్గాలను మార్చి జగన్ చేతులు కాల్చుకున్నారు. ఈసారి కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నగిరి నియోజకవర్గానికి, ఆళ్ల రామకృష్ణారెడ్డిని సత్తెనపల్లికి, విడదల రజనీని రేపల్లెకు పంపాలని దాదాపు డిసైడ్ అయ్యారన్న ప్రచారం ఉంది. ఇక ఆర్కే రోజాకు ఈసారి ఎక్కడా సీటు ఇవ్వకుండా అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీ ఇస్తారంటున్నారు. ఇందులో నిజం లేదని చెబుతున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆ యా నియోజకర్గాల్లో ఆ నేతలు విపరీతంగా పార్టీ కోసం పనిచేస్తున్నారు. కొత్త నాయకత్వం వస్తే మళ్లీ రెండు గ్రూపులవుతాయి. అందువల్ల పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పైగా ఈ నేతల వల్ల పార్టీకి నష్టమేమీ లేదని, అటువంటి వారిని ఎందుకు తప్పిస్తారన్న ప్రశ్న ఎదురవుతుంది. వైసీపీని బద్నాం చేయడానికి కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దంటూ నేతలకు వైఎస్ జగన్ ఇటీవల వారికే స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గాల్లో కష్టపడి పనిచేయాలని, ప్రజాసమస్యలపై స్పందిస్తూ ఆందోళనకు దిగాలని జగన్ వారికి సూచించినట్లు సమాచారం. క్యాడర్ ను కూడా కాపాడుకుంటూ ప్రజల పక్షాన నిలస్తే టిక్కెట్ అదే వస్తుందని జగన్ చెబుతుండటంతో వారికి భరోసా వస్తుందట.

# నెల్లూరులో అనిల్ మౌనం..దేనికి సంకేతం

నెల్లూరు, డిసెంబర్ 22,

నెల్లూరు రాజకీయాలను ఒకప్పుడు శాసించిన వైసీపీ కీలక నేతగా గుర్తింపు పొందిన పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ ప్రస్తుతం పూర్తిగా మౌనంగా ఉండడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా, బలమైన గ్రౌండ్ లీడర్‌గా పేరున్న అనిల్ రాజకీయంగా యాక్టివ్‌గా కనిపించకపోవడం వైసీపీకి ఇబ్బందికరంగా మారిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇటీవల నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌గా ఉన్న స్రవంతి రాజీనామా చేయడం పెద్ద దుమారం రేపింది. ఈ పరిణామంతో ఆ పదవిని టీడీపీ దక్కించుకునే అవకాశాలు పెరిగాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి కీలక సమయంలో వైసీపీ తరఫున బలమైన నాయకత్వం కనిపించకపోవడం పార్టీ బలహీనతను బయటపెడుతోందని విమర్శలు వస్తున్నాయి. పార్టీలో అనిల్ కుమార్ పాత్ర బలంగా ఉంటే మేయర్ రాజీనామా వరకు వ్యవహారం వెళ్లేదే కాదని వైసీపీ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. పార్టీ నాయకులను ఏకం చేయడం, సమస్యను ముందే చక్కదిద్దడం అనిల్ చేయగలిగేవారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ ఆయన నుంచి అలాంటి ప్రయత్నాలు కనిపించకపోవడంతో అసలు కారణం ఏమిటన్న ప్రశ్నలు మొదలయ్యాయి. గత ఎన్నికల్లో నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసిన అనిల్ ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత మళ్లీ నెల్లూరు నగర రాజకీయాలపై దృష్టి పెట్టాలని ఆయన భావించినా, పార్టీ నుంచి అధికారిక బాధ్యతలు మాత్రం ఇప్పటివరకు అప్పగించలేదు. ఈ అంశమే ఆయన నిరాశకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. పార్టీ శ్రేణులు కూడా అనిల్ వెంట నిలబడకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేసిందిఉద్దేశపూర్వకంగానే పార్టీ తనను పక్కన పెట్టిందన్న భావన అనిల్ అనుచరుల్లో బలంగా ఉంది. వైసీపీ నుంచి బయటకు వెళ్లిన కొందరు నాయకుల పాత్ర కూడా దీనికి కారణమని ఆయన భావిస్తున్నట్టు సమాచారం. ఈ అంశాలపై పార్టీ అధిష్టానం స్పందించకపోవడం అనిల్ మౌనానికి మరో కారణంగా మారిందని అంటున్నారు. ఒకప్పుడు తన అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కూడా కట్టలేని స్థితి ఉన్న నెల్లూరు సిటీ లో ఇప్పుడు తన మాటకు విలువ లేకపోవడం అనిల్‌కు తీవ్ర మనస్తాపాన్ని కలిగిస్తోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పైగా సొంత బాబాయి టీడీపీలో చేరడం రాజకీయంగా ఆయనకు మరింత ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో అనిల్‌కు మళ్లీ ప్రాధాన్యం దక్కుతుందా, లేక నెల్లూరు రాజకీయాల్లో ఆయన పాత్ర ముగింపు దశకు చేరిందా అన్నది కాలమే నిర్ణయించాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం నెల్లూరు రాజకీయాల్లో అనిల్ ప్రభావం కనిపించడం లేదన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

# ఇక యోగి ట్రీట్మెంటే సొల్యూషనా..

విజయవాడ, డిసెంబర్ 22,

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. భారీ మెజారిటీతో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టింది. అయితే, అధికారం కోల్పోయిన వైసీపీ మాత్రం ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రభుత్వంపై నిత్యం విమర్శలు గుప్పిస్తూనే ఉంది. ఈ క్రమంలో కూటమి నేతలు ఇస్తున్న కౌంటర్ల తీరు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో సాధారణంగా సంయమనం పాటిస్తుంటారు. కానీ, గత ప్రభుత్వ హయాంలో ఎదురైన చేదు అనుభవాల నేపథ్యంలో ఆయన కూడా ఇటీవల ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. “తోక కత్తిరిస్తా”, “గుండెల్లో నిద్రపోతా'' వంటి డైలాగులు కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నప్పటికీ, విశ్లేషకుల దృష్టిలో ఇవి కేవలం మాటలకే పరిమితమవుతున్నాయనే అభిప్రాయం ఉంది. తాజాగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు మరింత దుమారం రేపాయి. “యూపీలో యోగి ఆదిత్యనాథ్ తరహా ట్రీట్‌మెంట్ ఇస్తాం”, “కాళ్లు, చేతులు విరగ్గొడతాం” అని ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. అయితే, సోషల్ మీడియాలో నెటిజన్లు దీనిపై సెటైర్లు వేస్తున్నారు. “చట్టాన్ని అమలు చేసే అధికారం మీ చేతుల్లోనే ఉన్నప్పుడు, వార్నింగ్‌లు ఇవ్వడం ఎందుకు? నేరుగా చర్యలు తీసుకోవచ్చు కదా?” అనేది మెజారిటీ ప్రజల ప్రశ్న.

ప్రభుత్వ పెద్దల తీరుపై ప్రజల్లో ప్రధానంగా కొన్ని రకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఏదైనా చర్య తీసుకుంటే అది రాజకీయ కక్షసాధింపుగా ముద్ర పడుతుందనే భయం ప్రభుత్వంలో ఉందా? చట్టపరంగా పక్కా ఆధారాలు సేకరించడంలో జాప్యం జరుగుతోందా? అనే అనుమానం ఉంది. అదే సమయంలో వైసీపీ నేతలతో కూటమిలోని కొందరు కీలక నేతలు కుమ్మక్కు అయ్యారనే ఆరోపణలు సామాన్య ప్రజల్లో బలపడుతున్నాయి. అందుకే ఎంత రెచ్చగొట్టినా గట్టి చర్యలు తీసుకోవడం లేదని కొందరు విమర్శిస్తున్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయంలో, కక్షసాధింపు రాజకీయాలకు వెళ్తే పెట్టుబడులు రావేమోనన్న భావనతో చంద్రబాబు ఆచితూచి అడుగులు వేస్తున్నారా? అనే కోణం కూడా ఉంది. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం. కానీ, అసత్య ఆరోపణలు, వ్యక్తిత్వ హననం జరుగుతున్నప్పుడు ప్రభుత్వం తన దగ్గర ఉన్న చట్టపరమైన ఆయుధాలను వాడాల్సి ఉంటుంది. వ్యవస్థలను గాడిలో పెట్టడం అంటే కేవలం పాత పథకాల పేర్లు మార్చడం కాదు, తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టడం కూడా. “అధికారంలో ఉన్న వారు ప్రతిపక్షంలా మాట్లాడకూడదు. చట్టం తన పని తాను చేసుకుపోయేలా ఆదేశాలు ఇవ్వాలి. పదే పదే హెచ్చరికలు జారీ చేయడం వల్ల ప్రభుత్వ బలహీనత బయటపడుతుంది తప్ప, భయం పుట్టదు.'' అనేది రాజకీయ విశ్లేషకులు చెప్తున్న మాట. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకం చాలా పెద్దది. వైసీపీ నేతల విమర్శలకు సమాధానం మాటలతో కాకుండా, పారదర్శకమైన విచారణలు, చట్టబద్ధమైన చర్యల ద్వారా చెబితేనే ప్రభుత్వానికి మైలేజ్ పెరుగుతుంది. పవన్ కల్యాణ్ అన్నట్లు ‘యోగి ట్రీట్‌మెంట్’ అంటే అది శారీరక హింస కాదు.. నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరనే భయం కల్పించడం. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడు ‘యాక్షన్ మోడ్’లోకి వెళ్తుందో వేచి చూడాలి.

# రెండో బిడ్డ ఉంటే ప్రభుత్వ ప్రోత్సహకం

విజయవాడ, డిసెంబర్ 22,



ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ లో ఇకపై రెండో శిశువుకు జన్మనిస్తే ప్రోత్సాహకాలు ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం యోచిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లో జనాభా తగ్గుతుండటంతో ఈ రకమైన నిర్ణయాన్ని త్వరలోనే చంద్రబాబు తీసుకుంటారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. దేశంలోనే కాదు.. ఏపీలోనూ అందులో దక్షిణాది రాష్ట్రాల్లో గత కొన్నిరోజులుగా జనాభా సంఖ్య తగ్గుతూ వస్తుంది. దీంతో ఏపీ ప్రభుత్వం రెండో బిడ్డను కంటే ప్రోత్సాహకాలు ఇచ్చే యోచనలో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ లో వృద్ధుల జనాభా పెరగడంతో పాటు సంతానోత్పత్తి రేటు తగ్గుదల ఆందోళన కలిగిస్తుంది. ఇదే విషయాన్ని చంద్రబాబు పదే పదే అనేక బహిరంగ సభల్లో ప్రస్తావిస్తున్నారు. ప్రతి వారు ఇద్దరు లేదా ముగ్గురు సంతానాన్ని కలిగి ఉండాలని చెబుతూ వస్తున్నారు. అయితే పెరుగుతున్న ఖర్చులు, ఆర్థిక భారం దృష్ట్యా చాలా మంది సింగిల్ శిశువుకే పరిమితమవుతున్నారు. దీంతో పాటు సంతాన సాఫల్యత పెంచేందుకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫెర్టిలిటీ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంలో ఉన్నట్లు ప్రచారం సాగుతుంది. జనాభా నియంత్రణ నుంచి జనాభా సుస్థిరత వైపు ప్రభుత్వ పాలసీని మార్చుకుని చంద్రబాబు ఆ దిశగా త్వరలోనే కీలక ప్రకటన చేయనున్నారని తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో జనాభా సంక్షోభం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు ఆందోళనకరంగా పడిపోవడంతో, భవిష్యత్తులో తలెత్తే తీవ్ర పరిణామాలను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్, హంగేరీ వంటి దేశాల్లో అమలు చేస్తున్న తరహాలో ‘రెండో బిడ్డను కనేవారికి’ ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. ఇటీవల అమరావతిలో జరిగిన 5వ కలెక్టర్ల సదస్సులో ఈ ఆందోళనకరమైన గణాంకాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బయటపెట్టారు. జాతీయ సగటు 28.4 ఏళ్లతో పోలిస్తే, ఏపీలో సగటు వయసు 32.5 ఏళ్లుగా ఉందని, ఇది రాష్ట్రం వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తోందనడానికి సంకేతమని ఆయన వివరించారు. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5కు పడిపోయిందని, ఇది సాధారణంగా ఉండాల్సిన 2.1 కంటే చాలా తక్కువని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ. పనిచేయని వయసు జనాభా పెరుగుతోంది. ఇకపై పిల్లల్ని కనేలా కుటుంబాలను ప్రోత్సహించడంపైనే మన దృష్టి పెట్టాలనడం దీనిని సూచిస్తుంది

# అర్థం కానీ జగన్ వ్యూహం

తిరుపతి, డిసెంబర్ 22,



రాజకీయంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం అత్యంత సాహసం కూడా. చాలా రకాల అంశాలు ప్రభావితం చేస్తాయి. ఈ విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి డిఫెన్స్ లో పడిపోతున్నారు. ఏ నిర్ణయం కూడా సవ్యంగా తీసుకోలేకపోతున్నారు. మునుపటి దూకుడు ఆయనలో కనిపించడం లేదు. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ముఖ్యమంత్రి పదవి ఆశించారు జగన్మోహన్ రెడ్డి. ఆ పదవి ఇవ్వకపోయేసరికి పార్టీపై తిరుగుబాటు చేశారు. పార్టీ నుంచి బయటకు వచ్చేసారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఢిల్లీ నుంచి గల్లీ వరకు అజయమైనా శక్తిగా ఉంది కాంగ్రెస్ పార్టీ. అయినా సరే ఆ శక్తిని ఢీకొట్టారు జగన్మోహన్ రెడ్డి. కానీ ఇప్పుడు అంతటి శక్తిగా ఉన్న బిజెపిని చూసి మాత్రం భయపడి పోతున్నారు. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతున్నారు. స్నేహం కోసం వస్తున్న వారిని దూరం పెడుతున్నారు. ఇష్టమైన వారితో కలవలేక పోతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. భావోద్వేగాలను సైతం వ్యక్తం చేయలేని స్థితిలో ఉన్నారు. సాధారణంగా ప్రతిపక్షంలో ఉన్నవారికి ఏ చిన్నపాటి తోడు దొరికినా వదలరు. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి తోటి రాజకీయ పార్టీలను కలుపుకెళ్లే ప్రయత్నం చేయలేకపోతున్నారు. దానికి కారణం భారతీయ జనతా పార్టీ. జాతీయస్థాయిలో ఆ పార్టీకి ఎదురు నిలిచే ఏ పార్టీ కూడా నిలవడం లేదు. అందుకే జగన్ తన పార్టీ కోసం.. తన పార్టీ అస్తిత్వం కోసం బిజెపితో వ్యతిరేకత తెచ్చుకోవడం లేదు. చివరకు బిజెపిని వ్యతిరేకించే పార్టీలను దగ్గర చేసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఏపీలో మూడు పార్టీలు పొత్తులో ఉండగా.. మిగిలినవి కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఉనికి లేని పార్టీలు. తనకు తాను పెద్ద పార్టీగా చెప్పుకునే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వాటిని కలుపు కెళ్లే సాహసం చేయడం లేదు. దానికి కారణం భారతీయ జనతా పార్టీ. ఆ పార్టీకి వ్యతిరేకంగా వెళ్లడమే కాదు.. ఆగ్రహం తెప్పించే ఏ పనికి కూడా జగన్మోహన్ రెడ్డి ముందుకు రావడం లేదు. అయితే జగన్మోహన్ రెడ్డి ని సింహం, ఢిల్లీని గడగడ లాడించిన నాయకుడు వంటి స్లొగన్స్ తో ఆకాశానికి ఎత్తేస్తుంటారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. కానీ ఇప్పుడు బీజేపీ విషయంలో తమ అధినేత అనుసరిస్తున్న వైఖరి వారికి సైతం మింగుడు పడడం లేదు. ఇటీవల ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనను తీవ్రతరం చేసింది. అదే అంశంపై సిపిఐ పోరాటం చేస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాన్ని అభినందిస్తోంది. అయితే సిపిఐ వైఖరి చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అడుగులు వేయాలని అనిపిస్తుంది. కానీ జగన్మోహన్ రెడ్డి నుంచి ఎటువంటి పిలుపు లేదు కదా.. సంకేతాలు కూడా లేవు. ప్రజల్లో మార్పు ప్రారంభమైందని జగన్ అంచనాలు వేస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామన్న ధీమాతో ఉన్నారు. కానీ కొన్ని వర్గాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటేనే అసంతృప్తితో ఉన్నాయని.. ఆగ్రహంతో ఉన్నాయని తెలుసుకోలేకపోతున్నారు. 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు విషయంలో బిజెపి వైఖరి వేరేలా ఉండేది. ఎప్పుడైతే పవన్ ముందుకు వచ్చి టిడిపి తో పొత్తు ప్రకటన చేశారో.. క్రమేపి బిజెపి వైఖరిలో మార్పు వచ్చింది. ఇప్పుడు కూడా సిపిఐ ద్వారా మిగతా రాజకీయ పక్షాలను తన వైపు తెచ్చుకోవచ్చు జగన్మోహన్ రెడ్డి. కానీ బిజెపి విషయంలో వెనుకడుగు వేస్తున్నారు. ఇలా ఆలోచనకు వెళ్తే మాత్రం చాలా కష్టం.

# ఖాదీ, ఖాకీ వార్...

ఏలూరు, డిసెంబర్ 22, (

ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, మాజీ ఏసీబీ చీఫ్, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ మధ్య నెలకొన్న వివాదం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో రఘురామ కృష్ణరాజు అరెస్టు, కస్టడీలో చిత్రహింసల ఆరోపణల నేపథ్యంలో మొదలైన



ఈ వివాదం, ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవి చుట్టూ తిరుగుతోంది. ఒక సిట్టింగ్ ఐపీఎస్ అధికారి, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిపై బహిరంగంగా విమర్శలు చేయడం, ఆయనకు శిక్ష పడటం ఖాయమని జోస్యం చెప్పడం సర్వీస్ రూల్స్ ఉల్లంఘన కిందకు వస్తుందా? అనే చర్చకు దారితీసిందికొన్ని రోజుల కిందట రఘురామ కృష్ణరాజుపై ఓ పోస్ట్ పెట్టిన పీవీ సునీల్ కుమార్, ఇవాళ ఏకంగా ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో అనేక సంచలన వ్యాఖ్యలు చేశారు. బ్యాంకులను మోసం చేసిన కేసులో రఘురామ కృష్ణరాజుపై విచారణ జరుగుతోందని, ఈ కేసులో ఆయనకు యావజ్జీవ కారాగార శిక్ష పడటం ఖాయమని సునీల్ కుమార్ సోషల్ మీడియా వేదికగా జోస్యం చెప్పారు. ఒకవేళ పదవిలో ఉండగా ఆయన జైలుకు వెళ్తే అది రాష్ట్ర పరువుకు భంగమని, అందుకే వెంటనే ఆయన్ను డిప్యూటీ స్పీకర్ పదవి నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, తాను కూడా ఎస్‌బీఐ ఖాతాదారుడినే కాబట్టి, ఈ బ్యాంకు మోసం కేసులో ఒక బాధితుడిగా ‘ఇంప్లీడ్’ అవుతానని ప్రకటించడం సంచలనం సృష్టించింది. ఒక ఐపీఎస్ అధికారిగా ఉంటూ, క్రియాశీల రాజకీయాల్లో ఉన్న వ్యక్తులపై లేదా రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం, 1968కు విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎస్ అధికారులు రాజకీయ అంశాలపై బహిరంగంగా స్పందించకూడదు. అసెంబ్లీ ద్వారా ఎంపికైన డిప్యూటీ స్పీకర్‌ను తొలగించాలని కోరడం పరోక్షంగా ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేయడమే అవుతుంది. గతంలో రఘురామ వేసిన కేసుల వల్ల సునీల్ కుమార్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు దానికి ప్రతికారం తీర్చుకునే క్రమంలోనే ఆయన సర్వీస్ రూల్స్‌ను కూడా పక్కన పెట్టి మాట్లాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయివైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా ఉన్న సమయంలో రఘురామను అరెస్ట చేసినప్పుడు, సునీల్ కుమార్ అత్యుత్సాహం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రఘురామ ఫిర్యాదు మేరకు సునీల్ కుమార్‌పై కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే “నేను రాష్ట్రం కోసమే మాట్లాడుతున్నాను” అని ఆయన ఇస్తున్న క్లారిటీని విశ్లేషకులు ఒక డిఫెన్స్ మెకానిజంగా చూస్తున్నారు. పీవీ సునీల్ కుమార్ వ్యాఖ్యలపై ప్రభుత్వం సీరియస్ అయ్యే అవకాశం ఉంది. సర్వీస్ నిబంధనలను అతిక్రమించినందుకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. విచారణలో ఉన్న కేసుల గురించి ముందే తీర్పును ప్రకటించడం, యావజ్జీవ శిక్ష పడుతుందని చెప్పడం న్యాయవ్యవస్థను కించపరచడమే అవుతుందనే వాదన కూడా ఉంది. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమే కానీ, బాధ్యతాయుతమైన ఖాకీ దుస్తుల్లో ఉండి శాసనసభ గౌరవాన్ని ప్రశ్నించడం ఏ మేరకు సమంజసమనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. రఘురామపై ఉన్న కేసులు న్యాయస్థానాల్లో తేలాల్సి ఉండగా, ముందే వీధి పోరాటానికి దిగడం సునీల్ కుమార్ వృత్తిగత భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# రైటర్స్ కథపై ఆసక్తికర చర్చ ...మోడీ తర్వాత ప్రధానిగా చంద్రబాబు

న్యూఢిల్లీ, డిసెంబర్ 22,

భారత రాజకీయాల్లో మోడీ తర్వాత ఎవరు? అనే ప్రశ్న ఎప్పుడూ ఆసక్తికరమే. అయితే, ప్రముఖ అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ ఇటీవల ప్రచురించిన కథనం ఈ చర్చను మరో మలుపు తిప్పింది. 2029 నాటికి ప్రధాని మోడీ వయస్సు 79 ఏళ్లకు చేరుతుందని, ఆ సమయంలో ఆయన క్రియాశీల



రాజకీయాల నుండి తప్పుకుంటే వారసులెవరు అనే కోణంలో రాయిటర్స్ ఒక ఆసక్తికర విశ్లేషణను బయటపెట్టింది. రాయిటర్స్ అంచనా ప్రకారం, బిజెపిలో మోడీ తర్వాత అత్యంత శక్తివంతమైన నేతగా ఉన్న అమిత్ షా మొదటి వరుసలో ఉన్నారు. పార్టీ యంత్రాంగంపై ఆయనకున్న పట్టు, వ్యూహకర్తగా ఆయనకున్న గుర్తింపు దీనికి ప్రధాన కారణాలు. ఇక మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ పేరును కూడా రాయిటర్స్ పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం. అయితే, క్షేత్రస్థాయిలో అత్యంత ప్రజాదరణ పొందిన, హిందుత్వ బ్రాండ్ అంబాసిడర్ గా పేరుగాంచిన యోగి ఆదిత్యనాథ్ పేరును రాయిటర్స్ విస్మరించడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో వరుస విజయాలు సాధిస్తూ, మోడీ తర్వాత అంతటి ఫాలోయింగ్ ఉన్న నేతను కాదని ఫడ్నవీస్ పేరును తెరపైకి తేవడం వెనుక రాయిటర్స్ లాజిక్ ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది.. ప్రధాని రేసులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పేర్లను ప్రస్తావించడం. ఒకవేళ 2029లో బిజెపికి స్పష్టమైన మెజారిటీ రాకుండా, ఎన్డీయే కూటమిలోని ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటే, అప్పుడు దక్షిణాది నేతగా చంద్రబాబుకు అవకాశం దక్కవచ్చని రాయిటర్స్ అభిప్రాయపడింది. కానీ ఇక్కడ కొన్ని ప్రాథమిక వాస్తవాలను రాయిటర్స్ విస్మరించినట్లు కనిపిస్తోంది. 2029 నాటికి మోడీకి 79 ఏళ్లు వస్తాయని ఆయనను పక్కన పెడితే, చంద్రబాబు కూడా అదే వయస్సులో ఉంటారు. వాస్తవానికి మోడీ కంటే చంద్రబాబు 6 నెలలు పెద్ద. వయస్సు రీత్యా మోడీ తప్పుకుంటే, అంతకంటే పెద్దవారైన చంద్రబాబును బిజెపి అగ్రనాయకత్వం ఎలా అంగీకరిస్తుంది?. జాతీయ రాజకీయాల్లో బిజెపి నేడు అత్యంత శక్తివంతంగా ఉంది. గడ్కరీ, రాజ్ నాథ్ సింగ్ వంటి హేమాహేమీలను కాదని, ఒక ప్రాంతీయ పార్టీ నేతకు ప్రధాని పీఠాన్ని అప్పగించే పరిస్థితి ప్రస్తుతం కనిపించడం లేదు. చంద్రబాబు కానీ, లోకేశ్ కానీ ఏనాడూ తమకు ప్రధాని కావాలనే ఆకాంక్ష ఉన్నట్లు ఎక్కడా వ్యక్తం చేయలేదు. “నా దృష్టి అంతా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పైనే” అని చంద్రబాబు పలుమార్లు స్పష్టం చేశారు. లోకేశ్ కూడా రాష్ట్ర రాజకీయాల్లోనే తన ముద్ర వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజకీయ వర్గాల్లో సాగుతున్న ప్రచారం ప్రకారం.. 2029లో కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వస్తే, చంద్రబాబుకు జాతీయ స్థాయిలో గౌరవప్రదమైన రాష్ట్రపతి లేదా గవర్నర్ వంటి పదవులు దక్కవచ్చని, ఆ సమయంలో రాష్ట్ర బాధ్యతలను లోకేశ్ కు అప్పగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ‘ప్రధాని పదవి’ అనేది మాత్రం అతిశయోక్తిగానే తోస్తోంది. అంతర్జాతీయ మీడియా సంస్థలు ఒక్కోసారి క్షేత్రస్థాయి సమీకరణాలను వదిలేసి, కేవలం గణాంకాలు లేదా పాత రాజకీయ ముద్రల ఆధారంగా విశ్లేషణలు చేస్తుంటాయి. రాయిటర్స్ కథనం కూడా ఆ కోవలోకే వస్తుంది. దక్షిణాదిలో టీడీపీకున్న పట్టును గుర్తించిన రాయిటర్స్, దేశ ప్రధాని పదవి విషయంలో మాత్రం భారతీయ రాజకీయాల్లోని ‘వయస్సు పరిమితులు’, ‘బిజెపి అంతర్గత పట్టు’ వంటి కీలక అంశాలను సరిగ్గా అంచనా వేయలేకపోయిందనిపిస్తోంది. ఏది ఏమైనా, 2029కి ఇంకా చాలా సమయం ఉంది. పైగా తాను తప్పుకుంటానని మోడీ ఇంతవరకూ ప్రకటించలేదు. పార్టీ కూడా ఆయన్ను తప్పించే ఆలోచనలో లేదు. అయినా అప్పటి రాజకీయ పరిస్థితులు, బిజెపి బలాబలాలను బట్టి ఈ సమీకరణాలు ఎటువైపు అయినా మారవచ్చు.

# తిరుమల కొండకు మరో మణిహారం

తిరుమల, డిసెంబర్ 22,

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల కొండలకు మరో మణిహారం చేరనుంది. భారత సాంప్రదాయ వైద్యానికి ప్రాణం పోసే ఔషధ మొక్కల సంరక్షణ లక్ష్యంగా తిరుమలలో టీటీడీ రూ.4.25 కోట్లతో దివ్య ఔషధ వనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అరుదైన, అంతరించిపోతున్న ఔషధ మొక్కలకు నిలయంగా ఉన్న శేషాచలం అడవులకు జీవనాడిగా దివ్య ఔషధ వనాన్ని ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది. ఔషధ మొక్కలను సంరక్షిస్తూ, ప్రజలకు పరిచయం చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ లక్ష్యాలకు దివ్య ఔషధ వనం తోడ్పడనుంది. దక్షిణ భారతదేశంలోనే ఈ తరహాలో రూపొందనున్న ఈ ఔషధ వనం భక్తులు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. టీటీడీ ఏర్పాటు చేయనున్న దివ్య ఔషధ వనంలో దేహ చికిత్స వనం, సుగంధ వనం, ప్రసాద వనం, జీవరాశి వనం, పవిత్ర వనం, పూజా ద్రవ్య వనం, కల్పవృక్ష ధామం, ఔషధ కుండ్, మూలికా వనం, ఋతు వనం, విశిష్ట వృక్ష వనం, ఔషధ మొక్కలు వంటి 13 రకాల ప్రత్యేక థీమ్ ఆధారిత విభాగాలు ఏర్పాటు చేయనున్నారు.

# ఇమ్మాన్యుయేల్ కు బిగ్ బాస్ నుంచి 33 లక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 22, (న్యూస్ పల్స్)

బిగ్ బాస్ సీజన్ 9.. నరాలు తెగే ఉత్కంఠ మధ్య కళ్యాణ్ పడాలను విజేతగా ప్రకటించారు నాగార్జున. అయితే ఈ గ్రాండ్ ఫినాలే ఎపిసోడ్ లో అడియన్స్ సైతం అవాక్కయ్యేలా ఊహించినది జరిగింది అంటే అది ఇమ్మాన్యుయేల్ ఎలిమినేషన్ మాత్రమే. నిజానికి ఓటింగ్ ప్రకారం ఇమ్ము టాప్ 3లో బయటకు రావాల్సింది. కానీ ఎవరూ ఊహించని విధంగా టాప్ 4లో బయటకు వచ్చేశాడు. దీంతో అందరూ షాకయ్యారు. మరోవైపు ఇమ్ము అన్ ఫెయిర్ ఎలిమినేషన్ అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు అడియన్స్. కమెడియన్ గా హౌస్ లోకి అడుగుపెట్టిన ఇమ్ము.. కమెడియన్ అంటే కేవలం కామెడీ చేయడమే కాదని.. టాస్కులలోనూ దుమ్మురేపాడు. సీజన్ మొత్తంలో అత్యధిక టాస్కులు గెలిచిన వ్యక్తి సైతం ఇమ్మూనే. అలాగే హౌస్ లో మూడు సార్లు కెప్టెన్ అయ్యాడు. పది వారాలపాటు నామినేషన్స్ లేకపోయినా.. ఎక్కువగా ఓటింగ్ తెచ్చుకున్నాడు. ఇమ్ము లేకపోతే ఈ సీజన్ 9 లేదు అనేట్టుగా తన కామెడీతో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేశాడు. అలాగే తన ఆట తీరుతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాడు. విన్నర్ కాకపోయినా.. టాప్ 3లో ఉంటాడని అందరూ అనుకున్నారు. కానీ అసలు ఎవరూ అనుకోని విధంగా టాప్ 4లో ఎలిమినేట్ కావడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఎలిమినేట్ తర్వాత ఇమ్ము మాట్లాడుతూ.. బిగ్ బాస్ చాలా నేర్పించిందని.. చాలా వదులుకుని ఇక్కడికి వచ్చాను.. ఎలా ఉన్నా మనిషిలా ఉండాలని బిగ్ బాస్ నేర్పించిందని.. పేరెంట్స్ విలువ తెలిసేలా చేసిందని



చెప్పుకొచ్చాడు. ఇదెలా ఉంటే.. ఇప్పుడు ఇమ్ము బిగ్ బాస్ రెమ్యునరేషన్ గురించి నెట్టింట టాక్ నడుస్తుంది. ఇమ్మూకు రోజుకు రూ.35 వేల రెమ్యునరేషన్ ఇచ్చినట్లు సమాచారం. అంటే.. వారానికి రూ.2.25 లక్షలు తీసుకున్నారని.. మొత్తం 15 వారాలకు గానూ ఏకంగా రూ.33 లక్షల 75 వేల పారితోషికం తీసుకున్నట్లు సమాచారం. విన్నర్ కావాల్సిన ఇమ్ము.. చివరకు టాప్ 3లోనూ లేకుండా ఎలిమినేట్ కావడంపై అడియన్స్ ఫైర్ అవుతున్నారు. అన్ ఫెయిర్ ఎలిమినేషన్ అంటూ నెట్టింట సీరియస్ అవుతున్నారు.

# కాంగ్రెస్ పార్టీలో పంచాయతీ సెగ.. 16 మంది ఎమ్మెల్యేలపై సీరియస్..!!

హైదరాబాద్, డిసెంబర్ 22,

తెలంగాణలో ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు విజయోత్సాహాన్ని ఇచ్చినా, మరోవైపు అంతర్గత లోపాలను ఎత్తిచూపాయి. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును నిరూపించుకోవాల్సిన ఈ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంపై ఏఐసీసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా సొంత నియోజకవర్గాల్లో పట్టు కోల్పోయిన 16 మంది ఎమ్మెల్యేలపై హైకమాండ్ ఆగ్రహం వ్యక్తం చేయడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఢిల్లీ నుంచి పార్టీ హైకమాండ్.. రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లతో అత్యవసర టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ చర్చల్లో ప్రధానంగా 16 మంది ఎమ్మెల్యేల పనితీరుపై చర్చ జరిగినట్లు సమాచారం. అధికారంలో ఉండి కూడా సగం స్థానాలకే పరిమితం కావడం చెంపపెట్టు వంటిదని అధిష్టానం అభిప్రాయపడింది. కనీసం 80 శాతం స్థానాలను గెలుచుకుంటేనే అది అసలైన అధికార బలమని హైకమాండ్ స్పష్టం చేసింది. చాలా చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా పార్టీ నేతలే రెబెల్స్‌గా బరిలోకి దిగారు. వీరిని బుజ్జగించడంలో లేదా దారికి తెచ్చుకోవడంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జ్ లు విఫలమయ్యారని పార్టీ గుర్తించింది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచామన్న ధీమాతో క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని, ఓటర్ల నాడిని పట్టించుకోకపోవడం కొందరు ఎమ్మెల్యేలకు శాపంగా మారింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఉన్న ప్రాంతాల్లోనే సర్పంచ్ అభ్యర్థులు ఓడిపోవడం వారి ప్రాబల్యానికి గండికొట్టింది. గ్రూపు రాజకీయాలు పార్టీ మూలాలనే దెబ్బతీశాయని విశ్లేషణలు వస్తున్నాయి. ఓటమి పాలైన లేదా తక్కువ మెజారిటీ వచ్చిన నియోజకవర్గాల ప్రతినిధుల నుంచి సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ వివరణ కోరారు. "పార్టీ గీత దాటకుండా పని చేయాలి.. సమన్వయం లేకపోతే భవిష్యత్తులో కఠిన నిర్ణయాలు ఉంటాయి" అని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి అంటే క్షేత్రస్థాయిలో పునాదులు కదలడమేనని, ఇది రాబోయే మున్సిపల్ లేదా స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందని హైకమాండ్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అధికార పార్టీకి సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యం ఉంటుంది. కానీ, ఈసారి 50 శాతం మార్కు దగ్గరే ఆగిపోవడం ప్రతిపక్షాలకు ఆయుధంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లడంలో లోపం ఉందా? అనే కోణంలో పార్టీ సమీక్షించుకోవాల్సి ఉంది. పీసీసీ చీఫ్ మారిన తర్వాత జరిగిన మొదటి కీలక ఎన్నిక కావడంతో, కేడర్‌ను ఏకతాటిపైకి తేవడంలో ఇంకా కసరత్తు అవసరమనిపిస్తోంది. మొత్తానికి, పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ శ్రేణులకు ఒక మేల్కొలుపు లాంటివి. హైకమాండ్ సీరియస్ అవ్వడం ద్వారా ఎమ్మెల్యేలపై పని ఒత్తిడి పెరిగింది. రానున్న రోజుల్లో ఈ 16 మంది ఎమ్మెల్యేలు తమ పనితీరును మెరుగుపరుచుకోకపోతే, పార్టీలో క్రమశిక్షణ చర్యలు తప్పవనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 80 శాతం గెలుపు లక్ష్యాన్ని చేరుకోలేకపోవడం ద్వారా పార్టీ ఆశించిన క్లీన్ స్వీప్ కల నెరవేరలేదని చెప్పవచ్చు.

# సెంటిమెంట్ రాజకీయాలనే నమ్ముకున్న కేసీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 22

చాలాకాలం తర్వాత గులాబీ దళపతి కేసీఆర్ తెలంగాణ భవన్ కు వచ్చారు.. కొంతకాలంగా వరుస ఓటములు ఎదుర్కొంటూ.. అంతర్గతంగా కూడా ఇబ్బంది పడుతున్న పార్టీకి జవసత్వం కల్పించాలని కెసిఆర్ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ క్షేత్రం నుంచి నేరుగా శనివారం రాత్రి నంది నగర్ వచ్చారు.. ఆ తర్వాత ఆదివారం భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఇతర నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏ అంశాలపై సమావేశం నిర్వహిస్తామో గులాబీ పార్టీ ముందుగానే మీడియాకు లీకులు ఇచ్చింది. దానికి తగ్గట్టుగానే ఆ పార్టీ అనుకూల మీడియా డబ్బాలు కొట్టింది. సమావేశంలో కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ మాటలను మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే తెలంగాణ రాష్ట్రం పాలిట శాపం అని కెసిఆర్ వ్యాఖ్యానించారు. సమైక్య రాష్ట్రంలో ఉమ్మడి పాలమూరు జిల్లా వివక్షకు గురైందని ఆరోపించారు. పాలమూరు జిల్లాకు రావాల్సిన నీళ్లు ఇప్పటికీ రావడంలేదని.. పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు 174 టీఎంసీల నీళ్లు రావాలని, కానీ అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఆర్బీ యాక్ట్ ప్రకారం కూడా అదే అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. వాస్తవానికి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల కోణంలో మాట్లాడితే పెద్దగా ఇబ్బంది ఉండేది కాదు. కానీ ఎప్పుడైతే ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటే.. తెలంగాణ రాష్ట్రానికి అతిపెద్ద అన్యాయమని కెసిఆర్ అనడంతో ఒక్కసారిగా చర్చ మొదలైంది. గులాబీ పార్టీ మొదటి నుంచి కూడా సెంటిమెంట్ రాజకీయాలను మాత్రమే నమ్ముకుంది. 2014, 2018 ఎన్నికల్లో సెంటిమెంట్ రగిలించి అధికారాన్ని దక్కించుకుంది. 2023లో ఈ పాచిక పారలేదు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో స్వయంగా కేసీఆర్ వచ్చి ప్రచారం చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. ఆ పార్టీ చరిత్రలో తొలిసారిగా 0 ఎంపీ సీట్లను దక్కించుకుంది. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. అంతకుముందు జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూడా గులాబీ పార్టీ దారుణమైన ఫలితాలను చవిచూసింది. పంచాయతీ ఎన్నికల్లో కూడా గులాబీ పార్టీ అనుకున్న స్థాయిలో స్థానాలు రాలేదు. మరికొద్ది రోజుల్లో జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తున్న నేపథ్యంలో గులాబీ దళపతి రంగంలోకి వచ్చారు. భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు.."ఒకప్పుడు యూరియా ఇంటికి, చేరు వద్దకు వచ్చేది. ఇప్పుడు కుటుంబమంతా లైన్లో నిలబడే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రకటించకపోగా ఉన్న వాటిని ఆపేసింది. రాష్ట్రంలో ప్రజల ఆస్తుల విలువ పూర్తిగా తగ్గిపోయింది. రైతులను ఆదుకోవడానికి.. వారి పొలాలకు నీరును అందించడానికి నిర్మించిన చెక్ డ్యాములు కూడా పేల్చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గులాబీ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించింది. ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. గర్వంగా ఎగిరే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రజలు బుద్ధి చెప్పారు. మేము అధికారంలో ఉన్నప్పుడు అహంకారం ప్రదర్శించలేదు. పార్టీ గుర్తులతో జరిగే ఎన్నికలయితే గులాబీ పార్టీ సత్తా తెలిసేది. నన్ను తిట్టడం, చావాలని శాపాలు పెట్టడమే ఈ ప్రభుత్వ విధానమని" కెసిఆర్ పేర్కొన్నారు. చాలా రోజుల తర్వాత పార్టీ రాష్ట్ర కార్యాలయంలోకి వచ్చిన కేసీఆర్.. చాలా విషయాలు మాట్లాడతారని అందరూ అనుకున్నారు.. కానీ ఆయన సెంటిమెంట్ రాజకీయాలని మళ్ళీ నమ్ముకున్నారు. అయితే ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో వాతావరణం ఒకప్పటి మాదిరిగా లేదు.. అక్కడివాళ్ళు ఇక్కడ.. ఇక్కడి వాళ్ళు అక్కడ రకరకాల వ్యాపారాలు చేస్తున్నారు. ప్రజలు కూడా స్నేహభావంతోనే ఉన్నారు. 2023 లో ఎన్నికలు జరిగే ఒకరోజు ముందు నాగార్జునసాగర్ డ్యాం మీద ఏపీ పోలీసులు ఎంతటి హంగామా చేశారో అందరికీ తెలుసు. అప్పుడే తెలంగాణ ప్రజలు తమ మనోగతాన్ని ఓటు రూపంలో వెల్లడించారు. అలాంటప్పుడు



ఇప్పుడు కేసీఆర్ ఏపీ ఏర్పాటు తెలంగాణ శాతం అనే మాటలను ప్రజలు ఎంతవరకు నమ్ముతారనేది వేచి చూడాల్సి ఉంది.

# టీ రేషన్ యాప్...

నిజామాబాద్, డిసెంబర్ 22

తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డ్ ఉన్నవారి సౌకర్యం కోసం 'టీరేషన్' అనే అత్యాధునిక మొబైల్ యాప్‌ను ఇటీవల ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా రేషన్ సేవలను ఇంటి నుంచే సులభంగా పరిశీలించవచ్చు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా. సాంకేతికత ఆధారంగా రూపొందించిన ఈ యాప్, పౌరులకు పారదర్శకతను, సౌలభ్యాన్ని అందిస్తుంది. ఈ యాప్ ప్రధాన లక్ష్యం ఏమిటంటే, రేషన్ షాపులకు వెళ్లి ఎదురుచూడాల్సిన ఇబ్బందులను తగ్గిస్తుంది. మొబైల్‌లోనే అన్ని వివరాలు కనిపిస్తాయి. సమయం, శ్రమ ఆదా అవుతాయి.'టీ?రేషన్' యాప్ లో అన్ని ముఖ్య సమాచారం తెలుగు భాషలో లభిస్తుంది, కాబట్టి గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకు కూడా అర్థమవుతుంది. మీ రేషన్ కార్డు యాక్టివ్‌గా ఉందా లేదా సస్పెండెడ్‌గా ఉందా అనేది తక్షణం తెలుసుకోవచ్చు. కార్డు ఆధార్‌తో సరిగ్గా లింక్ అయిందా లేదా పెండింగ్‌లో ఉందా అని




తిరిగి చూడవచ్చు. మీ రేషన్ డీలర్ సంప్రదింపు నంబర్, షాప్ అడ్రస్, లొకేషన్ మ్యాప్‌తో కలిపి చూడొచ్చు. నెలవారీ రేషన్ కోటా, ఇప్పటివరకు ఎంత సరుక్కు (బియ్యం, చనా దాలు మొదలైనవి) పొందారో, మిగిలిన మొత్తం అంతా క్లియర్‌గా కనిపిస్తాయి. మునుపటి నెలల డ్రా వివరాలు, కొత్త అప్‌డేట్‌ల గుర్తింపు నోటిఫికేషన్లు. ఈ ఫీచర్లు ఈ కేవైసీ ప్రక్రియలతో ముడిపడి ఉంటాయి, కాబట్టి డేటా కచ్చితంగా ఉంటుంది. యాప్‌ను ఉపయోగించడం చాలా సులభం. గూగుల్ ప్లే స్టోర్‌లో 'టీ?రేషన్' టైప్ చేసి శోధించండి. అధికారిక యాప్‌ను ఫ్రీగా ఇన్‌స్టాల్ చేయండి. మొదటిసారి ఓపెన్ చేసినప్పుడు మీ రేషన్ కార్డు నంబర్ లేదా రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ చేయండి. మొబైల్‌కు వచ్చే ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై చేయండి. లాగిన్ అయిన తర్వాత మెయిన్ స్క్రీన్‌లో అన్ని వివరాలు కనిపిస్తాయి. మెనూల ద్వారా స్పెసిఫిక్ సెక్షన్లకు వెళ్లవచ్చు. అండ్రాయిడ్, ఐఓఎ రెండింటిలోనూ త్వరలో అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంటర్నెట్ లేకపోతే ఆఫ్‌లైన్ మోడ్‌లో కూడా కొన్ని ఫీచర్లు పనిచేస్తాయి. ఈ యాప్ రేషన్ వ్యవస్థలో పారదర్శకతను బలోపేతం చేస్తుంది. లబ్ధిదారులు తమ కోటాను పూర్తిగా పొందుతున్నారా అని తనిఖీ చేసుకోవచ్చు, డీలర్లపై దెబ్బ తీస్తుంది. ప్రభుత్వం లక్ష్యం పీడీఎస్(పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్)ను డిజిటల్‌గా మార్చడం. ఇది మహిళలు, రోజువారీ కూలీలు, గ్రామీణ ప్రజలకు మరింత సహాయకరం. ఏదైనా సమస్యలు ఉంటే యాప్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు.తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో ముందంజలో ఉంది. ఇటీవల మీసేవా వాట్సాప్ ఆప్ ద్వారా సర్వీసులు ఆర్డర్ చేయడం, యూరియా యాప్ ద్వారా ఎరువులు ట్రాక్ చేయడం అందుబాటులోకి వచ్చాయి. 'టీ?రేషన్' కూడా ఇలాంటి డిజిటల్ పరివర్తనలో భాగం.

# టీబీజేపీకి ఏమైంది...

హైదరాబాద్, డిసెంబర్ 22,

భారతీయ జనతాపార్టీ.. దశాబ్దా కాలంగా దేశంలో ఒక వెలుగు వెలుగుతోంది. మెజారిటీ రాష్ట్రాల్లో సొంతంగా, కొన్ని రాష్ట్రాల్లో మిత్రులతో కలిసి అధికారంలో ఉంది. కానీ తెలంగాణలో బీజేపీ బలపడడం లేదు. ప్రజలు ఆ పార్టీని ఆదరిస్తున్నా.. గెలిపించాలని చూస్తున్నా.. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో పార్టీ విఫలవుతోంది. ఇందుకు తాజాగా ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హెచ్చరికే నిదర్శనం. ఎంఐఎం పార్టీకన్నా బలహీనంగా ఉందని పోల్చడం ద్వారా తెలంగాణలో పార్టీ పరిస్థితిని ఎంపీలకు గుర్తు చేశారు. బీజేపీకి సినీ నటుల ఆదరణ ఎక్కువ. చాలా మంది టాలీవుడ్, బాలీవుడ్, మాలీవుడ్, మరాఠా, కన్నడ, మళయాలీ నటులు బీజేపీలో ఉన్నాయి. తాజాగా సీనియర్ నటి ఆమని తాజాగా బీజేపీలో చేరనుందని ప్రకటించడంతో పార్టీలో ఉత్సాహం నెలకొంది. అయినా తెలంగాణలో బీజేపీ బలపడడం లేదు. తెలంగాణ ప్రజలు బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ఆశిస్తున్నారు. అయితే, కొందరు నాయకులు కాంగ్రెస్‌తో, మరికొందరు బీఆర్ఎస్‌తో దగ్గరి సంబంధాలు పెంచుకుంటున్నారు, ఇది పార్టీ ఐక్యతకు సవాల్‌గా మారింది. బీజేపీ పంచాయతీ ఎన్నికల్లో నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్‌కు మించి స్థానాలు సాధించింది. ఇక్కడ ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్న ప్రాంతంలో భారీగా పంచాయతీలు గెలవడం నాయకుల స్వేచ్ఛాయుత నిర్ణయాలకు ఉదాహరణ. అయినప్పటికీ, అంతర్గత విరోధాలు పెరగడంతో పార్టీకి కష్టాలు తెచ్చాయి. ప్రధాని మోదీ ఇటీవల హెచ్చరించినా, నాయకుల పద్ధతి మారలేదు. లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాలు ఇచ్చి మద్దతు పొందినా, కంటోన్‌మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో త్వరిత నిర్ణయాలు



తీసుకోలేక భారీ నష్టం అయింది. సర్పంచ్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చినా, అధిష్టానం నాయకులకు స్వతంత్రత ఇవ్వడంలో విఫలమవుతోంది. ఇలా కొనసాగితే చారిత్రక తప్పు జరుగుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పార్టీలో అందరూ పనిచేసే నాయకులు ఉన్నప్పటికీ, అంతర్గత కలహాలు, జాప్య నిర్ణయాలు భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టుతున్నాయి. ఇప్పటికైనా ఐక్యత పెంచి, నాయకుల స్వేచ్ఛను ప్రోత్సహించాలి. లేకపోతే తెలంగాణలో బీజేపీ అవకాశాలు దూరమవుతాయి. =

# 26 నుంచి పెరగనున్న రైల్వే చార్జీలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 22,

భారతీయ రైల్వే టికెట్ ఛార్జీలు ఈ నెల 26 నుండి పెరగనున్నాయి. రైల్వే శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఈ పెంపు ఆర్డినరీ, నాన్-ఏసీ, ఏసీ క్లాసుల ప్రయాణికులపై భారం మోపనుంది. ఆర్డినరీ క్లాస్‌లో 215 కిలోమీటర్లు దాటి ప్రయాణించే వారికి కిలోమీటర్‌కు ఒక పైసా చొప్పున అదనపు ఛార్జీ వసూలు చేస్తారు. అయితే, 215 కిలోమీటర్లలోపు ప్రయాణించే ఆర్డినరీ క్లాస్ ప్రయాణికుల టికెట్ ఛార్జీలలో ఎటువంటి మార్పు ఉండదు. నాన్-ఏసీ మరియు ఏసీ క్లాసుల్లో, కిలోమీటర్‌కు రెండు పైసల చొప్పున టికెట్ ధర పెరుగుతుంది. నాన్-ఏసీ రైళ్లలో 500 కిలోమీటర్లు దాటిన ప్రయాణాలకు అదనంగా 10 రూపాయల భారం పడనుంది.

=============

# పంజా విసురుతున్న చలి

## డేంజర్ లో హైదరాబాద్ ఎయిర్

హైదరాబాద్, డిసెంబర్ 22, (న్యూస్ పల్స్)తెలంగాణలో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ప్రజలు గజగజా వణికిపోతున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం



వరకు రాష్ట్రంలోనే అత్యల్పంగా సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో ఐదు డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దాదాపు 15 జిల్లాల్లో 10డిగ్రీల సెల్సియస్ లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, అదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని అనేక మండలాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. అయితే, తెలంగాణలోని మమంగళ, బుధవారాల్లో చలితీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.తెలంగాణపై చలి పులి పంజా విసురుతోంది. రికార్డు స్థాయి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, రాత్రి వేళల్లో బయటకు రావాలంటే ప్రజలు వణికిపోతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు చలి ఎక్కువగా ఉన్న సమయాల్లో బయటకు రావొద్దని, ఒకవేళ వచ్చినా చలి తీవ్రతను తట్టుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలాఉంటే.. హైదరాబాద్ నగరంలో ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం చేరింది.దేశ రాజధాని ఢిల్లీ సహా ఇతర నగరాలకు ముప్పుగా మారిన వాయు కాలుష్యం తాజాగా.. హైదరాబాద్ నగరాన్ని చుట్టుముట్టింది. భాగ్యనగర వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 255కు చేరుకుని ప్రమాదకర స్థాయికి చేరింది. ముఖ్యంగా బాలానగర్, సనత్ నగర్, జీడిమెట్ల, మల్లాపూర్ వంటి పారిశ్రామిక, రద్దీ ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రంగా ఉంది. శీతాకాలపు పొగమంచుకు తోడు వాహనాల ఉద్గారాలు, చెత్త దహనం వల్ల గాలిలో సూక్ష్మ ధూళి కణాలు భారీగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో సైనసైటిస్, డస్ట్ అలర్జీ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, ముఖ్యంగా ఉదయం వేళల్లో వ్యాయామాలకు దూరంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు రాత్రిపూట రాష్ట్ర వ్యాప్తంగా 4.5 నుంచి 11.12 డిగ్రీల సెల్సియస్ మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతతో ఉదయం 8గంటల తరువాతే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు.సంగారెడ్డి జిల్లాల్లో పదేళ్ల రికార్డు స్థాయి కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాలోని కోహిర్ లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 4.5డిగ్రీలు నమోదైంది. గతేడాది ఇదే సమయంలో 17.8డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ లో 4.8డిగ్రీలు నమోదైంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ పదేళ్లలోనే అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఖమ్మం, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట మినహా మిగిలిన జిల్లాల్లో 10డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాల్లోనూ 11.2 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు రాత్రి, ఉదయం వేళ్లలో బయటకు రావొద్దని వైద్య నిపుణులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చినా చలి తీవ్రతను తట్టుకునేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.హైదరాబాద్ నగరంలో కూడా ఈ ఏడాదిలోనే అత్యంత చలితీవ్రత నమోదైంది. నగరంలో సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 10 డిగ్రీలుగా ఉన్నప్పటికీ.. జీహెచ్ఎంసీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఇది ఇంకా తక్కువగా ఉంది. శేరిలింగంపల్లిలో 7.8డిగ్రీలు, మల్కాజిగిరి ప్రాంతంలో 8.3 డిగ్రీలు, రాజేంద్ర నగర్ ప్రాంతంలో 9.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## 20 మధ్య తరగతి వారి కోసం గచ్చిబౌలిలో ఇళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 22,

పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతిల్లు ఒక కల. అందులో హైదరాబాద్ వంటి నగరంలో సొంతిల్లు ఉంటే అది చాలు. అదీ గచ్చిబౌలిలో ఇల్లు తక్కువ ధరకు లభిస్తే అంతకంటే ఏంకావాలి? అందుకోసమే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పేద, మధ్యతరగతి ప్రజల కోసం సింగిల్ బెడ్ రూం ఇళ్లను అందుబాటులోకి తెచ్చింది. సింగిల్ బెండ్ రూం ఇళ్లను తెలంగాణలోని ముఖ్యమైన ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈవేలం ద్వారా ఈ గృహాలను సొంతం చేసుకునే వీలుంది.ప్రధానంగా హైదరాబాద్ వంటి నగరంలో అదీ గచ్చిబౌలి లో ఒక చిన్న ఇల్లు ఉన్నా చాలు. ఇక జీవితం స్థిరపడిపోయినట్లే. అందుకే లోయర్ ఇన్ కమ్ గ్రూపుల వారి కోసం తీపికబురు చెప్పింది. హైదరాబాద్ తో పాటు ఖమ్మం, వరంగల్ లోని 339 ప్లాట్లను అందుబాటులోకి తెచ్చింది. తక్కువ మొత్తంతో ఈ ప్లాట్లను కొనుగోలు చేసే వీలుంది. ఇరవై ఆరు లక్షల నుంచి ముప్ఫయి లక్షలోపు చెల్లించి ప్లాట్ ను సొంతం చేసుకునే వీలుంది. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఈ మేరకు పత్రికల్లోనూ ప్రకటన జారీ చేసింది. అయితే నెలకు యాభై వేల రూపాయలు లోపు ఉన్నవారు మాత్రమే ఈ ఇంటిని సొంతం చేసుకోవడానికి అర్హులు.తెలంగాణ హౌసింగ్ బోర్డు వీటిని నిర్మించింది. ఇందులో ఖాళీగా ఉన్న 339 ప్లాట్లను విక్రయించేందుకు వేలం నిర్వహిస్తుంది. గచ్చిబౌలిలో 111 ప్లాట్లు ఉన్నాయి. వరంగల్ లో 102, ఖమ్మంలో 126 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని, ఇవన్నీ ప్రైమ్ ఏరియాలోనే అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. అయితేవీటిని కొనుగోల చేయడానికి గడువును కూడా విధించింది. 540 – 620 చదరపు అడుగుల్లో వీటిని నిర్మించారు. ఒక చిన్న కుటుంబానికి ఈ ఇళ్లు సరిపోతాయని,భవిష్యత్ బాగుంటుందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.గచ్చిబౌలిలో ప్లాట్ల ధర 26 లక్షల నుంచి 36.20 లక్షలవరకూ నిర్ణయించింది. వరంగల్ లో 19 నుంచి 21.50 లక్షలకు, ఖమ్మంలో 11.25 లక్షలకు మాత్రమే విక్రయించనున్నారు. ఈ ప్లాట్లను సొంతం చేసుకోవాలంటే లక్షరూపాయలు డిపాజిట్ ను చెల్లించాల్సి ఉంటుంది. ఆన్ లైన్ లోనూ, మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే వీలుంది. గచ్చిబౌలి ప్లాట్లను వచ్చే నెల 6వ తేదీ, వరంగల్ ప్లాట్లను జనవరి 8న, ఖమ్మంలోని ప్లాట్లను జనవరి 10న లాటరీ తీస్తారు. లాటరీ లో ఎంపికయిన వారికి మాత్రమే ప్లాట్లను కేటాయించనున్నారు.

## వణుకున్న ఉత్తరభారతం

లక్నో, డిసెంబర్ 22,

ఉత్తర భారతం చలికి వణుకుతోంది. జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న మంచు చుక్కలు చూపిస్తోంది. ఎత్తైన భూభాగాల్లో హిమపాతం పెరిగి లోయలోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జలవనరులు ఉన్న ప్రాంతాల్లోనైతే పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. చలికి నీళ్లే గడ్డ కట్టుకుపోతున్నాయి. గుల్‌మార్గ్‌లోని స్కై రిసార్ట్, సోనామార్గ్, దూద్‌పత్రి సహా దక్షిణ, ఉత్తర కశ్మీర్‌లోని ఎత్తైన ప్రాంతాలలో భారీగా మంచు కురుస్తుండటంతో అక్కడి వాళ్లు గజగజ వణుకుతున్నారు.ఇటు కశ్మీర్ అంతటా పరుచుకున్న మంచు దుప్పటి ఓ వైపు పర్యాటకులను ఆకర్షిస్తుండగా.. మరోవైపు భారీగా మంచు పేరుకుపోయి పెద్ద సంఖ్యలో రోడ్లను మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాదు చలికి తోడు అక్కడక్కడా వర్షం కూడా కురుస్తుండటంతో కొండ చరియలు విరిగిపడుతున్నాయి. జమ్ము–శ్రీనగర్ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేశారు అధికారులు. రహదారిపై అడ్డంకులను తొలగించి రాకపోకలను పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టారు. రాబోయే రోజుల్లో మంచు తీవ్రత ఎక్కువయ్యే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అలాగే శీతాకాల పరిస్థితులపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో ఆదివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. భారీ హిమపాతాన్ని ఎదుర్కోవడం, రోడ్ క్లియరెన్స్, నిరంతర విద్యుత్తు సరఫరా, తాగునీటి లభ్యత వంటి వాటిపై దృష్టి సారించినట్లు సీఎం పేర్కొన్నారు.

===========

## గ్రేటర్ పై రేవంత్ గురి...

హైదరాబాద్, డిసెంబర్ 22,

సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు గేర్ మారుస్తున్నారు. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ వరకు కాస్త స్లోగా..నెమ్మదిగా వెళ్లినట్లు కనిపించిన ముఖ్యమంత్రి..ఉప ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఫుల్ స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు. వెంటనే పంచాయతీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి మూడు విడతల్లో పల్లెపోరును కంప్లీట్ చేశారు. మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలుచుకుని ఇంకా ఫుల్ జోష్‌లోకి వచ్చారు. ఈ క్రమంలో రాజకీయంగా వేగంగా పావులు కదుపుతున్నారు. పొలిటికల్ ఈక్వేషన్స్‌ను తనకు అనుకూలంగా మార్చుకుంటూ..ఒక్కో స్టెప్ ముందుకేస్తున్నారు.పంచాయతీ ఎన్నికల గెలుపుతో..గ్రేటర్ ఎన్నికలపై దృష్టి పెట్టారట సీఎం. తెలంగాణకు ఆర్థికంగానే కాదు.. రాజకీయంగా కూడా..హైదరాబాద్ గుండె లాంటిది. అయితే హైదరాబాద్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీని కూడా గెలువలేకపోయింది కాంగ్రెస్. అధికారంలోకి వచ్చిన తర్వాత..ఎమ్మెల్యేల మరణంతో వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో విజయం సాధించి..గ్రేటర్‌లో రెండు సీట్లను తమ ఖాతాలో వేసుకోగలిగింది హస్తం పార్టీ. అటు పంచాయతీ పోల్స్, ఇటు రెండు బైఎలక్షన్లలో గెలుపు..ఇదే ఊపుతో గ్రేటర్‌లో పాగా వేసేలా పావులు కదుపుతోంది కాంగ్రెస్ పార్టీ.రేవంత్ రెడ్డి ఇప్పటినుంచే గ్రేటర్ ఎన్నికలపై ఫోకస్ పెట్టారట. జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 150 డివిజన్లున్నాయి. అయితే పెరుగతున్న జనాభా..నగర విస్తరణ.. ఇప్పటికే మెర్జ్ అయిన మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల జనాభాను దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయాలు తీసుకుంటుంది రేవంత్ సర్కార్. ఔటర్ రింగ్ రోడ్ వరకు..గ్రేటర్‌ను విస్తరించాలని డిసైడ్ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 300 డివిజన్లు కానున్నాయి. ఈ డివిజన్ల ఏర్పాటు కూడా తుది దశకు చేరుకుంది. డివిజన్ల ఏర్పాటు పూర్తవగానే..రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేసి..ఎన్నికలకు వెళ్లాలనేది రేవంత్ రెడ్డి వ్యూహం అంటున్నారు.ఇంతలోపు గ్రేటర్ అభివృద్ధి ఫోకస్ చేస్తూ?. ఎన్నికలకు వెళ్లాలన్నది రేవంత్ ఆలోచనగా కనిపిస్తోంది. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ కావడం..సమ్మిట్ లో వచ్చిన 5 లక్షల కోట్ల పెట్టుబడులను ఎక్స్‌పోజ్ చేసుకోవాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుందట. మెట్రో విస్తరణ, ముఖ్యంగా పాతబస్తీకి మెట్రో..ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ డెవలప్ మెంట్ కారిడార్..ఇలాంటి అంశాలపై రేవంత్



రెడ్డి సీరియస్‌గా ఉన్నారు. దీంతో నగరవాసుల్లో కాంగ్రెస్‌పై పాజిటివిటి పెరిగిందని భావిస్తున్నారట కాంగ్రెస్ లీడర్లు. దీంతో పాటు వచ్చే నెలలో దావోస్ పర్యటనతో సీఎం రేవంత్ పెట్టుబడులు తీసుకొస్తారని అంచనా వేస్తున్నారు.ఇక ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీ పాలక మండలి పదవి కాలం ముగుస్తుండటంతో..జనవరి నెలాఖరులో గ్రేటర్ నగారా మోగించాలని రేవంత్ ప్రణాళిక సిద్ధం చేసినట్లు టాక్. ఇక అభివృద్ధి, పెట్టుబడులు, సంక్షేమం ఇవన్నీ ఒక ఎత్తు అయితే..ఎంఐఎం పార్టీతో దోస్తీ మరింత కలిసి వస్తుందని భావిస్తోందట అధికార పార్టీ. కాంగ్రెస్ పోటీ చేసే స్థానాల్లో ముస్లిం ఓట్లు తమకు కన్వర్ట్ కావడంతో పాటు..ఎంఐఎంతో కలిసి గ్రేటర్ పీఠాన్ని సొంతం చేసుకోవచ్చనేది రేవంత్ ఈక్వేషన్ అంటున్నారు.ఒకవైపు పంచాయతీ ఎన్నికల్లో గెలుపు, జూబ్లీహిల్స్‌లో విక్టరీ, గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌తో?.. ఇదే సరైన సమయంగా భావిస్తున్న రేవంత్ రెడ్డి?. గ్రేటర్‌తో పాటు..మరికొన్ని కార్పొరేషన్, మున్సిపాలిటలను కైవసం చేసుకోవాలని ఎత్తులు వేస్తున్నారట. ఆ తర్వాత..ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా చెబుతున్నారు. రేవంత్ గ్రేటర్ వ్యూహం ఎంత వరకు వర్కౌట్ అవతుందో చూడాలి

## జనవరి చివరి తర్వాత...

హైదరాబాద్, డిసెంబర్ 22,

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి ముగిసింది. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో గెలవగా.. బీఆర్ఎస్ కూడా గట్టి పోటీ ఇచ్చింది. మొత్తం మూడు విడతలుగా ఎన్నికలు జరగ్గా.. 1205 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 11,497 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 1,25,23,137 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 85.360 శాతం పోలింగ్ నమోదైంది. కాంగ్రెస్ మద్దతుదారులు 7,010, బీఆర్ఎస్ మద్దతుదారులు 3502 మంది గెలిచారు. ఇక బీజేపీ 688 స్థానాలను దక్కించుకుంది.సర్పంచ్ ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు అందరూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అయితే ఓటర్ల సమగ్ర సవరణ జాబితా సిద్ధం చేయాల్సి ఉండటం వల్ల ఈ ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతోంది. వచ్చే ఏడాది జనవరి తొలి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర సవరణ జాబితా విడుదల చేసే అవకాశముంది. ఈ జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. సర్పంచ్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ న్యాయపరమైన చిక్కుల వల్ల ఆగిపోయాయి. ఓటర్ల సవరణ జాబితా వచ్చిన తర్వాత ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఓటర్ల సవరణ జాబితా అందిన తర్వాత వార్డుల వారీగా ఓటర్ల విభజన చేయాల్సి ఉంటుంది. దీంతో జనవరి చివరి నాటికి ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదని తెలుస్తోంది.ఇక ఫిబ్రవరిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని తెలుస్తోంది. అలాగే మున్సిపల్ ఎన్నికలను కూడా నిర్వహించాల్సి ఉంది. అయితే మున్సిపల్ వార్డుల విభజనకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం ఇంకా ఈసీకి అందించలేదు. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశముంది. దీంతో ఫిబ్రవరిలో మిగిలిన స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశముందని సమాచారం. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన జోష్‌లో కాంగ్రెస్ ఉండగా.. రాబోయే ఎన్నికల్లో కూడా గట్టి పోటీ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

## రప్పా రాప్పా ప్లెక్సీలు ద్వారకా తిరుమలలో ఉద్రిక్తత

ఏలూరు డిసెంబర్ 22,

ఏలూరు జిల్లా, ద్వారకా తిరుమలలో రప్పా – రాప్పా నరుకుతాం ఒక్కొక్కడిని.. అంటూ ఫ్లెక్సీ వెలిసింది. 2029 లో 88 మ్యాజిక్ ఫిగర్ దాటగానే గంగమ్మ జాతరలో వేట తలలు నరికినట్లు రప్పా – రప్పా నరుకుతాం ఒక్కొక్కడిని.. అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేయండం కలకలం రేపింది. ఫ్లెక్సీ ఏర్పాటు పై గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామస్తులంతా భయభ్రాంతులకు లోనవుతున్నారు. ఫ్లెక్సీ తొలగించండి అంటూ తెదేపా నేతలు విజ్ఞప్తి చేసారు. ఫ్లెక్సీ తీసేయమంటే ఫ్లెక్సీలో ఉన్నది నిజం చేస్తామని బెదిరింపులు వచ్చాయి. ద్వారకాతిరుమల పోలీసులు వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఏడుగురిపై (ఫ్లెక్సీ తయారుచేసిన వ్యక్తిపై కూడా) కేసు నమోదు చేసారు.

------------------------------

## భద్రాద్రిలో ఘనంగా అధ్యయనోత్సవాలు

భద్రాద్రి కొత్తగూడెం డిసెంబర్ 22,

భద్రాచలం. శ్రీ సీతారామచంద్ర స్వామివారి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి .ముక్కోటి ఏకాదశి అధ్యాయనోత్సవాలలో భాగంగా 2వ రోజు స్వామివారు కూర్మావతారంలో ముస్తాబై భక్తులకు దర్శనమిచ్చారు.కూర్మావతార రూపుడైన స్వామివారిని ఆలయ గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి,అనంతరం మాడ వీధుల గుండా స్వామివారిని ఊరేగింపుగా మిథిలా స్టేడియం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం వద్దకు వేదమంత్రాలు,కోలాటాల నడుమ ,మంగళ వాయిద్యాల నడుమ తోడ్కొని ఆలయ అర్చకులు,ఈఓ దామోదర్ రావు దంపతులు తీసుకువచ్చారు.కూర్మావతారం విశిష్టతదేవతలు, రాక్షసులు మందర పర్వతాన్ని కవ్వంగా,వాసుకి అనే పాముని తాడుగా చేసుకుని,అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలుకుతున్న సమయంలో,ఏ ఆధారం లేక మందర గిరి మునిగిపోగా,దేవతలు,రాక్షసుల ప్రార్ధనపై శ్రీహరి కూర్మావతారాన్ని ధరించి మునిగిపోయిన మందర పర్వతాన్ని తన వీపున నిలుపుకుని పైకెత్తి సహాయపడ్డాడు.

## పల్నాడులో మళ్లీ రక్తపాతం.. వేట కొడవళ్లతో నరికి ఇద్దరు అన్నదమ్ముల హత్య

పల్నాడు డిసెంబర్ 22,

పల్నాడు జిల్లాలో మరోసారి నెత్తురు పారింది. దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములు దారుణ హత్యకు గురవడం తీవ్ర కలకలం రేపింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు వేట కొడవళ్లతో వారిని కిరాతకంగా నరికి చంపారు. మృతులను టీడీపీ కార్యకర్తలైన కొత్త హనుమంతరావు, కొత్త శ్రీరామమూర్తిగా పోలీసులు గుర్తించారు. ఈ జంట హత్యలతో గ్రామంలో భయాందోళన నెలకొంది.అడిగొప్పల గ్రామానికి చెందిన హనుమంతరావు, శ్రీరామమూర్తి సోదరులు. గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వీరిపై ప్రణాళిక ప్రకారం దాడికి పాల్పడ్డారు. గ్రామ శివారులోని ఓ బండరాయి వద్ద హనుమంతరావు మృతదేహం లభించగా, నీలంపేట అమ్మవారి గుడి దగ్గర ఉన్న వాటర్ ప్లాంట్ సమీపంలో శ్రీరామమూర్తిని హతమార్చారు. ఇద్దరినీ అత్యంత పాశవికంగా వేట కొడవళ్లతో నరకడంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పరిశీలించి, వివరాలు సేకరించారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్ ను కలెక్టరేట్ లో ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 22: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళ సాధికారత కేంద్రం వారు తల్లులు పిల్లలకు పాలు ఇచ్చుటకై తయారు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబిన్ ను కలెక్టరేట్ ఐ డి ఓ సిలో సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి క్యాబిన్ ను ప్రారంభించారు.

ఇలాంటి క్యాబిలను ప్రతి బస్టాప్ లలో బ్రెస్ట్ ఫీడింగ్ క్యాబినస్ ఏర్పాటు చేయాలని, ఈ క్యాబిన్లు పిల్ల తల్లులకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే చంటి బిడ్డ తల్లులకు రద్దీ ప్రాంతాలలో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని ఇలాంటి బెస్ట్ ఫీడింగ్ క్యాబిన్స్ పెట్టడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, అదనపు డిఆర్డిఏ సూపర్వైజర్, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది సఖి కేంద్రం సిబ్బంది ఐ సి డి ఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పారమితలో ఘణంగా గణిత దినోత్సవ వేడుకలు

కరీంనగర్, డిసెంబర్ 22(భారతశక్తి ప్రతినిధి):

పారమిత విద్యాసంస్థలలో ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గణిత భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణిత భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పారమిత పాఠశాల విద్యార్థులు గణిత భాషకు సంబంధించిన సుమారు 200 కు పైగా ప్రాజెక్టులను స్టాల్ల రూపంలో ఏర్పాటు చేసి గణితం పై పిల్లలకు ఉన్న మక్కువను చాటారు. విద్యార్థులు చేసిన వివిధ ప్రాజెక్టులు అందరిని ఆలోచింప జేశాయి. ఈ ప్రదర్శన ద్వారా మన దైనందిన జీవితంలో గణితం యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులు చాలా చక్కగా వివరించారు. అంతే కాకుండా గణిత శాస్త్ర ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు నృత్యరూపకంగా ప్రదర్శించిన వివిధ గణిత ఆకృతులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల అధినేత ఇనుగంటి ప్రసాదరావు విద్యార్థిని విద్యార్థులకు, గణిత ప్రేమికులకు



శ్రేయోభిలాషులకు గణిత భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు , ప్రధానోపాధ్యాయులు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిపిఐ వందేండ్ల పండుగను జయప్రదం చేయండి

## -కార్పొరేషన్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి
## -సిపిఐ నగర కార్యదర్శి సురేందర్ రెడ్డి



కరీంనగర్, డిసెంబర్ 22(భారతశక్తి ప్రతినిధి):డిసెంబర్ 26వ నాటికి సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా కరీంనగర్ నగరంలో పార్టీ జెండాలను ఆవిష్కరించి వందేళ్ల సిపిఐ త్యాగాలు విజయాలను, ప్రజలకు తెలియజేసి సంబరాలను జరుపుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ పిలునిచ్చారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిపిఐ కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. సోమవారం సిపిఐ కరీంనగర్ నగర కౌన్సిల్ సమావేశం పైడిపల్లి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర, భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం సందర్భంగా జరిగిన పోరాటాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ఘనమైన చరిత్ర ఉన్నదని కమ్యూనిస్టు పార్టీ లేకపోతే తమకు ఎవరు పోటీ ఉండరు అనే ఉద్దేశంతో మోడీ ప్రభుత్వం పోరాట ఉద్యమ చరిత్ర వక్రీకరిస్తుందని ఆయన ఆరోపించారు. సిపిఐ పార్టీ పుట్టి 100 సంవత్సరాల అయిందని ఇది దేశంలో పోరాటం చేసిన చరిత్ర ఏ పార్టీకి లేదని అన్నారు

బిజెపి పాలకులు కాంగ్రెస్ కి చెందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ను గొప్పగా చెప్పుకుంటుందని వల్లభాయ్ వల్లనే హైదరాబాద్ విలీనం అయ్యిందని చరిత్ర వక్రీకరిస్తుందని విమర్శించారు.

మద్దు మోయినుద్దీన్ బద్దం ఎల్లారెడ్డి రావినారాయణరెడ్డి సాయుధ పోరాటానికి పిలిపిచ్చారని అప్పటికీ పదిలక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు ప్రజలకు పంపిణీ చేశారని దీంతో హైదరాబాద్ కమ్యూనిస్టుల వసం అవుతుందనే భయంతోనే హైదరాబాదులో విలీనానికి ఒప్పందం జరిగిందని వారు గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరిట దేశంలో మారణ హోం సాగిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక హక్కులు, జీవనోపాదులు,గౌరవ జీవితానికి ఉన్న హామీని అణిచివేస్తుండడంపై రాజి లేని పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.

భారత స్వాతంత్ర పోరాటం నుంచి ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, విద్యా,ఉద్యోగ, ఉపాధి, గృహ సమస్యలపై విరోచిత పోరాటం చేసింది సిపిఐ అని దాని ఫలితంగానే అనేక చట్టాలను హక్కులను సాధించుకున్నామని అందుకే కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ 100 సంవత్సరాలుగా ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు.

దామాషా పద్ధతిన ఎన్నికలు నిర్వహించాలని అలా చేస్తే కమ్యూనిస్టులకు రావాల్సిన ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు.

కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ బ్యాంకుల జాతీయకరణ చేశారని ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేశారని కానీ మోదీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటి కరణ, కార్పొరేట్ ల రుణాలను మాఫీ చేస్తున్న కేంద్రం వ్యవసాయ కార్మికుల రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదని నిలదీశారు. కరీంనగర్ నగరంలో కమ్యూనిస్టు పార్టీకి కార్పొరేటర్ లేక పోయినప్పటికీ పేదల భూమి పంపిణీ చేపట్టిందని, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇప్పించిందని, గుర్తు చేశారు. పేద ప్రజల కోసం జైలు జీవితం గడిపిన చరిత్ర సిపిఐ కి కరీంనగర్ లో ఉందన్నారు. భవిష్యత్తులో సిపిఐ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని మతోన్మాద బీజేపీ కి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

ఈ సమావేశంలో ఈ సమావేశంలో నగర కార్యవర్గ సభ్యులు గామినేని సత్యం, చెంచల మురళి, కసి బోసుల సంతోష చారి, మాడిశెట్టి అరవింద్, సత్యనారాయణ చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# భరోసా కేంద్రాల సేవలు భేష్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్
## -ఘనంగా భరోసా కేంద్రం వార్షికోత్సవం

కరీంనగర్, డిసెంబర్ 22(భారతశక్తి ప్రతినిధి): కరీంనగర్ జిల్లాలో భరోసా కేంద్రం అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్ అన్నారు. పోలీసు శాఖ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో రేకుర్తి- కొత్తపల్లి రోడ్డులో నిర్వహిస్తున్న భరోసా కేంద్రం మొదటి వార్షికోత్సవానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి హాజరయ్యారు. ముందుగా కేంద్రంలో చేసిన సేవలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ అలం లతో కలసి జిల్లా న్యాయమూర్తి శివకుమార్ పర్యవేక్షించి...మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ ను కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. అలాగే భరోసా కేంద్రానికి వచ్చిన జిల్లా కలెక్టర్ ను సిపి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్, మాధక ద్రవ్యాలు, పిల్లలు, మహిళలపై వేధింపులు వంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని తెలిపారు. మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపుల నివారణకు, వేధింపులకు గురైన సమయంలో ఆదరణకు భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. భరోసా కేంద్రాల్లో వైద్యం, న్యాయం, కౌన్సిలింగ్ వంటి సేవలు అందుబాటులో ఉన్నందున బాధితుల్లో ధైర్యాన్ని నింపుతాయని అన్నారు. కరీంనగర్ భరోసా కేంద్రంలో కేసులు తక్కువగా నమోదవడం మంచి విషయమని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభమైన భరోసా కేంద్రం ఎన్నో మైలురాళ్లను దాటిందని తెలిపారు. అనేక కేసుల్లో మహిళలకు చిన్నారులకు అండగా నిలిచి బాధితుల్లో ధైర్యాన్ని నింపిందని అన్నారు. బాధితులకు వైద్య, న్యాయ సహాయం అందించడం కౌన్సిలింగ్ ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపి జీవితంలో ముందడుగు వేసేందుకు సహకరించడం భరోసా కేంద్రం ద్వారా సాధ్యమైందని తెలిపారు.



పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు లైంగిక వేధింపులు, హింసకు గురైన సందర్భంలో బాధితులకు ఒకే చోట వైద్యం, న్యాయం, కౌన్సిలింగ్ వంటి వివిధ సేవలను అందించేందుకు కరీంనగర్ భరోసా కేంద్రం ప్రారంభించామని తెలిపారు. ఈ కేంద్రం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు 47 ఫోక్సో, 13 అత్యాచారం కేసులు నమోదు చేశామని తెలిపారు. బాధితులకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించామని అన్నారు. కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో మనోధైర్యాన్ని నింపడమే కాకుండా వివిధ రంగాల్లో ఉపాధి కల్పించేందుకు శిక్షణలు ఇప్పించామని అన్నారు. మహిళలు 18 సంవత్సరాలు లోపు ఉన్న బాల బాలికలు ఎవరైనా నేరుగా గాని, పోలీస్ స్టేషన్ ద్వారా భరోసా కేంద్రం సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, పోలీస్ అధికారులు, భవిత కేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సురేష్ కుమార్ కుటుంబ సభ్యులు పరామర్శించిన కేంద్ర మంత్రి
## -కుటుంబ అభ్యున్నతి కోసం ఆత్మీయ మిత్రునిగా కృషి చేస్తాను

కరీంనగర్, డిసెంబర్ 22(భారతశక్తి ప్రతినిధి):



కరీంనగర్ జ్యోతి నగర్ చెందిన మెరుగు సురేష్ కుమార్ శనివారం ఆకస్మిక మృతి చెందిన సందర్భంగా ఆత్మీయ మిత్రుడు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, సోదరుడు సంపత్ కుమార్, మిత్రబృందంతో కలిసి ఆదివారం కుటుంబ సభ్యుల్ని భార్య పిల్లల్ని, పరామర్శించి మనోధైర్యం నింపారు. భార్య సువర్ణ,తల్లి నరసమ్మ, పిల్లలతో మాట్లాడుతూ బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ సురేష్ కుమార్ ప్రజ్ఞ పాటవాలను, ఆయన పర్యావరణ, మిత్ర ఏకశిల హ్యాండ్ మేడ్ పేపర్స్ పరిశ్రమ ద్వారా అవార్డు పొంది ఉత్తమ అవార్సు, ఎంబీఏ గోల్డ్మెడల్ లిస్ట్, ఉత్తమ హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి ఉత్తమ ప్లేయర్ అని గుర్తుచేసుకున్నారు. ఆయన మరణం పట్ల తీవ్రమైన విచారాన్ని వ్యక్తం చేస్తూ సురేష్ కుమార్ లేని లోటు తీర్చలేనిధిగా పేర్కొన్నారు. కుమారులు శశాంక్, ఆశితోష్ ల ఉన్నత చదువుల కోసం, కుటుంబ అభ్యున్నతి కోసం తనవంతుగా బాల్య మిత్రునిగా తప్పనిసరిగా కృషి చేస్తానని మనోధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మెరుగు సుభాష్ భూమయ్య డా. శిరీష ,డా. శ్రీధర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ కుటుంబ సభ్యులు మిత్రులు పాల్గొన్నారు.

# పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దండి
## -నూతన పాలకవర్గాలకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పిలుపు

కరీంనగర్, డిసెంబర్ 22(భారతశక్తి ప్రతినిధి): పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీ నూతన పాలకవర్గాలకు కోరారు. సోమవారం తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్, తిమ్మాపూర్, నుస్తులాపూర్, పోరండ్ల, పోలంపల్లి, నర్సింగాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీల పాలనా పగ్గాలు చేపట్టిన కొత్త పాలకవర్గాలు ప్రజాసమస్యల పరిష్కారంపైన, గ్రామాల అభివృద్ధిపైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చాలా గ్రామాల్లో విద్యార్థులు,యువకులు మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని, చెడు వ్యసనాల బారినపడటం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. సమాజంలో రోజురోజుకు జఠిలంగా మారుతున్న ఈ సమస్యపైన దృష్టి సారించిన వాటి నివారణకు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అవసరమైతే ఇలాంటి విషయాలపై పోలీసుల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కలిసికట్టుగా అభివృద్ధికి పాటుపడాలన్నారు. పాలకవర్గ సభ్యులంతా గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు గుర్తెరిగి మసలుకోవాలన్నారు. పంచాయతీ నిబంధనలు మేరకే పనులు చేయాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తూ ప్రజామోదం పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు.

మహాత్మానగర్ లో...

మహాత్మానగర్ సర్పంచ్ గా పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ గా కేతిరెడ్డి ఎల్లారెడ్డి, వార్డు సభ్యులుగా నేదునూరి గంగరాజం, అడిశర్చ కనుకమల్లు, మునిగంటి స్పందన, ఎడ్ల అర్చన, బోయినపల్లి వెంకటేశ్, కన్నం రజిత, పొన్నాల లాస్య,రాచపల్లి సరిత, గూడ కమలాకర్ ప్రమాణం చేశారు. మండల పంచాయతీ అధికారి వి.సురేందర్ వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు.

ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల అభివృద్ధి అధికారి రాజీవ్ మల్హోత్ర, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ కుంట రాజేందర్ రెడ్డి, మహేష్,అట్ల అనిల్, రాచపల్లి ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

తిమ్మాపూర్ లో..

తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవిని గంకిడి లక్ష్మారెడ్డి మూడోసారి చేపట్టారు. సర్పంచ్ గా లక్ష్మారెడ్డితోపాటు, ఉప సర్పంచుగా పైడిపల్లి ఆంజనేయులు, వార్డు సభ్యులుగా చిలుకూరి రాజు, గంకిడి సంధ్య, నగునూరి రజిత, బొర్ర వంశీ, పోతరాజు స్వప్న, తమ్మనబోయిన నర్సయ్య, మాతంగి అంజయ్య, జక్కని నవ్య, చిలుకూరి మల్లమ్మ, కేతిరెడ్డి రజని, గడ్డి రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు.

నుస్తులాపూర్ లో...

నుస్తులాపూర్ గ్రామ సర్పంచ్ గా తుమ్మనపల్లి సంధ్య-శ్రీనివాస్ రావు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతోపాటు ఉప సర్పంచుగా గోగూరి అంజలి-నర్సింహారెడ్డి, వార్డు సభ్యులుగా నూనె సురేశ్ బాబు, వి.శ్రీనివాస్ రెడ్డి, దాడి మొండయ్య, రొడ్డ ఉజఫల,, ఆవుల నర్సయ్య, సిరిగినేని కొండల్ రావు, తమ్మనవేణి స్వరూప, అలువాల రాజేంద్రప్రసాద్, నగ్మా నౌషీన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధారపు శ్రీనివాస్, గోగూరి నర్సింహారెడ్డి, శ్రీగిరి రంగారావు, కొత్త రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరండ్ల లో ...

పోరండ్ల సర్పంచ్ గా అనోద శ్రీనివాస్, ఉప సర్పంచ్ గా నీలం ఓదెలు, వార్డు సభ్యులుగా గడ్డం రమేశ్, పార్నంది అనూష, వెల్ది పద్మ, బత్తిని రమ్య, పాటకుల చొక్కయ్య, తోడెంగ శ్రావ్య, కిన్నెర భూమయ్య, జంగిటి వంశీ, అనోద రాజయ్య, మోరపల్లి సరోజన,నాంపెల్లి సత్తయ్య ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చింతల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ చింతల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలంపల్లిలో..

పోలంపల్లి గ్రామ సర్పంచ్ గా గుంటి లావణ్య-మల్లేశం, ఉప సర్పంచ్ గా మెరుగు మోహన్, వార్డు సభ్యులుగా మంథని రాజమణి-సంపత్, న్యాలం అజయ్, కనుకం కొమురయ్య, ఖమ్మం కృష్ణ, పోలు సంపత్, ఆకుల రాములు, వెంగళ ఎల్లేష్, గుంటి మల్లీశ్వరి-బీరయ్య, ప్యాట మానస-ఎల్లస్వామి లు ప్రమాణ స్వీకారం చేశారు.


ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేశం, పార్టీ నాయకులు రాధాకిషన్ రావు, బుడిగె సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్ లో ...

నర్సింగపూర్ గ్రామ సర్పంచ్ గా పెరుక రవి, ఉప సర్పంచుగా చిరుతల యాదగిరి కనుకం మొదయ్య, గోద శ్రీనివాస్ ,ఓడ్నాల భాగ్యలక్ష్మి, చిల్ల లావణ్య, పడాల శ్రీనివాస్, పెరుక స్వప్న,మాదాసు సత్యమ్మలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్ తోపాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కొలువు దీరిన గ్రామపాలకులు.!

## -సర్పంచ్ లకు సమస్యలు స్వాగతం.!
## -పలుచోట్ల సొంతభవనాలు కరువు.!
## -వేధిస్తున్న నిధుల కొరత
## -ఆదాయ మార్గాలు సృష్టిస్తేనే సమగ్రాభివృద్ధి.!




మణుగూరు, డిసెంబర్ 22 (భారతశక్తి): పల్లెపోరు ముగిసింది. కొత్త సర్పంచ్ లు కొలువుదీరారు. రెండేళ్లుగా పాలకమండళ్లు లేక గ్రామ పంచాయితీలు బోసిపోయ్యాయి. కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన గ్రామ పాలకులపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కోటి ఆశలతో కొత్తగా పదవులోకి వస్తున్న సర్పంచులకు పంచాయితీలు సమస్యలతోనే స్వాగతం పలుకుతున్నాయి. గెలిచిన సంతోషం కంటే పంచాయితీల అప్పులు చూసి సర్పంచులు గుండెలు బాదుకుంటున్నారు. రెండేళ్లుగా పాలకమండళ్లు లేకపోవడంతో కేంద్రప్రభుత్వం ఇచ్చే 14, 15వ ఫైనాన్స్ నిధులు నిలిచిపోయాయి. పంచాయతీల సాధారణ పరిపాలన సైతం కార్యదర్శులకు కష్టంగా మారింది. పంచాయితీల నిర్వహణకు పెద్ద మొత్తంలో అప్పులు చేసినట్లు కార్యదర్శులు వాపోతున్నారు. పదవిలో కూర్చోనున్న కొత్త సర్పంచులకు నిధుల కొరత ప్రధాన సమస్యగా మారనుంది.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీలతో సమస్యలు

సర్పంచులుగా అధికార పార్టీ అభ్యర్థులు గెలిచినచోట ఇందిరమ్మ ఇళ్ల కమిటీలతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకపోవచ్చు. కానీ ప్రత్యర్థివర్గం అభ్యర్థులు గెలిచిన చోట రెండు వర్గాల మధ్య సమస్యలు సర్పంచులకు తలనొప్పిగా మారనున్నాయి. సర్పంచ్ ఇందిరమ్మ కమిటీ చైర్మన్ గా వ్యవహరిస్తాడు. కానీ కమిటీ సభ్యులతో సఖ్యత లేకుంటే వివాదాలు తలెత్తే అవకాశం ఉంటుంది. జూన్ 2న మొదలైన ఇందిరమ్మ ఇళ్ల మొదటివిడత ఇంకా అసంపూర్తిగానే మిగిలింది. జనవరి నెలలో మొదలు కానున్న రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సర్పంచ్ లు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుంది. లేదంటే సర్పంచులకు ఇది అదనపు సమస్యగా మారనుంది. ఏది ఏమైనా గెలుపొందిన సర్పంచ్ లు సమస్యలను అర్థం చేసుకుని అనుకూలంగా మలుచుకుంటేనే ప్రజలకు మంచి పరిపాలన అందించగలరు.

అప్పులు చేసి పంచాయితీల పాలన

గ్రామపంచాయతీలను నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. రెండేళ్ల నుంచి పంచాయితీలు ప్రత్యేక పాలనలోనే కొనసాగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడంలో తీవ్రనిర్లక్ష్యం వహించాయి. దీంతో పల్లెల్లో ప్రగతి పడకేసింది. శానిటేషన్, డ్రైనేజీల్లో పూడిక తీత, సెగ్రిగేషన్, నర్సరీ, పల్లెప్రకృతి వనాల నిర్వహణ, కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారింది. అప్పులు చేసి పంచాయితీల పాలన కొనసాగించారు. ఇప్పుడు వచ్చిన కొత్త సర్పంచులు పంచాయితీలకు అప్పులు చెల్లించాలి. అలాగే గతంలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు నిలిచిపోయాయి. వాటిని సైతం ఇప్పుడు వచ్చిన సర్పంచులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి పంచాయితీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒకట్రాక్టర్ ను మంజూరు చేసింది. వాటి నిర్వహణ సరిగ్గా లేక మూలనపడ్డాయి. సగానికిపైగా ట్రాక్టర్లు మరమ్మతులకు నోచుకోక రోడ్లపైనే నిలిచిపోయాయి. ట్రాక్టర్ల ఈఎంఐ సైతం చెల్లించడం కష్టంగా మారింది. ట్రాక్టర్లకు మరమ్మతులు చేయకపోవడంతో చెత్తకుప్పలు పేరుకుపోయి గ్రామాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. గ్రామాల్లో వీధిలైట్లు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సమస్యలపై కొలువు దీరిన సర్పంచ్ లు వెంటనే స్పందించాల్సి ఉంటుంది.

పాలకుల ముందున్న ప్రజాసమస్యలు

గత కొన్ని సంవత్సరాల నుంచి కొన్ని గ్రామాలలో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ, ట్యాంకర్లతో నీటిని అందించడం జరిగింది. సర్పంచ్ లు సైతం ముందు జాగ్రత్తతో ప్రణాళికల ప్రకారం వేసవికాలంలో మంచినీటి సమస్య లేకుండా చూసుకోవాలి. వితంతువులు, వృద్ధులు, అంగవైకల్యం కలిగినవారికి ప్రతి నెల పింఛను వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. ఏమైనా సాంకేతిక సమస్యలతో పేర్లు తొలగించితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉన్నది. రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా? ప్రతి నిరుపేదకు ఉపాధిహామీ పథకంలో చోటు ఉన్నదా? రైతు బీమా, రైతుబంధు వస్తుందా? గృహాల కల్పనలో నిరుపేదలకు స్థానమున్నదా? పాఠశాలలు సక్రమంగా నడుస్తున్నాయా? ప్రభుత్వం చేపట్టే పోలియో చుక్కల నిర్వహణ, వాక్సిన్?కు తోడ్పాటు అందిస్తున్నారా? ప్రతి ఒక్కరి ఇంటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఉన్నాయా? వీటన్నింటినీ చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉన్నది. రైతులకు ప్రాధాన్యమిచ్చి ప్రతి రైతుకు పంట లోన్లు, పంట నష్టపరిహారం అందేలా చూసుకోవాలి. వంద శాతం అక్షరాస్యత, పచ్చదనం, - పరిశుభ్రతకు సహకరించాలి. దేశానికి ప్రధాని ఎంతో గ్రామానికి సర్పంచ్? కూడా అంతే. కాబట్టి గ్రామాభివృద్ధి సర్పంచ్? నిజాయితీ, చిత్త శుద్ధిపై ఆధారపడి ఉంటుందని మర్చిపోకూడదు.

నిధులులేక ముందుకు సాగక..

మండలంలోని 14 పంచాయితీలు ఉండగా ఇందులో 7 సొంత భవనాలల్లో, మిగతా 7 అద్దె భవనాలల్లో ఉన్నాయి. అద్దె భవనాల్లో ఉన్న 7 పంచాయితీలకు కూడా భవనాలు మంజూరై నిర్మాణంలో ఉన్నాయి. 4 భవనాల నిర్మాణం పూర్తిస్థాయిలో ఉండగా మిగతా 3 పునాదుల లెవల్లో ఉన్నాయి. బిల్లులు సకాలంలో చెల్లించక పోవడంతో నత్తనడకన సాగుతున్నాయి.

## అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి.:
## జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు



వైయస్సార్ కడప, డిసెంబర్ 22(భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు.

సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువు లోపు తప్పనిసరి గా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయంకేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.

1)కలసపాడు మండలం చింతలపల్లె గ్రామానికి చెందిన కె. జాకోబ్ అను నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరు. చేవలసిందిగా కోరుతూ అర్జీని సమర్పించారు.

2 మైదుకూరు మండలం సుంకులవారిపల్లె గ్రామానికి చెందిన సుమంత్ తండ్రి బాలయ్య నా కుమారుడు కు మతి స్థిమితం సరిగా లేనందున వారికీ పింఛన్ మంజూరు చేయవలసిందిగా అర్జీని సమర్పించారు.

3) ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన జి.వెంకటరాయుడు తండ్రి కొండారెడ్డి నాకు రెండు చెవులు వినిపించవు ప్రభుత్వం తరుపున నాకు పింఛన్ మంజూరు చేయుదురని కోరుతూ అర్జీని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ, డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి ఎంప్లాయిమెంట్ మరియు టూరిజం శాఖ అధికారి సురేష్, డిప్యూటీ కలెక్టర్లు వెంకటపతి, శిరీష, రంగస్వామి మరియు ఎస్.ఎస్.ఏ.పిఓ. ప్రేమంత్ కుమార్, మెప్మా పిడి కిరణ్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్ లైన్ మోసాలపై అవగాహన
### - ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ అధికారి హర్షవర్ధన్
### - ఆత్మీయ అతిథిగా పరితోష్ పంకజ్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి డిసెంబర్ 22:

తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) సహకారంతో, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం 'మోసాలకు పూర్తి విరామం' (ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్) పేరిట అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ అంతటా ప్రజల అవగాహనను పెంపొందించడం, సైబర్ నేరాలను నివారించడం లక్ష్యంగా ఆరు వారాల రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు.సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసు సూపరింటెండెంట్ హర్షవర్ధన్, ఐపీఎస్, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాల ముప్పు, సైబర్ నేరస్థులు ఉపయోగించే సాధారణ మోసపూరిత పద్ధతులను వివరించారు. ప్రతి ఒక్కరూ సైబర్ మోసానికి గురయ్యే అవకాశాలున్నాయని, మొబైల్ పరికరాలలో హానికరమైన సాఫ్ట్ వేర్ ను సులభంగా ఇన్ స్టాల్ చేయవచ్చన్నారు. ఇది బ్లాక్ మెయిల్, దోపిడీ, డేటా దుర్వినియోగానికి దారితీయొచ్చని ఆయన హెచ్చరించారు. ఆన్ లైన్ గేమింగ్, ఆన్ లైన్ బెట్టింగ్ (ఇది తెలంగాణాలో నిషేధించారు), ఆన్ లైన్ చాటింగ్ లో పాల్గొనేటప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎందుకంటే, ఈ ప్లాట్ ఫారమ్ లు తరచుగా వినియోగదారులను తీవ్రమైన ఆర్థిక, వ్యక్తిగత ప్రమాదాలకు గురిచేస్తాయని హర్షవర్ధన్ తెలియజేశారు.సంగారెడ్డి పోలీసు సూపరింటెండెంట్ పరితోష్ పంకజ్, ఐపీఎస్, ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఓటీపీ మోసం, పెట్టుబడి మోసం, పార్శిల్ మోసం, డిజిటల్ అరెస్టు స్కామ్ లు, హానికరమైన ఏపీకే ఫైల్ ట్రాపులు, నకిలీ సోషల్ మీడియా ప్రొఫైళ్లతో సహా ప్రజలను ప్రభావితం చేసే వివిధ రకాల ఆన్ లైన్ మోసాల గురించి ఆయన వివరించారు. సైబర్ నేరాలకు దారితీసే సాధారణ తప్పులను ఎత్తిచూపారు. ఈ మోసం బారిన




పడినవారు తక్షణమే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930కి కాల్ చేయడం ద్వారా, లేదా మోసం జరిగిన గంటల వ్యవధిలోనే ఇ.ఎవెవతీఇతీతిఎవ.ఐనీల.తిని ఫిర్యాదు చేయడం ద్వారా ఫలితం ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, డీన్-కోర్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి అధ్యక్షత వహించారు. సైబర్-సురక్షిత తెలంగాణను నిర్మించడంలో సహాయపడటానికి వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోవడానికి, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్ లను నివారించడానికి, ఆన్ లైన్ లావాదేవీలను ధృవీకరించడానికి, సైబర్ అవగాహనను ప్రోత్సహించడానికి విద్యార్థులతో సైబర్ భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. అవగాహనా కార్యక్రమంలో భాగంగా, పోస్టర్లు, ఆడియో క్లిప్పులు, జింగిల్స్, ఇతర సమాచారా సామాగ్రిని ఆవిష్కరించి, విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారి డీఎస్పీ కే.వీ. సూర్యప్రకాశ్, బీటెక్ తొలి ఏడాది సమన్వయకర్త ప్రొఫెసర్ పి.త్రినాధరావు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, పటాన్ చెరు ఎస్ హెచ్ వో వినాయక్ రెడ్డి, టీజీఎస్ బీ ఇన్ స్పెక్టర్ రవి, ఎస్ బీ ఇన్ స్పెక్టర్ నాగరాజు తదితరులు కూడా పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలి:
### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య - ప్రజావాణికి 17 దరఖాస్తులు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 22:

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత నిచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ,అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్ఓ పద్మజ రాణిలతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని నలు మూలల నుండి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆర్జీదారుల నుండి వినతులు స్వీకరిస్తూ,వారితో మాట్లాడి సమస్యలను తెలుసు



కున్నారు. సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు పరిశీలించి తక్షణ చర్యలు

తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ సమస్యలపై వచ్చిన వినతులను జాగ్రత్తగా పరిశీలించి, పరిష్కరించ

గలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు.ప్రజావాణిలో మొత్తం 17 అర్జీలు రాగా, వాటిని సంబంధిత శాఖలకు తగిన చర్యలకు పంపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈ ఓ జానకి రెడ్డి, పి డి, డి ఆర్ డి ఓ జ్యోతి,ఆర్డీవోలు, రెవెన్యూ, పోలీస్,పంచాయతీ రాజ్, వ్యవసాయం, విద్య,హౌసింగ్, వైద్య,ఆరోగ్యం, ఇంజనీరింగ్, సంక్షేమ శాఖల జిల్లాఅధికారులు, మున్సిపల్ కమిషనర్లు,తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ బీరవోలు రవీందర్ రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా
### సోలిపేట గ్రామ ఉపసర్పంచి రోడ్డు రజిత

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 22:మాజీ ఎంపీపీ సూర్యపేట మండలం సోలిపేట గ్రామాన్ని ఎంతో అభివృద్ధి




చేసిన బీరవోలు రవీందర్ రెడ్డి సలహాలు సూచనలతో సోలిపేట గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 7 వార్డు నుండి గెలుపొంది ఉప సర్పంచ్ గా ఎన్నికైన బొడ్డు రజిత శ్రీనివాస్ అన్నారు.సోమవారం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె మాట్లాడారు. పార్టీ ఏదైనా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ఆకాంక్ష ఆసక్తి ఉన్న మంచి నాయకుడు ప్రజా సేవకుడు రవీందర్ రెడ్డి అని తెలిపారు. గ్రామంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంలో గతంలో ఎవరూ చేయలేనంత కృషిని రవీందర్ రెడ్డి చేశారని అన్నారు.దీన్ని కొందరు కృతజ్ఞత లేకుండా ఎన్నికలలో వ్యవహరించారని అలాంటి వారికి భగవంతుడు తగిన సమయంలో తగిన రీతిగా బుద్ధి చెబుతాడని ఆమె అన్నారు నిజమైన ప్రజా సేవకుడు ఎప్పుడు ప్రజల మధ్య ఉంటాడని ప్రజల గుండెల్లో ఉంటారని తెలిపారు.

## బిక్నూర్ మండలంలోని బస్వాపూర్, బిక్నూర్, దోమకొండ, ముత్యంపేట గ్రామ పంచాయతీ సర్పంచుల ప్రమాణ స్వీకారోత్సవాలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 22: కామారెడ్డి నియోజకవర్గంలోని బిక్నూర్ మండలంలోని బస్వాపూర్, బిక్నూర్, దోమకొండ, ముత్యంపేట గ్రామ పంచాయతీ



సర్పంచుల ప్రమాణ స్వీకారోత్సవాలు ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ మాజీ ఎమ్మెల్యే, మైన్స్ అండ్ మినరల్స్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, కామారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఇలియాస్, ఈరవత్రి అనిల్, ముఖ్యఅతిథిగా హాజరై, నూతన సర్పంచులకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ,ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సహకారంతో సమస్యలను పరిష్కరించుకొని గ్రామపంచాయతీలను అభివృద్ధి చేసుకుందాం.గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసంతో ఎన్నికైన సర్పంచులు పక్షపాతం లేకుండా, ప్రతి గ్రామస్తుడికి సమాన న్యాయం చేకూర్చేలా పనిచేయాలని సూచించారు.కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్థులకు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలని ఆయన కోరారు. యువత గ్రామాభివృద్ధిలో చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉందని, గ్రామ పంచాయతీలు ప్రజాస్వామ్యానికి పునాదులని మహమ్మద్ ఇలియాస్ అన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస శ్రీనివాసరావు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పిసిసి జనరల్ సెక్రటరీ ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, అనంతరెడ్డి ఐరేని సందీప్, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# రంగమ్మత్త లుక్ అదిరెన్!



టాలీవుడ్‌లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండే అనసూయ మరోసారి సోషల్ మీడియాను షేక్ చేశారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటో నెటిజన్ల దృష్టిని పూర్తిగా ఆకర్షించింది. మృదువైన ఆకుపచ్చ షేడ్స్‌తో ఉన్న రిచ్ సిల్క్ చీర, పర్పుల్ బ్లౌజ్‌లో అనసూయ ఎంతో గ్రేస్‌తో కనిపించారు. క్లోజ్‌అప్ ఫ్రేమ్‌లో ఆమె గాజులు, ఆభరణాలు, చీర ఫ్యాబ్రిక్ డీటెయిలింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. "న్యూ వీక్ మొదలయ్యే ముందు మీ స్క్రోలింగ్ కాస్త అందంగా ఉండాలని అనిపించింది" అంటూ క్యాప్షన్ పెట్టిన అనసూయ, తన హృదయానికి దగ్గరైన వ్యక్తి గురించి ఆలోచిస్తున్నానని కూడా వ్యక్తిగతంగా రాసుకొచ్చారు. ఈ లుక్ వెనుక ఉన్న క్రియేటివ్ టీమ్‌కూ పూర్తి క్రెడిట్ ఇచ్చారు. డిజైన్, స్టైలింగ్ రిషి చౌదరీ, చీర స్వాతి షాపింగ్ మాల్, జువెలరీ ది జువెల్ గ్యాలరీ, బ్లౌజ్ లిటిల్ సన్‌షైన్..ది లేబుల్ నుంచి కాగా, మేకప్ రామ కృష్ణ, హెయిర్ మహేష్‌రావులపల్లి, ఫొటోగ్రఫీ ది వాల్మీకి రాము టీమ్ చేశారు. మరోవైపు, ఇంటర్వ్యూలలో తన బోల్డ్ అభిప్రాయాలతోనూ అనసూయ వార్తల్లో నిలుస్తోంది. కెరీర్ పరంగా చూస్తే, టీవీ యాంకర్‌గా మొదలైన అనసూయ ప్రయాణం సినిమాల్లోనూ సత్తా చాటింది. 'రంగస్థలం'లో రంగమ్మత్త పాత్ర ఆమెకు విపరీతమైన పేరు తెచ్చిపెట్టగా, 'పుష్ప 2'లో దాక్షాయణిగా కూడా ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.

# రికార్డ్ బ్రేక్ వసూళ్లు



బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తున్న ధురంధర్ మూవీ రోజురోజుకూ కొత్త రికార్డులతో దూసుకుపోతోంది. మూడో వారంలోకి ఎంటరైనా ఈ సినిమా జోరు ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతి రోజూ కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేస్తూ ప్రేక్షకులను థియేటర్లకు భారీగా ఆకర్షిస్తోంది. ముఖ్యంగా థర్డ్ వీక్‌లో కూడా వసూళ్లలో ఎలాంటి తగ్గుదల లేకపోవడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అంతేకాదు. తాజాగా విడుదలైన హాలీవుడ్ బిగ్గెస్ట్ మూవీ అవతార్ ఇండియా కలెక్షన్లను కూడా ఈ మూవీ అధిగమించింది. ఇదిలా ఉండగా మూడో శనివారం ఈ మూవీ మరో సంచలన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. కలెక్షన్ల విషయంలో ఇప్పటివరకు ఏ భారతీయ సినిమా సాధించని స్థాయిలో వసూళ్లు నమోదు చేసి ఇండస్ట్రీ రికార్డ్స్‌ను తిరగరాసింది. దాదాపు 8 సంవత్సరాలుగా ఎవరూ టచ్ చేయలేకపోయిన బాహుబలి 2 రికార్డును ధురంధర్ బ్రేక్ చేసింది. ఇండియన్ బాక్సాఫీస్ చరిత్రలో 16వ రోజు అత్యధికంగా గ్రాస్ వసూళ్లు సాధించిన చిత్రంగా బాహుబలి 2 ఇప్పటి వరకు అగ్రస్థానంలో కొనసాగింది. ఆ సినిమా 16వ రోజు ఇండియా వైడ్‌గా సుమారు రూ.36 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదు చేసింది. ఇప్పుడు ధురంధర్ ఏకంగా రూ.39 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి ఆ చరిత్రను మార్చేసింది.

# హిందువులారా మేల్కోండి

టాలీవుడ్ చందమామగా పేరు తెచ్చుకుంది కాజల్ అగర్వాల్. అతి తక్కువ టైంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. 'లక్ష్మి కల్యాణం' చిత్రంతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన ఈ చిన్నది.. ఆతర్వాత వరుసగా మూవీల్లో అవకాశాలు అందుకుంది. ఇక కెరీర్ పీక్‌లో ఉండగానే ఈ అమ్మడు పెండ్లి చేసుకుంది. దాంతో సినిమాలకు చిన్న గ్యాప్ ఇచ్చింది. ఇక ఇప్పుడు రీ ఎంట్రీలో అదరగొడుతుంది. ఇదిలా ఉంటే కాజల్ అగర్వాల్ రామాయణం మూవీలో నటిస్తుందని ఇటీవలే అనౌన్స్ చేశారు. ఇక సినిమాల సంగతి ఎలా ఉన్నా.. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గానే ఉంటుంది కాజల్. సమాజంలో జరుగుతున్న పరిణామాలు, వ్యక్తిగత అంశాలను అభిమానులతో పంచుకుంటుంది. కాగా.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడి యావత్ భారతీయుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. ఈ ఘటనపై తాజాగా కాజల్ స్పందించింది. ఆమె సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ వైరల్ గా మారుతుంది. 'హిందువులారా మేల్కోండి. మౌనం మిమ్మల్ని రక్షించదు. 'ఆల్ ఐస్ ఆన్‌బంగ్లాదేశ్‌హిందూస్' అంటూ క్యాప్షన్ పెట్టింది. దీపూ చంద్రదాస్ అనే హిందువును దారుణంగా చంపి చెట్టుకు కట్టి తగలబెట్టిన ఎడిటెడ్ వీడియోను పోస్ట్ చేసింది.



# సైలెంట్‌గా ఎంట్రీ

న్యాచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల ఇద్దరు కలిసి మరో అద్భుతాన్ని చేసేందుకు రెడీ అయ్యారు. దసరా తర్వాత ఇద్దరూ కలిసి ది ప్యారడైజ్ అంటూ వస్తున్నారు. ఈ సినిమాను ఎస్.ఎల్.వి బ్యానర్ లో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నాడు. ఈ మూవీ వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు. నాని ఈ సినిమా లో జడల్ రోల్ లో డిఫరెంట్ గా కనిపించనున్న విషయం తెలిసిందే. ఇక ఈ సినిమాలో విలన్ గా కలెక్షన్ కింగ్ మోహన్ బాబుని ఎంపిక చేశారు మేకర్స్. ఈ మూవీ గురించి అన్ని విషయాలు బయటకు వస్తున్నాఇందులో హీరోయిన్ ఎవరన్నది ఇప్పటి వరకు చెప్పలేదు. దీంతో హీరోయిన్ ని ఎందుకు దాచేస్తున్నారు అన్న డిస్కషన్ సోషల్ మీడియాలో మొదలైంది. లేటెస్ట్ ఇన్ఫర్మేషన్ ప్రకారం ది ప్యారడైజ్ సెట్ లోకి హీరోయిన్ ఎంటర్ అయ్యిందట. ఆమె డ్రాగన్ బ్యూటీ కయదు లోహర్ అని తెలుస్తుంది. ఎలాంటి ఎనౌన్స్ మెంట్ లేకుండానే సైలెంట్ గా కయదు లోహర్ ది ప్యారడైజ్ సినిమా సెట్స్ లో జాయిన్ అయ్యిందట. డ్రాగన్ తో తెలుగులో కూడా సూపర్ పాపులారిటీ తెచ్చుకున్న కయదు లోహర్ ఇప్పటికే విశ్వక్ సేన్ తో ఫంకీ సినిమాలో ఛాన్స్ అందుకుంది. ఆ సినిమా కూడా చాలా సైలెంట్ గా షూటింగ్ పూర్తి చేశారు.







# అన్ని తెలుగు సినిమాలుండగా.. డబ్బింగ్ మూవీ ఎందుకు?

: బన్నీ వాసు ఆన్సర్ ఇదీ

హైదరాబాద్: క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు తెలుగు సినిమాలు వరుస కట్టాయి. అదే తేదీన మలయాళ ప్రముఖ నటుడు మోహన్‌లాల్ 'వృషభ' విడుదల కానుంది. పలు తెలుగు చిత్రాలు విడుదల సమయంలో డబ్బింగ్ సినిమాని ఎందుకొస్తున్నారన్న ప్రశ్న ఎదురవగా నిర్మాత బన్నీ వాసు స్పందించారు. ''ఈ సినిమా రెండు నెలల క్రితం విడుదల కావాల్సి ఉంది. సీజీ వర్క్ పూర్తికాకపోవడంతో ఈ నెల 25కి వాయిదా పడింది. నిర్మాణ సంస్థతో గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు అదే తేదీన విడుదల చేయాల్సి వస్తోంది. ఈ మూవీ ప్రొడక్షన్ హౌస్ కనెక్ట్ మీడియా, దీనిని హిందీలో డిస్ట్రిబ్యూట్ చేస్తున్న పెన్ మూవీస్‌తో మాకు అనుబంధం ఉంది. మలయాళ ప్రేక్షకులకు 'అల్లు'పై ప్రత్యేక అభిమానం ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకునే.. తెలుగు సినిమాలున్నా విడుదల చేస్తున్నాం'' అని తెలిపారు. తెలుగులో ఈ చిత్రాన్ని 'గీతా ఆర్ట్స్' విడుదల చేయనుంది. 'వృషభ' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో బన్నీ వాసు మాట్లాడారు. ఫిల్మ్ ఛాంబర్ ఎన్నికల నామినేషన్ విత్‌డ్రా చేసుకోవడంపై స్పందిస్తూ.. ''ఆ ఎన్నికల కోసం చాలా వర్క్ చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో అంత ఫోకస్ చేయలేననిపించింది. ఈ వ్యవహారంలో అల్లు అరవింద్ గారు మునుపటిలా యాక్టివ్‌గా ఉండి ఉంటే నేను ముందుకెళ్లేవాడిని'' అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో 'వృషభ'లో నటించిన అలీ తదితరులు పాల్గొన్నారు. ఆది సాయికుమార్ 'శంబాల', రోషన్ 'ఛాంపియన్', శివాజీ, నవదీప్‌ల 'దండోరా'తోపాటు 'ఈషా', 'పతంగ్', 'బ్యాడ్ గర్ల్స్' తదితర చిత్రాలు ఈ నెల 25న విడుదల కానున్నాయి. మరోవైపు, కన్నడ నటుడు సుదీప్ హీరోగా తెరకెక్కిన 'మార్క్' అదే డేట్‌కి రానుంది.

# మళ్లీ తిరిగొస్తానని అనుకోలేదు

: శివ రాజ్‌కుమార్



తన కొత్త సినిమా '45' ప్రమోషన్స్‌లో భాగంగా కన్నడ ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ చెన్నై సందర్శించారు. అక్కడ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో.. క్యాన్సర్ సర్జరీ రోజులను గుర్తుచేసుకున్నారు. మళ్లీ తిరిగి వస్తానని అనుకోలేదని పేర్కొన్నారు. వైద్యులు దేవుళ్లలా తనకు పునర్జన్మ ఇచ్చారన్నారు. ''గతేడాది డిసెంబరులో ట్రీట్‌మెంట్ కోసం యూఎస్ వెళ్లా. ఆ టైమ్‌లో ఎప్పుడూ లేనంతగా ఎమోషనల్ అయ్యా. సర్జరీ తర్వాత ఐదారు గంటలకు స్పృహలోకి వచ్చా. 'మళ్లీ ఇలా నీ చేయి పట్టుకుంటానో లేదో అనిపించింది' అని నా భార్యతో చెప్పా. మళ్లీ మామూలు మనిషిని కావడానికి కొంత సమయం పట్టింది. భారత్‌లో అడుగుపెట్టిన క్షణం భావోద్వేగానికి గురయ్యా. నా యోగక్షేమాల గురించి తెలుసుకునేందుకు ఎవరైనా ఫోన్ చేసినా కళ్లలో నీళ్లు తిరిగేవి. ఇలాంటి ప్రేమ ఎవరికి దక్కుతుంది? కావాల్సినంత డబ్బు సంపాదించొచ్చుగానీ ప్రేక్షకుల అభిమానం పొందడం కష్టం'' అని అన్నారు. క్యాన్సర్‌పై తన పోరాటాన్ని తెలియజేసేలా డాక్యుమెంటరీ రానుందని శివ రాజ్‌కుమార్ ఇటీవల తెలిపారు. అర్జున్ జన్యా తెరకెక్కించిన '45' సినిమా కన్నడలో ఈ నెల 25న, తెలుగులో 2026 జనవరి 1న విడుదల కానుంది.

# 'ధురంధర్', 'ఛావా'.. అందువల్లే హిట్ అనడం సరికాదు

: విక్కీ కౌశల్

'ఛావా', 'ధురంధర్'.. ఈ రెండు సినిమాలు ఊహించని స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ సినిమాల విజయానికి ప్రధాన కారణం వీటి నేపథ్యం మాత్రమేనని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఈ రెండూ దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కడం వల్లే విజయం సాధించాయంటూ వస్తోన్న కామెంట్స్‌పై విక్కీ కౌశల్ స్పందించారు. అలా అనడం సరికాదని.. నేపథ్యంతో పాటు వీటిలో ఎన్నో ఎమోషనల్ సన్నివేశాలు ఉన్నాయని అన్నారు. ''దేశభక్తి.. సినిమా విజయాలకు ఇది ఒక ఫార్ములా కాదు. అలా చెబితే అవమానించడమే అవుతుంది. దేశభక్తి నిర్వచించలేని ఓ అనుభూతి. దాన్ని మన సినిమాలు, సాహిత్యం, క్రీడలతో నిరంతరం చాటుకుంటూనే ఉండాలి. దేశంపై మనకున్న గౌరవం, ప్రేమకు నిదర్శనమే ఇలాంటి చిత్రాలు. మన దేశం గొప్పతనాన్ని ప్రపంచం ముందు చాటిచెప్పడానికి ఇదో మార్గం. 'ఛావా' లాంటి గొప్ప చిత్రంలో నటించినందుకు నాకెంతో గర్వంగా, ఆనందంగా ఉంది'' అని విక్కీ కౌశల్ అన్నారు. శంభాజీ మహారాజ్ వీరగాథగా విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'ఛావా'. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించిన ఈ హిస్టారికల్ ఫిల్మ్ ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకువచ్చి భారీ విజయాన్ని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా రూ.807 కోట్లు వసూలు చేసింది. ఇక తాజాగా వచ్చిన 'ధురంధర్' శత్రుదేశమైన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల్ని మూలాలతో సహా పెకిలించి.. అంతమొందించేందుకు భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చేపట్టిన రహస్య ఆపరేషన్ నేపథ్యంలో రూపొందింది. దేశభక్తి అంశాలతో ముడిపడిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ 17 రోజుల్లో రూ.845 కోట్లు వసూలు చేసినట్లు చిత్రబృందం తెలిపింది.





# ధ్యానం ప్రపంచశాంతికి దీప స్తంభం

(ప్రపంచ ధ్యాన వారోత్సవాల సందర్భంగా రాసిన ఆర్టికల్)

ఉరుకుల పరుగుల జీవితంలో మనిషికి ప్రశాంతతను చేకూర్చే ఆయుధం ధ్యానం.


ప్రపంచశాంతి అంతర్గత ప్రశాంతత మానసిక స్థిరత్వం కోసం ధ్యాన ప్రక్రియ దోహదపడుతుందని గుర్తించిన ఐక్యరాజ్యసమితి 2024 నుండి ప్రతి సంవత్సరం డిసెంబర్ 21న ప్రపంచ దేశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ప్రపంచ దేశాల్లో నిర్వహిస్తుంది.

*** 2025 సం" ప్రపంచ ధ్యాన దినోత్సం థీమ్* అంతర్గత శాంతి ప్రపంచ సామరస్యం**

(ఇన్నర్ పీస్ గ్లోబల్ హార్మోని)

ధ్యానం వలన అనేక ప్రయోజనాలు

కలుగుతాయి శాంతి సుస్థిరత మానవ ప్రగతికి మనుగడకు ధ్యానం సాధనంగా ఉపకరిస్తుంది



*** ధ్యానం యుద్ధాల నివారణ**

ధ్యానం ప్రపంచ దేశాల మధ్య సామరస్యం పెంచి యుద్ధాలు ప్రకృతి సంక్షోభాల నివారణలో బహుముఖ పాత్ర పోషిస్తుంది.

*** ధ్యానం శాంతి**

ధ్యానం శాంతి కరుణ ఐక్యత పరోపకారం సహకారం సహనం

పెంచి పోషించడంలో శక్తివంతమైన సాధనం.

*** ధ్యానం గొప్ప ఆయుధం**

సమాజంలో సామరస్యం సంఘీభావం సమతా మమత మానవ చైతన్యంకలిగించి స్థిరమైన ప్రపంచాన్నినిర్మించడానికిధ్యానంగొప్పఆయుధం.

*** గుణాత్మక మార్పులు**

ధ్యానం మనిషి శారీరక మానసిక ఆరోగ్యంలో గుణాత్మక మార్పులు తెస్తుంది.

*** ఆధునిక ప్రపంచ సవాళ్లకు పరిష్కారం**

ధ్యానం శాంతి సామరస్యం ఆత్మను పరిపోషిస్తుంది. మనసుకు ప్రశాంతతను చేకూరుస్తుంది.ఆధునిక ప్రపంచ సవాళ్లకు పరిష్కారం చూపిస్తుంది.

*** ధ్యానం _సవాళ్లకు పరిష్కారం**

ధ్యానం మానసిక ఒత్తిడి హింసను తగ్గిస్తుంది. సంఘర్షణలకు పరిష్కారం చూపిస్తుంది. సమాజంలో క్షీణిస్తున్న మానవీయ విలువలు విశ్వాసం పరస్పర సంబంధాలను మెరుగు పరుస్తుంది.

ఆధునిక సాంకేతిక 'సామాజిక సమస్యలకు పరిష్కారం చూపుతుంది. ధ్యానం మనసుకు స్పష్టత భావావేశాల నియంత్రణ జరిగి ధ్యానంతో ఆటుపోట్లను తట్టుకునేశక్తిపెరుగుతుంది

*** ధ్యానం _మందు**

సామాజిక సామరస్యం ఆత్రుత ఆందోళనకు ధ్యానము దివ్య ఔషధం. మెరుగైన మానసిక ఆరోగ్య జీవనశైలి ఏర్పడుతుంది. ధ్యానంతో సానుకూల మానసిక స్థితి ఆరోగ్యకరమైన నిద్రశక్తినిపెంచుతుంది. చిత్తవైకల్యం తగ్గిస్తుంది. ధ్యానం ఆధునిక ప్రపంచ సవాలను పరిష్కరించే ఆయుధం.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాలల్లో కళాశాలల్లో ధ్యానం ను పాఠ్యాంశంగా చేర్చి యువతలో మనో నిబ్బరం ఆత్మస్థైర్యాన్ని పెంచి పోషించే విద్య ప్రణాళికలు అమలు చెయ్యాలి.

ధ్యానంతో హింసా రహిత సమాజ నిర్మాణంలో స్వచ్ఛంధ సంస్థలు మహిళా సంఘాలు మీడియా క్రియా శీలక పాత్ర పోషించాలి.

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**కరీంనగర్9440245771**




## వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ
# పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ప్రావిణ్య

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 22: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ కాంటెస్ట్' పోస్టర్లను సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ ప్రావిణ్య ఆవిష్కరించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు బాహ్య ప్రపంచానికి తెలియని గమ్యస్థానాలను కనుగొనడం, ప్రకృతి, వన్యప్రాణి, ఆర్ట్, కల్చర్, హెరిటేజ్, వాటర్, రూరల్ ఏరియాలో బస, ఆధ్యాత్మికత, అడ్వెంచర్ వంటి అంశాలపై 3 ఫొటోలు సమర్పించాలన్నారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాల కనెక్టివిటీ, దూరం, రవాణా, గూగుల్ లొకేషన్, 100 పదాలతో ప్రదేశం, సందర్శించిన సమయం, బస, బడ్జెట్, సేఫ్టీ గురించి వివరణను 60 సెకన్ల వీడియోలో పొందుపరచాలన్నారు. ఆసక్తిగల వారు జనవరి 5లోగా సమర్పించాలని, గెలుపొందిన వారి వివరాలు సంక్రాంతి పండుగ రోజు వెల్లడిస్తామని పేర్కొన్నారు. మొదటి విజేతకు రూ20 వేలు, అలాగే కన్సొలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. 2 రోజులు ఉచితంగా హరిత హోటల్స్లో బస సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఆస్పత్రులు

*** సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల**

కరీంనగర్, డిసెంబర్ 22(భారతశక్తి ప్రతినిధి): ధనార్జనే ధ్యేయంగా కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ మాఫియా చెలరేగిపోతూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆరోపించారు . దురదృష్టవశాత్తు అనారోగ్యానికి గురై అత్యవసర పరిస్థితులలో ప్రజలు హస్పిటల్ కు వస్తే వారిని ప్రాణాప్రాయం నుండి కాపాడాల్సిన హాస్పిటల్స్ యాజమాన్యాలు రోగుల అత్యవసర పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు నిలువునా దోచుకుంటున్నారని, అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే ఎం.ఎన్.సి మందులతో వైద్యం అందించాల్సిన వైద్యులు లోకల్ గా తయారవుతున్న మందులతో వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని,అనవసరమైన వైద్య పరీక్షలు చేసి రోగుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్స్ లో చేరిన ఇన్ పేషెంట్లకు మల్టీ నేషనల్ కంపెనీలు తయారుచేసిన మెడిసిన్ ఉపయోగించి వైద్యం చేయాల్సిన ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్యులు లోకల్ గా తయారు కాబడిన నాసిరకం మందులను రోగులపై వాడుతున్నారని, ఈ మందులు ఒక్క ఆసుపత్రికి ఒక్కో రేట్ చొప్పున ఇష్టానుసారంగా రేట్లు ఫిక్స్ చేసుకొని ప్రజలను,రోగులను ఆర్థికంగా నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఒకే రకమైన వ్యాధికి ప్రైవేటు హాస్పిటల్స్ వారు ఉపయోగిస్తున్న మెడిసిన్ ఫార్ములా ఒకటే అయినప్పటికీ ఒక్కో హస్పిటల్ లో ఒక్కొక రకమైన మెడిసిన్ ధరల్లో భారీగా తేడాలు ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తుందని, ఇన్ పేషెంట్లకు వాడే మందులను లోకల్ గా తయారు చేసే కంపెనీలతో ముందే లోపాయికారి ఒప్పందం చేసుకొని ప్రైవేట్ ఆసుపత్రిలో యాజమాన్యాలు నిర్ణయించిన ధరలనే మందులపైన ముద్రించాలని అలా అయితేనే ఆ కంపెనీల మందులను వాడుతామని బెదిరిస్తూ వారు చెప్పిన ధరలనే మెడిసిన్ పై ముద్రించడంతో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అడ్డు లేకుండా పోయిందని,దాని మూలంగా ఇటు ప్రజల ప్రాణాలతో పాటు అటు డబ్బులు కూడా కోల్పోతున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడిని నియంత్రించి ప్రజల,రోగుల ప్రాణాలను కాపాడాల్సిన అధికారులు నిద్రమత్తులో ఉంటున్నారని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు మరియు డ్రగ్ ఇన్స్పెక్టర్లు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఇప్పటికైనా వైద్య శాఖా అధికారులు స్పందించి ప్రైవేట్ ఆస్పత్రుల అరాచకాలకు అడ్డుకట్ట వేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని,లేనిపక్షంలో నాసిరకం మందులతో వైద్యం అందిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ ముందు సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

*** రూ. 26 వేలు జరిమానా**

ఎల్బీనగర్, డిసెంబర్ 22 (భారత శక్తి): నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు సంవత్సరాల క్రితం జరిగిన మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ ఫాస్ట్ కోర్టు సోమవారం దోషిగా నిర్ధారిస్తూ శిక్ష ఖరారు చేసినట్లు నాగోలు పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. 2023 నవంబర్ 16న నాగోలు పరిధిలోని జైపురి కాలనీ నివసిస్తున్న మైనర్ బాలిక (16) ఇంట్లో ఒంటరిగా ఉండగా అదే కాలనీకి చెందిన సెంట్రింగ్ పనిచేసే దండుల సాయి కుమార్ (24) ఇంట్లోకి ప్రవేశించాడు. అనంతరం బాలికను బలవంతంగా బాత్రూమ్ లోకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారం చేసినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ ఘటనపై 2023 నవంబర్ 20న బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు



ఎస్టీ బాలిక కావడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత వివిధ సెక్షన్ల కింద కేసు దర్యాప్తు చేపట్టారు. విచారణను అప్పటి ఎల్బీనగర్ ఏసీపీ జానకి రెడ్డి నిర్వహించగా 2023 నవంబర్ 22న నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన రంగారెడ్డి జిల్లా పాస్ట్ ట్రాక్ కోర్టు ప్రాసిక్యూషన్ వాదనలు, సాక్ష్యాలను పరిశీలించి నిందితుడిని దోషిగా నిర్ధారించింది. దీంతో అతడికి జీవిత ఖైదు శిక్ష, రూ.26 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని సీఐ పేర్కొన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సత్యనారాయణ, శోభారాణి వాదనలు వినిపించారు. అలాగే కోర్టు కానిస్టేబుల్ రాజు, సమన్స్ పీసీ వెంకటేష్, అరుణజ్యోతి సేవలను అధికారులు అభినందించినట్లు తెలిపారు. కేసు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు. ఎల్బీనగర్ జోన్ డీసీపీ అనూరాధ, అడిషనల్ డీసీపీ కోటేశ్వర రావు, ఎల్బీనగర్ డివిజన్ ఏసీపీ ఏ. కృష్ణయ్యలు దర్యాప్తు అధికారులను, ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించారు.

# జ్ఞానం ఉనికికి అర్థాన్ని ఇస్తుంది

*** గీతంలో నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవంలో ప్రొఫెసర్ కన్నన్**

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 22: జ్ఞానం ఉనికికి అర్థాన్ని ఇస్తుందని, మానవులను అన్ని ఇతర జాతుల నుంచి వేరు చేస్తుందని ప్రొఫెసర్ శ్రీనాథన్ కన్నన్ వ్యాఖ్యానించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత, గణాంక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, జ్యోతి ప్రజ్వలనతో ఈ వేడుకలను ప్రారంభించారు. జ్ఞానం జీవితాన్ని సౌకర్యవంతంగా చేయడమే కాకుండా నాగరితను నిలబెట్టి మానవాళిని శాశ్వతంగా ఉంచే సామర్థ్యాన్ని కలిగి ఉందని డాక్టర్ కన్నన్ నొక్కి చెప్పారు. మానవ జ్ఞానం నాగరికతకు, విశ్వాసానికి రెండింటికీ ఉద్దేశ్యాన్ని ఇవ్వగల అత్యంత శక్తివంతమైన సాధనంగా ఆయన అభివర్ణించారు. 'పూర్ణాంక కారకం, ఫోరియర్ పరివర్తన, క్వాంటం అల్గోరిథంలు' అనే అంశంపై ప్రొఫెసర్ కన్నన్ ఉపన్యసించారు. క్వాంటం ఫ్యాక్టరింగ్ లో ఉన్న కీలక దశలను ప్రొఫెసర్ శ్రీనాథన్ కన్నన్ వివరించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా సభాధ్యక్షత వహించి, అతిథిని సత్కరించారు.



కార్యక్రమ లక్ష్యాన్ని గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్ వివరించారు. గణిత శాస్త్ర ఆలోచన మానవ డీఎన్ఏ, సంస్కృతిలో లోతుగా పొందుపరచబడిందని ప్రొఫెసర్ వంశీ కృష్ణ నార్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి సమన్వయం చేయడంతో పాటు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ కుమ్మరి, విద్యార్థి సమన్వయకర్తలు సహస్ర దీప, సుష్మిక తదితరులు పాల్గొన్నారు. ముత్తంగిలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై, ఈ వేడుకలకు మరింత శోభను జోడించారు.

# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయండి

*** బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**

గుమ్మడిదల,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 22: గ్రామాల అభివృద్ధి దిశగా కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు కృషి చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సూచించారు.గుమ్మడిదల మండల పరిధిలో బీఆర్ఎస్ మద్దతుదారులుగా విజయం సాధించిన సర్పంచుల ప్రమాణస్వీకార కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. అనంతారం సర్పంచ్ కొమ్ము శ్రీను, వీరారెడ్డిపల్లి సర్పంచ్ బుద్ధులదుర్గ నర్సింగరావు, కొత్తపల్లి సర్పంచ్ సూరారం మంజుల సత్తయ్య, నాగిరెడ్డిగూడెం సర్పంచ్ గడ్డం లావణ్య గోవర్ధన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉండి గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని



సూచించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సమగ్ర అభివృద్ధి సాధించేలా సర్పంచులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, రాజేష్, నాయకులు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, సద్ది విజయభాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, హుస్సేన్, చిమ్ముల దీపా నరేందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, గణేష్ అప్ప, చక్రపాణి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, యాదిరెడ్డి,గోపాల్, సందీప్ గౌడ్, శివ, వెంకటేశం,కర్ణాకర్ రెడ్డి, ఆంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు

కడప, డిసెంబర్ 22,(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు సెక్రటరీకం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే కడప నగరం తిలక్ నగర్ నందు 22 122025 వ తేదీన "నల్సా (ఆశఅవగాహన, మద్దతు, సహాయం మరియు చర్య) ప్రామాణిక ఆపరేటింగ్ విధానం - బాల్య వివాహాలను నిర్మూలించడానికి, 2025 మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు మరియు చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 ప్రచార కార్యక్రమాలు" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల




వల్ల కలిగే నష్టాల గురించి, బాల్య వివాహాల నుండి రక్షించబడిన వారికి మానసిక, సామాజిక మద్దతు అందించడం, నల్సా అనేది బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు అందించే సంస్థ. ఆశ ప్రోగ్రామ్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఆశ అనేది బాల్య వివాహాల నివారణకు నల్సా ప్రారంభించిన ఒక సమగ్ర కార్యక్రమం, ఇది చట్టపరమైన, సామాజిక, మానసిక సహాయాన్ని అందిస్తూ, బాధితులకు అండగా నిలుస్తుంది. చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది నీలకంఠేశ్వర్ రెడ్డి, పారా లీగల్ వాలంటరీలు దశరథ రామిరెడ్డి, శ్రీనివాసులు, నిర్మల, ఆశా వర్కర్లు మరియు అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

# పోలియో చుక్కలు తప్పక వేయాలి

* అనంతలో పేరూరు బాలకృష్ణ పిలుపు

అనంతపురం, డిసెంబర్ 22 (భారత శక్తి) : కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు 5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పక వేయాలని భారత జాతీయ వినియోగదారుల హక్కుల కౌన్సిల్ జాతీయ అధికార ప్రతినిధి పేరూరు బాలకృష్ణ పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 54,07,663 మంది చిన్నారుల కోసం ఇప్పటికే 98,99,300 వ్యాక్సిన్ డోస్‌లను అన్ని జిల్లాలకు పంపిణీ చేసి, ఈ నెల 21న విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. సోమవారం అనంతపురం రైల్వేస్టేషన్లో పలువురు చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా పేరూరు బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ 2014లోనే భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ప్రకటించిందన్నారు. పొరుగు దేశాలైన పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌లలో వైరస్ ప్రభావం ఇంకా ఉండటంతో భారత్ అప్రమత్తంగా ఉందన్నారు. రాష్ట్రంలో చివరి కేసు 2008లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నమోదైందని చెప్పారు.పోలియో మహమ్మారిని దేశం నుండి పూర్తిగా తరిమికొట్టేందుకు 1995 నుండి నేషనల్ ఇమ్యునైజేషన్ డే నిర్వహిస్తున్నారన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు, వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి వైద్యారోగ్య శాఖ నిరంతరం శ్రమిస్తోందన్నారు. టీకా పంపిణీ విధానం సాధారణ ఇమ్యునైజేషన్ షెడ్యూల్‌లో భాగంగా పిల్లలకు ఐదు డోసుల ఓపీవీ చుక్కలు వేయాలన్నారు. పల్స్ పోలియో రోజున అదనంగా మరో రెండు చుక్కల (ఒక డోస్) వ్యాక్సిన్ అందించారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 38,267 బూత్‌లలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ సేవలు అందించారన్నారు. ఈ భారీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు నోడల్ ఆఫీసర్లను, 4,206 మంది సూపర్వైజర్లను ఏపీ ప్రభుత్వం నియమించడం అభినందనీయమన్నారు. మొబైల్ బృందాలు మొదటి రోజున బూత్‌లకు రాలేని పిల్లల కోసం డిసెంబర్ 22, 23 తేదీలలో 76,534 బృందాలు ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేస్తాయన్నారు. చుక్కలు వేసిన ఇళ్లకు 'పి' గుర్తును, వేయని పక్షంలో 'ఎక్స్' గుర్తును కేటాయిస్తారన్నారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు వంటి రద్దీ ప్రదేశాలలో ప్రయాణికుల కోసం 1,140 ట్రాన్సిట్ బూత్‌లను ఏర్పాటు చేశారని పేరూరు బాలకృష్ణ వివరించారు. మురికివాడలు, వలస ప్రాంతాలు, నిర్మాణ స్థలాల్లో ఉన్న పిల్లల కోసం 1,854 మొబైల్ బృందాలు నిరంతరం పర్యటిస్తాయన్నారు. జనం భాగస్వామ్యంతో ఈ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేశారని చెప్పారు. తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, తద్వారా రాబోయే తరాలను ఈ వ్యాధి నుండి కాపాడాలని కోరారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు.





## సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించిన కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 22 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్‌లోని కమర్షియల్ టాక్స్ కాలనీ, పరిసర కాలనీలలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ సదుపాయం లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను వివరించడానికి నేడు కమర్షియల్ టాక్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని వారి నివాసంలో కలసి సమస్యలు వివరించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు వివరంగా విన్న కార్పొరేటర్ వెంటనే సంబంధిత జలమండలి అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి, డ్రైనేజ్ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ కాలనీ అధ్యక్షులు వెనకటేశ్వర్లు, బి. శ్రీనివాస్ రెడ్డి, బి. క్రిష్ణ రెడ్డి, డి. రవి, కే. వెంకట్ రెడ్డి, వస్పవి కాలనీ అధ్యక్షులు డి. పెద్దులు,కాలనీవాసులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# రాచకొండ పరిధిలో 33,040 కేసులు

* గతేడాదితో పోలిస్తే పెరిగిన క్రైం రేటు
* మహిళలపై పెరిగిన నేరాలు
* 1,224 పోక్సో కేసులు నమోదు
* 2025 క్రైమ్ వార్షిక నివేదికను వెల్లడించిన సీపీ సుధీర్ బాబు




రాచకొండ,డిసెంబర్ 22 (భారత శక్తి):రాచకొండ కమిషనరేట్ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈసారి నేరాల సంఖ్య పెరిగినట్లు రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో రాచకొండ 2025 క్రైమ్ వార్షిక నివేదికను ఆయన వెల్లడించారు. గత ఏడాది కమిషనరేట్ పరిధిలో 28,626 కేసులు నమోదు కాగా, 2025లో 33,040 కేసులు నమోదైనట్లు చెప్పారు. కిడ్నాప్ కేసులు, పోక్సో కేసుల సంఖ్య కూడా పెరిగిందని, 579 కిడ్నాప్ కేసులు,1224 పోక్సో కేసులు నమోదయ్యాయని, మర్డర్ ఫర్ గెయిన్ కేసులు 3 నమోదైనట్లు సీపీ వివరించారు.గత ఏడాదితో పోలిస్తే మహిళలపై నేరాల సంఖ్య 4 శాతం పెరిగిందని, ఈ ఏడాది రూ.20 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో 668 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. 256 డ్రగ్స్ కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఇందులో 2,090 కిలోల గంజాయి,35 కిలోల గంజాయి చాక్లెట్లు, 34 కేజీల హ్యాష్ ఆయిల్, 216 గ్రాముల ఎండీఎంఏ, 10 కిలోల ఓపీఎస్, 242 గ్రాముల హెరాయిన్, 35 కిలోల గసగసాల సామాగ్రి సీజ్ చేసినట్లు ప్రకటించారు.

**పెరిగిన కన్విక్షన్ రేటు.**

ఎక్సైజ్ యాక్ట్ కింద 656 కేసులు నమోదు చేసి 689 మంది అరెస్ట్ చేశామని సీపీ తెలిపారు. 6,824 లీటర్ల మద్యం సీజ్ చేశామని, గేమింగ్ యాక్ట్ కింద 227 కేసులు నమోదు చేసినట్టు వివరించారు. 1,472 మందిని అరెస్ట్ చేసి 69 లక్షల ప్రాపర్టీ సీజ్ చేశామన్నారు. మానవ అక్రమ రవాణా కింద ఈ ఏడాది 73 కేసులు నమోదు చేశామని, 8 స్థావరాలు గుర్తించామని తెలిపారు. ఈ ఏడాది 5,647 కేసుల్లో 146 మందికి జైలు శిక్ష ఖరారైందని, గత ఏడాదితో పోలిస్తే 74 శాతం కన్విక్షన్ రేటు పెరిగిందన్నారు. ఈ ఏడాది స్పెషల్ ఆపరేషన్ టీమ్ 186 డ్రగ్స్ కేసుల్లో 356 మందిని అరెస్ట్ చేసిందని సీపీ సుధీర్ బాబు వెల్లడించారు.



**తగ్గిన సైబర్ క్రైం కేసులు.**

గత ఏడాదితో పోలిస్తే సైబర్ క్రైమ్ కేసులు తగ్గినట్లు సీపీ తెలిపారు. గత ఏడాది 4,618 కేసులు నమోదు కాగా, ఈసారి 3,734 కేసులు నమోదయ్యాయని, ఆపరేషన్ ముస్కాన్ కింద 2,479 మందిని రెస్క్యూ చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ స్మైల్ ద్వారా 1,071 మందిని రెస్క్యూ చేశామన్నారు. గత ఏడాదితో పోలిస్తే రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిందని, గత ఏడాది 3,207 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 3,488 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 659 మంది మృతి చెందారని వివరించారు. కమిషనరేట్ పరిధిలోని ఓఆర్ఆర్ పై జరిగిన ప్రమాదాల్లో 37 మంది మృతి చెందారని సీపీ వివరించారు.

**నేరాలు ఇలా**

దోపిడీలు 3
దొంగతనాలు 67
ఇళ్లలో చోరీలు 589
వాహనాల చోరీలు 876
సాధారణ చోరీలు 1,161
హత్యలు 73
లైంగికదాడులు 330
వరకట్న మరణాలు 12
గృహహింస కేసులు 782




## పోరెడ్డి లక్ష్మారెడ్డి మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 22 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గం జిల్లెల్లగూడ గ్రామానికి చెందిన పోరెడ్డి లక్ష్మారెడ్డి సోమవారం తెల్లవారుజామున మరణించిన విషయం తెలుసుకున్న మాజీమంత్రి మహేశ్వరం నియోజకవర్గ శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఆయన నివాసానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మారెడ్డి కుమారులు పోరెడ్డి రాజేందర్ రెడ్డి , ప్రభాకర్ రెడ్డిలతో మాట్లాడి అధైర్య పడవద్దని ధైర్యంగా ఉండాలని ఓదార్చి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్స్ అర్కల భూపాల్ రెడ్డి, బొక్క రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# అసెంబ్లీకి రండి...నువ్వు చేసిన అరాచకాలపై చర్చిద్దాం

* విరుచుకుపడ్డ డిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే మేడిపల్లి
* మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామికి ఘననివాళి




కరీంనగర్, డిసెంబర్ 22(భారతశక్తి ప్రతినిధి): పదేండ్లలో చేసిన అరాచకం, దాష్టీకం, తెలంగాణ ప్రజలు మరిచిపోలేదని మాజీ సీఎం కేసీఆర్ పై విరుచుకుపడ్డారు. కేసీఆర్ అహంకార పూరితమైన పదేళ్ల పాలనను ప్రజలు మరో పది దశాబ్దాల వరకు గుర్తుపెట్టుకుంటారని మండిపడ్డారు. రెండేళ్లుగా పామ్ హౌజ్ ను వదిలి రావడం సంతోషంగా ఉందన్నారు. సోమవారం నగరంలోని పద్మనగర్లో గల జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ కేంద్ర మంత్రి, స్వర్గీయ గడ్డం వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అరపెల్లి మోహన్, మాజీ ఎంఎంసీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ లతో కలసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో పై విధంగా కేసీఆర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నదీజలాలపై ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ తో చేసిన ఒప్పందాలు, మాజీ మంత్రి రోజా ఇంట్లో చేపల పులుసు తిన్నది ఎప్పటికీ ఈ ప్రజలు మదిలో ఉంటున్నారు. ఇప్పటికైనా కేసీఆర్ మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ కి రావాలని ఎన్నోసార్లు రావాలి ఆహ్వానించారని రాకుండా పామ్ హౌజ్ ను వదల్లేదని గుర్తుచేశారు. అసెంబ్లీకి వస్తె పదేళ్లలో చేసిన మీ అరాచకాలతో పాటు ప్రస్తుతం మా ప్రజాపాలన లో చేసిన సంక్షేమ పథకాలపై చర్చిద్దాం రావాలని కోరుతున్నాము రాకుండా మా ముఖ్యమంత్రిపై అసత్యపు ఆరోపణలు చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఇంట్లో గెలిచి రచ్చ గెలవాలని అన్నారు పెద్దలు...బి ఆర్ ఎస్ పార్టీకి అతి లేదు... అతిగతి లేదు...పార్టీ ముక్కలయిందనీ...కన్నా కూతురు కవిత రోడ్డెక్కిందని, కెసిఆర్ తప్పులను ఎండగతునే ఉందన్నారు. పార్టీలో వర్గ పోరుతో పార్టీని చక్కదిద్దే పనిలో నిమగ్నం కాకుండా సీఎం రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు జేజేలు పలుకుతుంటే ఓర్వలేక తనకున్న ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు.




## వృత్తి విద్యా కోర్స్ సర్టిఫికెట్లను అందజేసిన చిగిరింత పారిజాత రెడ్డి

బడంగ్ పేట్, డిసెంబర్ 22 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ బడంగ్ పేట్ లోని ప్రజా భవన్ లో జన శిక్షణ సంస్థాన్ రంగారెడ్డి జిల్లా వారి ఆధ్వర్యంలో ఉచితంగా మహిళల కోసం నిర్వహించిన వృత్తి విద్యా కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ సందర్భంగా మాజీ మేయర్ సర్టిఫికెట్లను అందుకున్న మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఆమె కోరారు. దాదాపు ప్రతి సంవత్సరం కోర్సులు నేర్పించి వారికి సర్టిఫికెట్ల పంపిణీ చేస్తున్న జన శిక్షణ సంస్థాన్ వారికి ప్రత్యేకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ సంస్థ డైరెక్టర్ రామ మోహన్, మాజీ కార్పొరేటర్లు నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, దీపికా శేఖర్ రెడ్డి, నాయకులు గట్టు బాలకృష్ణ, కాలని అధ్యక్షులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక శ్రేయస్సును పెంపొందించుకోవాలి : వ్యక్తిత్వ వికాస నిపుణులు



ఎల్బీనగర్, డిసెంబర్ 22 (భారత శక్తి): అధ్యాపకులు, విద్యార్థులు తమ మానసిక శ్రేయస్సును పెంపొందించుకోవడంతో పాటు ఒత్తిడి, నిర్వహణ, లక్ష్య నిర్దేశం కోసం అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అమృత సంకల్ప్ క్లినిక్ ప్రఖ్యాత మనస్తత్వ వేత్తలు డాక్టర్ సుమలత, డాక్టర్ సంజీవనిలు అన్నారు. చైతన్యపురిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా న్యాయ కళాశాలలో సెమినార్ హాల్‌లో మానసిక శ్రేయస్సు వర్క్‌షాప్ జరిగింది.ఈ వర్క్‌షాప్ "వ్యక్తిత్వ ప్రవర్తన లక్ష్య నిర్దేశం, ఒత్తిడి నిర్వహణ నైపుణ్య అభివృద్ధి"పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఒత్తిడి నిర్వహణ, లక్ష్య నిర్దేశం వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలను వివరించారు. మానసిక శ్రేయస్సును కాపాడుకోవడానికి విలువైన అంతర్దృష్టులు, వ్యూహాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మానస, వైస్ ప్రిన్సిపల్ పి.కవిత అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో ముగిసిన శీతాకాల విడిది... ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము

హైదరాబాద్, డిసెంబర్ 22 (భారత శక్తి ): హైదరాబాదులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది సోమవారంతో ముగిసింది. ఈ సాయంత్రం హైదరాబాద్ పర్యటనను ముగించుకుని ఆమె ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నత స్థాయి సివిల్, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రయాణం సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట ఎయిర్‌బేస్ వరకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. శీతాకాల విడిది కోసం డిసెంబర్ 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 19న రామోజీ ఫిల్మ్ సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ప్రారంభించారు. 20న బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 21న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోమ్' విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రావడం ఆనవాయతీ. ఈ సమయంలో రాష్ట్రపతి నిలయం నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. 1860లో నిర్మించిన ఈ భవనం, 1948లో హైదరాబాద్ భారత్‌లో విలీనమైన తర్వాత రాష్ట్రపతి విడిది కేంద్రంగా మారింది.

## తెలంగాణలో అక్రిడిటేషన్లపై జీవో విడుదల

* **తెలంగాణలో అక్రిడిటేషన్లపై జీవో విడుదల**

హైదరాబాద్, డిసెంబర్ 22 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇచ్చే మీడియా అక్రిడిటేషన్ కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2016 నాటి పాత నిబంధనలను రద్దు చేస్తూ, 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025'ను ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 252 ను సోమవారం చీఫ్ సెక్రటరీ కే. రామకృష్ణారావు జారీ చేశారు.

**కొత్త నిబంధనల ముఖ్యాంశాలు:**

1. అక్రిడిటేషన్ కమిటీల కాలపరిమితి: రాష్ట్ర స్థాయి,జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల పదవీ కాలం రెండేళ్లుగా నిర్ణయించారు. కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాతవే కొనసాగుతాయని తెలిపారు.
2. అక్రిడిటేషన్ కార్డు, మీడియా కార్డు:
   * అక్రిడిటేషన్ కార్డు: ఇది ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు గుర్తింపుగా ఉపయోగపడుతుంది.
   * మీడియా కార్డు: డెస్క్ జర్నలిస్టులకు ఇచ్చే ఈ కార్డులు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొందేందుకు మాత్రమే పనికివస్తాయి.
3. డిజిటల్ మీడియాకు తొలిసారి నిబంధనలు:
   * డిజిటల్ న్యూస్ మీడియాకు అక్రిడిటేషన్ ఇవ్వాలంటే సదరు వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం 5 లక్షల మంది విజిటర్స్ (యూనిక్ విజిటర్స్) ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మీడియా కేటగిరీలో గరిష్టంగా 10 కార్డులు మాత్రమే ఇస్తారు.
4. ఎలిజిబిలిటీ క్రైటీరియా:
   * న్యూస్ పేపర్లు: కనీసం 2 వేల ప్రతులు పంపిణీ అవుతున్న దినపత్రికలే అక్రిడిటేషన్‌కు అర్హులు. PRGI రిజిస్ట్రేషన్ తప్పనిసరి.
   * ఎలక్ట్రానిక్ మీడియా: శాటిలైట్ ఛానళ్లు 50% వార్తా కంటెంట్‌ను కలిగి ఉండాలి. లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం 3 బులెటిన్లు టెలికాస్ట్ చేయాలి.
   * జర్నలిస్టుల అర్హత: స్టేట్ లెవల్ అక్రిడిటేషన్ కోసం డిగ్రీ విద్యార్హత లేదా ఐదేళ్ల అనుభవం ఉండాలి.
   * నియోజకవర్గ, మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి.

**5. ఫ్రీలాన్స్ & వెటరన్ జర్నలిస్టులు:**

* 15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**కమిటీల నిర్మాణం:**

* రాష్ట్ర కమిటీ : మీడియా అకాడమీ చైర్మన్ చైర్మన్‌గా, ఐఅండ్‌పిఆర్ కమిషనర్ కో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో వివిధ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులు, పీసీఐ సభ్యులు ఉంటారు.
* జిల్లా కమిటీ : జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డీపీఆర్వో మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

* **నిబంధనల ఉల్లంఘన జరిగితే:**

* అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. పోగొట్టుకున్న కార్డుల స్థానంలో డూప్లికేట్ కార్డు కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుందని జీవో విడుదల చేశారు.

## రేపు సీఎం చంద్రబాబు 'క్వాంటం టాక్'..

అమరావతి, డిసెంబర్ 22 (భారత శక్తి ): క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'క్వాంటం టాక్' పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు (డిసెంబరు 23) ఉదయం 9:30 గంటలకు టెక్ విద్యార్థులను ఉద్దేశించి డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రసంగించనున్నారు. క్వాంటం ఐటీ కంపెనీలైన క్యూబిట్, వైసర్‌లతో కలిసి ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ క్వాంటం ప్రోగ్రామ్ కోసం కేవలం 10 రోజుల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందికి పైగా టెక్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 51 శాతం మంది మహిళా విద్యార్థులే ఉండటం విశేషం. అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. తన ప్రసంగంలో సీఎం చంద్రబాబు ఏపీలో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను వివరించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 3 వేల మందికి ఉన్నత స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. వీరి నుంచి ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఎస్ఐఆర్, సీడాక్, నేషనల్ క్వాంటం మిషన్‌లలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తారు. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా, రాబోయే మూడేళ్లలో ఏపీ నుంచి లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి అభయ్ కరాండికర్, ఐఐటీ చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, వైసర్ డైరెక్టర్ ప్రాచీ వఖారియా వంటి ప్రముఖులు పాల్గొననున్నారు.

## అమరావతిలో కల్చరల్ సెంటర్... సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయం

అమరావతి, డిసెంబర్ 22 (భారత శక్తి ): రాజధాని అమరావతిలో రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఒక ఆధునిక కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీని కోసం వెంటనే అనువైన భూమిని గుర్తించాలని సూచించారు. నేడు సచివాలయంలో జరిగిన 56వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి, పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా రాజధాని అభివృద్ధి పనులపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు అమరావతిలో ఒక వేదిక ఉండాలి. రాష్ట్ర సంస్కృతికి అద్దంపట్టేలా కల్చరల్ సెంటర్ నిర్మాణం చేపట్టాలి. నిర్దేశిత గడువులోగా క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలి. భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్ల వద్ద పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. వారి సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా పరిష్కరించాలి," అని స్పష్టం చేశారు. రాజధాని ప్రాంతంలోని అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించేలా పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు.

* **56వ సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిన అంశాలు**

• అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ 2 ఎకరాల పరిధిలో రూ.103.96 కోట్లతో రీసెర్చ్ సెంటర్

• అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలకు అదనపు సౌకర్యాల కల్పనకు రూ.109 కోట్ల కేటాయింపు.

• శాఖమూరు గ్రామంలో 23 ఎకరాల్లో ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భవనాల నిర్మాణం.


• హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు తుళ్లూరులో 6 ఎకరాలు కేటాయింపు.

• 8400 క్యూసెక్కుల కెపాసిటీతో రూ.444 కోట్లతో ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు.

• ఎల్పీఎస్ జోన్ 8లో లేఅవుట్ల అభివృద్ధికి రూ.1358 కోట్లు కేటాయింపు.

• 202 ఎకరాల భూమి జరీబు లేదా మెట్ట ప్రాంతమా అని నిర్ధారణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు. వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, రెవెన్యూ, సర్వే విభాగాలకు చెందిన అధికారులతో కమిటీ ఏర్పాటు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఛత్తీస్ గఢ్ సరిహద్దులో
## మావోయిస్టుల భారీ డంప్ ధ్వంసం



ఒడిశా ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు దాచిపెట్టిన భారీ ఆయుధ సామగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన జవాన్లు, మీనాగట్ట అడవుల్లో భూమిలో పాతిపెట్టిన పేలుడు పదార్థాలను మరియు ఆయుధాలను వెలికితీశారు. సరిహద్దు జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు భారీ విధ్వంసానికి ప్లాన్ చేస్తున్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం అందింది. దీనితో రంగంలోకి దిగిన ప్రత్యేక బలగాలు, స్థానిక పోలీసు దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని, ప్రదేశంలో మావోయిస్టులు నిల్వ చేసిన భారీ ఆయుధ గిడ్డంగిని గుర్తించారు. ఆయుధ తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేసి, అక్కడున్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, స్వాధీనం చేసుకున్న వాటిలో భారీ ఎత్తున ఐఈడీ పేలుడు పదార్థాలు, వైర్లు, డిటోనేటర్లు, మందుగుండు సామగ్రి మరియు కొన్ని దేశవాళీ తుపాకులు ఉన్నాయి. వీటితో పాటు మావోయిస్టులకు సంబంధించిన యూనిఫామ్‌లు, కిట్ బ్యాగులు మరియు విప్లవ సాహిత్యాన్ని కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు లభించడంతో ఆ ప్రాంతంలో అదనపు బలగాలను రంగంలోకి దించారు. మావోయిస్టులు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని ఈ పేలుడు పదార్థాలను అమర్చాలని భావించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నామని, అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

## 'బ్లూబర్డ్ బ్లాక్-2' ప్రయోగం ముంగిట తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్

తిరుమల, డిసెంబర్ 22 (భారత శక్తి ): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టే ప్రతి కీలక ప్రయోగానికి ముందు దైవ దర్శనం చేసుకోవడం దశాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయం. ఈ ఆనవాయతీని కొనసాగిస్తూ, ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సీనియర్ శాస్త్రవేత్తలు, లాంచ్ టీమ్ సభ్యులతో కలిసి ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. డిసెంబర్ 24న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి చేపట్టనున్న LVM3M6 మిషన్ విజయవంతం కావాలని కోరుతూ వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వాణిజ్య ప్రయోగంలో భాగంగా, ఇస్రో తన హెవీలిఫ్ట్ లాంచ్ వెహికల్ LVM3 రాకెట్ ద్వారా అమెరికాకు చెందిన 'ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్' సంస్థ అభివృద్ధి చేసిన 'బ్లూబర్డ్ బ్లాక్2' ఉపగ్రహాన్ని లో ఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనుంది. ఈ శాటిలైట్ ప్రయోగం ముఖ్య ఉద్దేశం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ప్రత్యేక హార్డ్‌వేర్ అవసరం లేకుండా నేరుగా సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకే హైస్పీడ్ సెల్యులార్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడం. దీని ద్వారా 4G/5G వాయిస్, మెసేజింగ్, స్ట్రీమింగ్ వంటి సేవలు అందుబాటులోకి వస్తాయి. షార్‌లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించనున్నారు.

## తెలంగాణను వణికిస్తున్న చలి...
## పలుచోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు!

హైదరాబాద్, డిసెంబర్ 22 (భారత శక్తి ): తెలంగాణ రాష్ట్రాన్ని చలిగాలులు వణికిస్తున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లెలో 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 7, ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 8.3, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో 8.7, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 9.5, కామారెడ్డిలో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (IMD) ఏడు జిల్లాలకు కోల్డ్ వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో డిసెంబర్ 26 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, వరంగల్‌తో సహా 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. రానున్న 24 గంటల్లో హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం వేళ పొగమంచు కురిసే అవకాశం ఉందని, గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 28, 13 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ బులెటిన్‌లో పేర్కొంది.

## తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంలో కీలక మార్పు

హైదరాబాద్, డిసెంబర్ 22 (భారత శక్తి ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. నిన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్ష భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీన్ని స్వాగతిస్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ వెల్లడించింది. ఇక, మహాలక్ష్మి పథకం కారణంగా ఆర్టీసీ బస్సుల్లో రద్దీ అమాంతం పెరిగింది. ఉచిత బస్సు సౌకర్యం కోసం మహిళలలు పోటెత్తుతుండడంతో జీరో టికెట్ జారీ చేసే సమయంలో కండక్టర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాంతో జీరో టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు జేఏసీ తెలిపింది. ఈ విషయాన్ని ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యాల దృష్టికి జేఏసీ తీసుకెళ్లింది. ఈ క్రమంలోనే మే 6న రవాణా శాఖ మంత్రితో జరిగిన సమావేశంలోనూ ఈ విషయం ప్రస్తావన రావడం, దానికి మంత్రి సానుకూలంగా స్పందించడం జరిగిందని పేర్కొంది. ఇక, నిన్న డిప్యూటీ సీఎం ఆధ్వర్యంలో జరిగిన ఆర్టీసీ సమీక్షా సమావేశంలో మహిళలకు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల ఆర్టీసీ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది.

## అన్నా క్యాంటీన్ లో ఉచిత అన్న వితరణ నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, డిసెంబర్ 22 (భారత శక్తి ): స్థానిక ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత నాలుగున్నర సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత అన్నా క్యాంటీన్ కు ఈ వారం దాత కాట్రావులపల్లి గ్రామానికి చెందిన సుంకర రమాదేవి జ్ఞాపకార్థం వారి భర్త మాజీ సర్పంచ్ సీతారామయ్య అందించిన ఆర్థిక సహాయంతో నిర్వహించిన అన్న క్యాంటీన్ కు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, హైదరాబాద్ నుండి సూర్య ఉపాసకులు విక్రమాదిత్య హాజరై పేదలకు అన్నదానం చేశారు. ముందుగా ఎన్టీఆర్ స్మారక మందిరంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం ఎన్టీఆర్ ఫోటో ఎగ్జిబిషన్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి విక్రమాదిత్య తిలకించారు. ఈ సందర్భంగా విక్రమాదిత్య మాట్లాడుతూ, నాలుగున్నర సంవత్సరాలుగా ఒక మహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఈ సందర్భంగా అభినందిస్తున్నానని ఎన్టీఆర్ పేదవాళ్లు ఆకలితో ఉండకూడదని కోరుకునే వారని, వారి ఆకాంక్షను ఇక్కడ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, వారి అనుచర గణం, పాలచర్ల నాగేంద్ర చౌదరి వీరందరూ కలిసి ఉచిత భోజనం ప్రతి సోమవారం 500 మందికి ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్న వీరందరినీ అభినందించవలసిన విషయం అని, అన్నం పరబ్రహ్మ స్వరూపం అది ఆకలితో ఉన్న అందరికీ అందించాలనే కార్యక్రమం తీసుకున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఒక గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తి అని ఆయన కొనియాడారు.



ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, తిరుమల శ్రీనివాస్, పాలచర్ల నాగేంద్ర చౌదరి, సుంకవిల్లి రాజు, వేములకొండ జోగారావు, బోండా రాజేష్, దుర్గపు ప్రకాష్, అడబాల సత్తిబాబు, ఎండి కాజా, సాంబతుల చంద్రశేఖర్, నాగిరెడ్డి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై

# ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్

"శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ భారతదేశానికి చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు".

2012, ఫిబ్రవరి 26న మద్రాస్ విశ్వవిద్యాలయంలో జరిగిన రామానుజన్ 125వ జయంతి ప్రారంభ వేడుకల్లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును "జాతీయ గణిత దినోత్సవంగా" ప్రకటించారు.అప్పటినుండి "డిసెంబరు 22"న దేశవ్యాప్తంగా పాఠశాలల్లో,కళాశాలల్లో మరియు విశ్వవిద్యాలయాలలో జాతీయ గణిత దినోత్సవం గా జరుపుకుంటూ వారి గొప్పతనాన్ని మరియు వారి ప్రతిభను గుర్తుతెచ్చుకుంటున్నారు.

ఒక సారి జబ్బుతో మంచం పట్టి ఉన్న ఒక వ్యక్తిని చూడటానికి ప్రొఫెసర్ హార్డీ గారు కారు కిరాయికి తీసుకొని వచ్చారు. పరామర్శ సందర్భములో తాను వచ్చిన కారుకు ఉన్న 1729 నెంబర్ ఏ మాత్రం ప్రాముఖ్యం లేనిదని, దురదృష్టమైన నంబరేమోనని అన్నాడు ప్రొఫెసర్ హార్డీ. వెంటనే మంచం మీద అనారోగ్యముతో ఉన్న ఆ వ్యక్తి ఇది చాలా ప్రాముఖ్యమైన సంఖ్య అని, అంతే కాక చాల ఆసక్తికరమైన సంఖ్య కూడా అని అన్నాడు. ఎలాగంటే "రెండు పూర్ణ సంఖ్యల ఘనాల మొత్తం రెండు విధాలుగా రాయగలిగే సంఖ్యలన్నిటిలోను ఇది అతి చిన్నది" అని వివరించాడు.అంటే 1729 అనే సంఖ్య 1 నీ 12 నీ విడివిడిగా ఘనీకరించి ఆ లబ్ధాలని కలిపినా వస్తుంది, లేదా 9 నీ 10 నీ విడివిడిగా ఘనీకరించి ఆ లబ్ధాలని కలిపినా వస్తుంది.

ఒక నంబర్ చెప్పగానే దాని ప్రాధాన్యతను వెంటనే వివరించిన ఆ మంచం మీద ఉన్న వ్యక్తే ప్రపంచ ఖ్యాతి గాంచిన భారతదేశానికి చెందిన గణితశాస్త్రవేత్త అయిన "శ్రీనివాస రామానుజన్ " గారు.

పైన చెప్పినటువంటి లక్షణం ఉన్న సంఖ్యలని "టేక్సీ సంఖ్యలు" అని కొందరు, "హార్డీ రామానుజన్ సంఖ్యలు" అని మరికొందరు అంటున్నారంటే ,ఆ సంఖ్యలకు ఉన్న ప్రాధాన్యతను వివరించిన వారి గొప్పతనం అలాంటిది మరి.

శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ భారతదేశానికి చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. పది సంవత్సరాల వయసులోనే గణితశాస్త్రంతో అనుబంధం ఏర్పరుచుకొని,చిన్న వయసులోనే గణితం పట్ల ఆశక్తిని పెంచుకున్నాడు. ఆ వయసులోనే త్రికోణమితి మీద రాసిన పుస్తకాలను చదివి పూర్తిగా అవగాహన చేసుకున్నాడు. పదమూడు సంవత్సరాలు నిండే సరికల్లా ఆ పుస్తకాన్ని పరిపూర్ణముగా అర్థం చేసుకొని, సొంతంగా సిద్ధాంతాలు కూడా తయారు చేయడం ప్రారంభించాడు.

రామానుజన్ డిసెంబర్ 22, 1887 నాడు తమిళనాడు రాష్ట్రం లోని ఏరోడ్ పట్టణములో జన్మించాడు. రామానుజన్ తండ్రి కె శ్రీనివాస అయ్యంగార్ ఒక చీరల దుకాణంలో గుమస్తాగా పని చేసేవారు. తల్లి కోమలటమ్మాళ్ గృహిణి. వీరు కుంభకోణం పట్టణంలోని సారంగపాణి వీధిలో, ఒక పెంకుటింట్లో నివసించే వారు. ఆ నివాసాన్ని ఇప్పుడు రామానుజన్ మ్యూజియంగా మార్చారు.

డిసెంబర్ 1889 లో రామానుజన్ కు మశూచి వ్యాధి సోకింది. అప్పటికి ఈ వ్యాధి సోకి చాలామంది మరణించారు.అదృష్టవశాత్తు ఆ ప్రమాదం నుండి బయటపడ్డాడు. తరువాత రామానుజన్ తల్లితోపాటు చెన్నైకి దగ్గరలో ఉన్న కాంచీపురంలో ఉన్న అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్లి ఉన్నాడు.1892 అక్టోబరు లో రామానుజన్ అదే ఊళ్ళో ఉన్న చిన్న పాఠశాలలో చదవడం ప్రారంభించాడు..రామానుజన్ తాత కాంచీపురం న్యాయస్థానం లోని ఉద్యోగం కోల్పోవడంతో, రామానుజన్ తల్లితో సహా కుంబకోణం చేరుకుని అక్కడ కంగయాన్ ప్రాథమిక పాఠశాలలో చేరాడు. నాన్న తరుపు తాత చనిపోవడంతో రామానుజన్ను మళ్ళీ మద్రాసులో నివాసం ఉంటున్న తల్లి తరుపు తాత దగ్గరికి పంపించారు. కానీ అతనికి మద్రాసులో పాఠశాల నచ్చలేదు. తరచూ బడికి ఎగనామం పెట్టేవాడు. అతని తాత, అమ్మమ్మలు రామనుజన్ బడిలో ఉండేటట్లుగా చూసేందుకు వీలుగా ఒక మనిషిని కూడా నియమించారు. కానీ ఆరు నెలలు కూడా తిరగక మునుపే కుంభకోణం పంపించేశారు.

తల్లి నుంచి రామానుజన్ సంస్కృతి సంప్రదాయాల గురించి, ఆచార వ్యవహారాల గురించి, పురాణాల గురించి, తెలుసుకున్నాడు. అనతి కాలంలోనే ఆంగ్లము, తమిళము, భూగోళ శాస్త్రం, గణితంలో పట్టు సంపాదిస్తు ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. మంచి మార్కులతో జిల్లాలో అందరికన్నా ప్రథముడిగా నిలిచాడు. 1898 రామానుజన్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో చేరాడు. ఈ పాఠశాలలోనే మొట్ట మొదటి సారిగా గణితశాస్త్రంతో పరిచయం ఏర్పడి, కాలక్రమంలో ప్రపంచం మెచ్చే వ్యక్తిని చేసింది.

15 ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. అప్పటికే అందులో చాలా సమస్యలు నిరూపించబడ్డాయన్న విషయం ఆయనకు తెలియకపోవడం చేత వాటిని తన పద్ధతితో సాధించి చూపారు.



**గడప రఘుపతిరావు**
**రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయ అవార్డు గ్రహీత. 9963499282**

1909, జులై 14వ తేదీన రామానుజన్ కు జానకీ అమ్మాళ్ అనే తొమ్మిదేళ్ళ బాలికతో వివాహమైంది.

లెక్కల వల్ల కొడుకుకి పిచ్చిపడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వవిద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది.

అప్పట్లో కొత్తగా ఒక గణిత శాస్త్ర సమాజాన్ని ఏర్పరిచిన డిప్యూటీ కలెక్టర్ రామస్వామిని కలిసి తనకొక చిన్న ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. తాను తీరిక వేళలో గణితం మీద రాసుకున్న నోటు బుక్కులను చూపించాడు. వాటిని చూసిన అయ్యర్ చాలా ఆశ్చర్య పోయి రామానుజన్ ప్రతిభ చాలా గొప్పదని గుర్తించాడు. తన వద్ద చిరుద్యోగిగా చేరడం బాగుండదని భావించి, మద్రాస్ లోని తనకు పరిచయం ఉన్న గణిత శాస్త్రవేత్తల దగ్గరకు తన సిఫారసు లేఖతో పంపించాడు.

రామానుజన్ రాసుకున్న పుస్తకాలను చూసిన కొద్ది మందిలో ఒకరైన జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్న రామచంద్రరావు మరియు భారతీయ గణిత శాస్త్ర సమాజములోని బృందానికి రామానుజన్ ప్రతిభ అమోఘం అని అర్థమైంది.ఒక దశలో ఆ రాసుకున్న నోట్స్ నిజంగా రామానుజన్ రాసినవేనా అనే అనుమానం కూడా వారికి కలిగింది.

రామానుజన్ ప్రతిభను గుర్తించిన నారాయణ అయ్యర్, రామచంద్రరావు, E.W. మిడిల్‌మాస్ట్ మొదలైన వారు రామానుజన్ పరిశోధనలను ఆంగ్ల గణిత శాస్త్రవేత్తలకు చూపించడానికి ప్రయత్నించారు. లండన్ యూనివర్సిటీ కాలేజీకి చెందిన ఎం.జే.ఎం. హిల్ అనే గణితజ్ఞుడు రామానుజన్ పరిశోధనలను చదివి,అందులోని తప్పులను సవరించడానికి తగిన సలహాలు అందించి ప్రోత్సహించాడు.

1913లో మద్రాస్ పోర్ట్ ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డాక్టర్ హకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్యర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన "కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డీ" కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. రామానుజన్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ అసలు తాను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ ఏదైనా ఉందంటే అది రామానుజాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే అని వ్యాఖ్యానించడం విశేషం. మార్చి 17, 1914న రామానుజన్ ఇంగ్లండుకు ప్రయాణమయ్యారు.

ఇంగాండులో పరిశోధన పత్రాలు రాయడానికి తగిని అవకాశాలు ఉంటాయన భావించి బయలుదేరాడు. పూర్తిగా శాఖాహారి అయిన రామానుజన్ అక్కడి భోజనము చేయలేక తానే స్వయంగా వండుకోవడం ప్రారంభించాడు. అయితే సరిగా తినకపోవడం వల్ల మరియు, ప్రతిక్షణమ పరిశోధనలపై దృష్టిపెట్టడం వల్ల అనారోగ్యానికి గురికావాల్సి వచ్చింది. ప్రతి రోజు పడుచున్న మానసిక శ్రమ వలన, వాతావరణ పరిస్థితులు పడనందున,ఆహారం సరిగా తీసుకోనందున ఎంతో శారీరకంగా అలసిపోయాడు. అయినప్పటికీ అకుంఠిత దీక్షతో ఎంతో శ్రమ పడి 32 పరిశోధనా పత్రాలు సమర్పించాడు. ఎన్నో కారణాల వల్ల తీవ్రమైన అనారోగ్యంతో అక్కడనుండి భారత దేశానికి బయలుదేరవలసి వచ్చింది.

రామానుజన్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 1919 మార్చిలో ఇంగ్లాండ్ నుండి భారతదేశానికి తిరిగి వచ్చాడు. వెళ్ళేటప్పుడు ఎలా ఉన్నాడో అలాకాక, పాలిపోయిన ముఖంతో,ఏమాత్రం బలం లేని శరీరంతో, అస్థిపంజరం వలే తిరిగి రావడం చూసి అక్కడ ఉన్నవారందరు చలించి పోయారు. అనేక రకాల వైద్యము చేయించినా ఆయన కోలుకోలేక పోయాడు. దాంతో ఆయన 1920, ఏప్రిల్ 26న పరమపదించాడు.

అతి చిన్న వయసులో ప్రపంచం ఆశ్చర్యపోయే మేధా సంపత్తిని కలిగిన ఒక గొప్ప గణిత శాస్త్రజ్ఞుడిని కోల్పోవలసి వచ్చింది.ప్రపంచానికి ఎన్నో గణిత సూత్రాలను అందించినా భారతదేశమే కాదు ప్రపంచం గర్వించదగ్గ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినం అయిన "డిసెంబర్ 22" ను దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం "గణిత దినోత్సవంగా" నిర్వహిస్తున్నారు..

ఫిబ్రవరి 28, 1918లో ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండవ భారతీయునిగా, 1918 అక్టోబరులో 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి' గౌరవం పొందిన మొదటి భారతీయుడిగా రామానుజన్ చరిత్రకెక్కాడు. రామానుజన్ నోటు పుస్తకాలపై, గణిత సిద్ధాంతాలపై రామానుజన్ ఇనిస్టిట్యూట్ లో, అమెరికాలోని 'ఇలినాయిస్' యూనివర్సిటీలో నేటికీ రీసెర్చ్ జరుగుతోంది.

గణిత శాస్త్రములో రామానుజన్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో రామానుజన్ 75వ జన్మదినం సందర్భంగా స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. అంతే కాక 125వ జయంతి సందర్భంగా 2012ను "జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా" ప్రకటించింది.

కానీ శ్రీనివాసన్ రామానుజన్ మరణానంతరం అంతటి ప్రతిభ గల గణితశాస్త్ర వేత్తలను భారతదేశం తయారు చేసులేకపోవడం దురదృష్టకరం. మానవ నాగరికత చరిత్రకు గణితాన్ని పరిచయం చేసిన ఆర్యభట్ట, భాస్కరుడు.... ఆ తదనంతరం రామానుజన్ వంటి గణిత మేధావుల పరంపర ఆ తరువాత కొనసాగలేదు. భవిష్యత్తులోనైనా ఈ లోటును నేటి విద్యార్థి లోకం భర్తీ చేయగలదని భావిద్దాం......

చరిత్ర ఉన్నన్ని రోజులు, గణిత శాస్త్రం ఉన్నన్ని రోజులు మన గణితజ్ఞుడైన రామానుజన్ సేవలు మరవలేనివి.

అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ ధన్యుడు......




## ప్రజలందరి సహకారంతో
# ఎండ్పల్లి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తా

* **ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో... ఎండ్లపల్లి గ్రామ సర్పంచి తాటిపాముల సుధీర్**

భారత శక్తి(సూర్యాపేట జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 22: రాజకీయ రాగద్వేషాలు లేకుండా ప్రజలందరికీ భాగస్వామ్యంతో ఎండ్లపల్లి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన సర్పంచి తాటిపాముల జానయ్య తెలిపారు. సోమవారం సర్పంచ్ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి దివంగత నేత రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి స్ఫూర్తితో ఎఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి,సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి, గ్రామ మాజీ సర్పంచి దండి రమేష్ సహకారంతో ఎన్నికైన వార్డు సభ్యుల ఐక్యమత్యంతో గ్రామ అభివృద్ధి కోసం ముందుకు వెళ్తామని సుధీర్ తెలిపారు. సర్పంచిగా తనను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన గ్రామ ప్రజలందరికీ రుణపడి ఉంటానని శక్తి వంచన లేకుండా గ్రామ ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం పాటుపడతానని అన్నారు.గ్రామంలో సమస్యలు ఉంటే రాజకీయరాగద్వేషాలు ఏవీ మనసులో పెట్టుకోకుండా తమ దృష్టికి వార్డు సభ్యుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి ఉయ్యాల ఆదినారాయణ,వార్డు మెంబర్లు పంతంగి జయసుధ, చంద జానయ్య, పబ్బిలి రమేష్, గడ్డం నిర్మల, ఉప్పల వీరస్వామి, దాసరి సంధ్య, సూరారపు సొక్కమ్మ, గుండెబోయిన సతీష్, కొలిశెట్టి భార్గవి, కాటి వెంకన్న, పోరండ్ల సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

* **అధికారులు సమన్వయంతో పనిచేయాలి**
* **సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



కరీంనగర్, డిసెంబర్ 22(భారతశక్తి ప్రతినిధి): జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్లో సమ్మక్క జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సమ్మక్క సారలమ్మ జాతర జరిగే ప్రదేశాల్లో అధికారులంతా సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. జాతర ప్రదేశాల్లో వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని, హైమాస్ లైట్ లు భారీ కేడ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మించాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు జాతర ప్రాంతాల్లో నీటి వసతి కల్పించాలని తెలిపారు. మునిసిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది జాతర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇప్పటికప్పుడు చెత్తాచెదారం సేకరించాలని ఆదేశించారు. తాత్కాలికంగా కరెంట్ పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు అమర్చాలని, జాతర ప్రాంతంలోని మట్టి రోడ్లపై దుమ్ము రాకుండా స్ప్రింకర్ ద్వారా నీటిని చల్లే ఏర్పాట్లు చేయాలని అన్నారు. రేకుర్తి జాతర ప్రాంతంలో జాతర జరిగే రోజుల్లో ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటి నీరు విడుదల చేయాలని అన్నారు. ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉంచాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. జాతర జరిగే రోజుల్లో 108 వాహనం, మందులు, డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్, రోడ్లు భవనాలు, ఇరిగేషన్, మున్సిపల్ తదితర శాఖ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతర సమయాల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతరలో ఆపదమిత్ర వాలంటీర్ల సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో 21 చోట్ల సమ్మక్క జాతర ఉంటుందని తెలిపారు. రేకుర్తి, హుజురాబాద్, కేశవపట్నం, వీణవంక, జూపాక, చల్లూరు, చింతకుంట, హౌసింగ్ బోర్డ్ కాలనీలలో జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సుప్రియ, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 60 దరఖాస్తులు



కామారెడ్డి జిల్లా, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 22: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో మొత్తం 60 దరఖాస్తులు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికల అనంతరం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతున్నదని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుండి దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, డీడబ్ల్యూఓ వ్యవసాయం, విద్య, వైద్యం, పెన్షన్ తదితర శాఖలకు సంబంధించిన 60 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జడ్పీ సీఈఓ చందర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.